ఆంధ్రసచిత్రవారపత్రిక



21-3-75
60 పైసలు



Thomas/DCM 18m/tel

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 - 1972)

శుక్రవారం : 21-3-'75

ఆనందనామ సం. ఫాల్గుణమాస శు. అష్టమి

సంపుటము : *68* సంచిక : *27*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

★

సంవత్సర చందా – రు. 33-80 పై.
ఆరుమాసాల చందా – రు. 16-90 పై.
విడిప్రతి వెల 60 పైసలు

ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520003.

విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ :
హిందీ నటి జీనత్ అమన్
(ఫొటో : శ్రీ కాంతిలాల్ ఖత్రి)

మనలో మాట

పాఠకులు ఉత్సాహంగా పాల్గొని, కుతూహలంతో ఎదురుచూస్తున్న ఫిలిమ్ బ్యాలట్ ఫలితాలు పైవారమే వెల్లడి చేస్తున్నాము ... 'ఈ సారి ఉత్తమ నటీనటులు ఎవరెవరు ? ఉత్తమ చిత్రం ఏది ?' అన్న ప్రూహాగానాలు చేయటంలో కూడా కొంత మందికి సరదా వుంటుంది. కనుక ఈ వారం రోజులు వారివారి జాబితాలను తయారుచేసి వుంచుకొని పైవారం వెలువడే ఫలితాలతో పోల్చి చూసుకోవచ్చును.

రచయితలు మేము అవకాశమైనప్పుడల్లా మనవి చేస్తున్న నియమాలను, నిబంధనలను అంతగా పాటించటం లేదనిపిస్తోంది. రచనతోపాటు హామీ పత్రం–తిరస్కరింపబడిన పక్షంలో రచనను తిరిగి పొందాలనుకొనేవారు తగినన్ని తపాలా బిళ్లలు అంటించిన కవరు పెట్టడం–మరిచి పోతున్నారు. రచనలు సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం–విజయవాడ 520003 అన్న చిరునామాకే పంపాలి. వ్యక్తుల పేర పంపటంవల్ల పరిశీలన ఆలస్యం అయ్యే ప్రమాదం ఎక్కువ.

ఉత్తరాలు

ముఖచిత్రం

7—3—75 నాటి పత్రికకు "లక్ష్మి" ముఖ చిత్రం వన్నె నిచ్చింది. చాలానీటుగా ఉండి, నన్నెంతో ఆకర్షించింది. తరుచూ, హిందీ నటీమణుల ముఖ చిత్రాలను కూడా ప్రచురితం చేస్తే బాగుంటుంది.

అహం—అనురాగం సీరియల్ వారానికి వారము నవ చైతన్యమును సంపాదించుకొంటుంది. భర్త వున్న చోటనే, భార్యఉంటే స్వర్గం అంటారు. అలాంటి జీవితానికి విరుద్ధంగా జీవించే, శ్యామల పాత్ర చాలా నచ్చింది.

మహమ్మద్ జహీర్ అహమ్మదు, (పలమర్తి)

కథలు

21—2—75 వారపత్రికలోని 'దాహం' అన్న కథలోని ఇతివృత్తం మన సాంఘిక దురాచారాన్ని చిత్రిస్తూ శ్రీ ఎ. వి. వి. నరసింహారావుగారు చాలా బాగా వ్రాశారు.

హెచ్. అనసూయాదేవి (వెంకటగిరిటవున్)

* * *

"ఇది సారా (రో) కథ" చిన్న కథైనా చాలా బాగుంది "రాజీ" కథ చదువుతుంటే గొప్ప నవల చదువుతున్న అనుభూతిని పొందాను. తరువాత పెద్ద కథ అని చూచి చింతించాను. రామాయణాన్ని మూడు ముక్కల్లో చెప్పినట్లుగా జరిగే అక్రమాన్ని "దాహం" కథలో వ్రాశారు. "జరిమానా" కథ మన పత్రికకు అందాన్ని, మాకు ఆనందాన్ని ఇచ్చింది.

కె. గీతాకుమారి. (విజయవాడ-2)



ప్రముఖ రచయిత పి. జి. వుడ్‌హౌస్, వారి సతీమణి. 1971 లో తీసిన చిత్రం.

"చిగురించిన జీవితం"చాలా బాగుంది కథల్లో ముఖ్యంగా ఇదిసారా (రో) కథే బాగుంది. (21—2—75) వెలువడిన భారతి ముఖచిత్రం చాలా బాగుంది.

డి. ఎస్. కుమార్ (వెల్లూరు.)

* * *

పెద్ద ఆఫీసర్లని వివాహ మాడాలని తమ జీవితాల గురించి బంగారు కలలుకనే కన్నె పిల్లలకు కనువిప్పు కలిగిస్తుంది. "రాజీ" కథ.

బి. మల్లికార్జున దీక్షితులు (కాకినాడ.)

సీరియల్

"చిగురించిన జీవితం"లో శ్రీధర్ పాత్ర చాలా ఉదాత్తమైనది. శ్రీనివాస్‌చే, దగాపడి అనుక్షణమూ ఆవేదనతో కుమిలిపోతూ, మిక్కిలి బాధకు గురి వుతున్న తన చెల్లాయిపై ఎటువంటి కళంకము పడకూడదని, ఇటు, అటు సంఘంలో తమకున్న వంశ గౌరవ మర్యాదులు నాశనం కాకూడదని, రెండిటి మధ్య అడకత్తెరలో పోకచక్కలా నలిగిపోతూ, చిరునవ్వుతో ఎదుర్కొంటున్న సమస్యలను, ఆయాతీరులు, పాత్ర చిత్రీకరణ ప్రశంసనీయంగా వుంది.

టి. దాలయ్య, సూరాడ నారాయణరావు,. యస్. జోగేశ్వరరావు, యస్. గురుమూర్తి, యస్. ఇ.రైల్వే హిమ్‌గిర్, సుందర్‌గర్ జిల్లా ఒరిస్సా.

* * *

ముఖ చిత్రాల్లో తరుచూ నటీమణులతో పాటు నటులవి కూడా వేయండి.

కె. సూర్యనారాయణ, బి. ప్రసాదరావు రాయగడ (ఒరిస్సా.)

ఫాలాక్షుని డైరీ

గుండె జబ్బును తెలిపే రంగు ఇంజక్షన్

రేడియో ధార్మికశక్తి కల ఒకరకం రంగును శరీరంలోకి ఇంజక్షను ద్వారా పంపితే ఆ వ్యక్తికి గుండె జబ్బు ఉన్నదా లేదా అన్న విషయం తెలిపోతుందని "యునైటెడ్ స్టేట్స్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్" అనే పత్రిక వెల్లడిచేసిందట. గుండెకు సంబంధించిన కొన్ని నాళాలు చచ్చుపడిపోతే ఆ ప్రదేశంలో కాల్షియం స్ఫటికాలు ఏర్పడుతాయని, యీ "రంగు" పదార్థం ఆ స్ఫటికాలను ఎత్తి చూపగలదని, అనక ప్రత్యేకమైన కెమెరాతో ఫోటో తీస్తే ఆ ప్రదేశం ఎంతభాగం దెబ్బతిన్నదో సులభంగా తెలిసిపోతుందని యీ పత్రిక రాసిందట.

ఫర్నిచర్ కొరకు ప్రదర్శన

తమ స్కూలుకు చుట్టూ ప్రహరిగోడ లేక పోవడమేగాక స్కూలులో కూర్చోడానికి బెంచీలు, ఉపాధ్యాయులు కూర్చోడానికి కుర్చీలు, పాఠాలు లెక్కలు చెప్పడానికి బ్లాక్‌బోర్డులు (నల్లబల్లల నవ్వా) కూడా లేవని రాజమండ్రి దానవాయిపేట మున్సిపల్ హైస్కూలుకు చెందిన అయిదొందలమంది విద్యార్థినీ విద్యార్థులు పెద్ద ఊరేగింపుగా మున్సిపల్ ఆఫీసుకు వెళ్లి కమిషనరుగారికి విన్నవించారట—వో స్పింతేనా! వీళ్లింత ఆర్భాటం చేస్తేగానీ ఆయనకీ విషయం తెలియలేదా!

కాఫీ. రబ్బరుతోటల యజమాని హత్య


కేరళకు చెందిన మిస్టర్ యం. సి. జార్జి అనే ప్రముఖ వ్యాపారవేత్తను బెంగుళూరులో ఆయన నివాసంలో ఎవరో 16వ తేదీన పీకనులిపి చంపి పారిపోయారట. ఆయన కాఫీ, రబ్బరుతోటల యజమానిట. పందెం గుర్రాలు కూడా కొన్ని ఆయనకున్నాయట. ఆయనని చంపినవారు ఆయనకారు తీసుకుని పారిపోయి, కారును లాల్‌బాగ్ ప్రాంతంలో వదిలేశారట.

రక్తాన్ని కోరే రోడ్లు

మాచెర్ల నుంచి శ్రీశైలం ప్రాజెక్టు వైపుకు రెండు సిమ్మెంటు తొట్టెలను తీసుకు పోతున్న లారీ ఒకటి 17వ తేదిన మాచెర్లకు 65 కిలోమీటర్ల దూరంలో వున్న వో పెద్ద రాయిని ఢీకొని, భంగపడి, పక్కగా ఒరిగి పడిపోయిందట. ఫలితంగా ఆరుగురు చనిపోయినట్టు, ముగ్గురికి పరిస్థితి విషమంగా ఉన్నట్టు, తొమ్మండుగురికి వో మాదిరి గాయాలు తగిలినట్టు తెలిసిందట.

ఘాట్‌రోడ్డు పై ఘోర ప్రమాదం

తిరుమల తిరుపతికొండ రెండవరోడ్డు మీద, 17వ తేదిన దేవస్థానం బస్సు తలక్రిందులైనందుకు ఫలితంగా ఐదుగురు చనిపోడం, నలభైమంది గాయపడ్డం జరిగిందట.



కుక్కల్ని చంపి బ్రతికించారా ?

జార్జియా (యునైటెడ్‌స్టేట్సు)కు చెందిన ఎమురి విశ్వవిద్యాలయం సైకాలజిస్టు డాక్టర్ రోకాయన వో తజను కుక్కలను తీసుకుని వాటిని పోటు పెట్టి ఆ పోటు ఉష్ణోగ్రతను నెమ్మదిగా 40, ఫారన్హీటుకు తగ్గించాడట. దాంతో ఆ కుక్కల గుండె, మెదడులు మొద్దుబారి స్తంభించి పోయాయట (అనగా కుక్కలు చనిపోయినట్టు లెక్కట) తరువాత వాటిని ఆ స్థితిలో వో రెండు గంటలు వుంచి నెమ్మదిగా ఉష్ణోగ్రతను పెంచితే మళ్లీ అవియధాస్థితికి వచ్చాయట. ఇది మనుష్యుల మీద కూడా విజయవంతంగా ప్రయోగించ గలిగితే విజ్ఞానానికి చాలా ఉపయోగపడుతుందనాయనన్నారట.

వైద్యునికే తెలీని జబ్బు !

కర్ణాటక రాష్ట్రానికి చెందిన సాగర్ జిల్లాలో పోయిన నెలలో వచ్చిన వింతజబ్బు వాతపడ్డ 150 మంది రోగులను ఢిల్లీ ఆలిండియా యిన్స్టిట్యూటాప్ మెంటల్హెల్త్ న్యూరాలజిస్టు డాక్టర్ కె. ఎస్. మణి పరీక్షించిన పిదప తన "యిన్నాళ్ల వైద్య వృత్తిలో" గాని, "వైద్య విజ్ఞాన గ్రంథాల్లో తనకు తెలిసినంత వరకు"గాని యీ రకం జబ్బును గురించిన ఏ విషయం తను చూడలేదని ఒప్పేసుకున్నారట. అసలీ జబ్బు స్వభావ మెట్టిదో వో నిర్ణయానికి రాడానికి కనీసం ఆర్నెలలయినా పట్టవచ్చునని ఆయనన్నారట. అన్నాళ్లూరుకునేకన్నా వెంటనే యీ జబ్బు ఏమిటో కనుక్కుని, నివారణోపాయాన్ని సూచించిన మేధావికి తగు సన్మానం చేయబడునానవాని కేంద్ర ప్రభుత్వం ప్రకటించరాదా !

మొగమాట మెరుగని అవినీతి

లారీకి పాతిక రూపాయలు యిస్తేగాని ప్రతిస్త్రీడి లారీ అయినా చెక్‌పోస్టువారు వదిలేదిలేదని, చెక్‌పోస్టులు అవినీతి కుప్పలయిపోతున్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుగారంటూ తాను ఇండస్ట్రీస్ మంత్రిగా ఉన్నప్పుడు తనవూరు ఖమ్మం నుంచి హైదరాబాద్‌లో కట్టుకుంటున్న యింటికి రెండు లారీల కలప తెప్పిస్తుండగా వాటిని ఆపి, లారీ లెవరివో తెలుసుకుని కూడా చెక్‌పోస్టు చెక్కు చెదరక పాతికేసి రూపాయల మామూలు వసూలుచేసి వదలిందని పేర్కొన్నారట—భళా !

జీతాలు పొందని పంతుళ్ళు

పెద్దాపురంలోని 19 మునిసపల్ స్కూళ్లకు చెందిన అరవై ముగ్గురు ఉపాధ్యాయులు జీతప్పురాళ్ళ కళ్ళజూసి అర్నెల్లయిపోయిందట.

ఏదో జోడైతే–కళ్ళే పోతై.

కళ్లను సరిగా పరీక్ష చేయించుకోకుండా ఏ జోడు పడితే అది కళ్లకు పెట్టుకుని దానితో కాస్త చదవ చూడపీలవుతోందిలే అని సరిపెట్టుకోడంవల్ల కంటి చూపు మరింత దెబ్బతినడమేగాక, కళ్ళే దెబ్బతినే ప్రమాదం, చూపే పోయే ప్రమాదం వుందని నంద్యాలలో డాక్టర్ శివారెడ్డి అన్నారట.

ఫొటాక్సుని డైరీ



"నా అభిమాన నటుణ్ణి తిడితే ఒకటీ నన్ను తిడితే ఒకటీనా ?"

పొగ త్రాగనివారి పౌర హక్కు

పొగ త్రాగని వానికి కూడా పౌరహక్కు ఉన్నదని, త్రాగే వాడు ఒదిలే పొగవల్ల త్రాగనివాడి వూపిరి తిత్తులు కూడా దెబ్బతనచ్చని, కనుక తమ ఆరోగ్యం ఆ విధంగా నాశనం చేసుకోకుండా చూసుకునేహక్కు తమకున్నదని వాషింగ్టన్‌లో గౌయిన్ అనే ఆమె నాలుగేళ్ల క్రితం స్థాపించిన "పొగ త్రాగని వారి సంఘం" యీనాటి వూరేగింపు సందర్భంగా అన్నదట. "నువ్వొదిలే పొగ నా ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నది" అని రాసున్న బొత్తాములు, కరపత్రాలు ఆ సంఘం పంచిపెట్టిందట. తన తండ్రి పొగత్రాగి వూపిరితిత్తుల కాన్సరుతో నాలుగేళ్ల క్రితం చనిపోయాక తానీ సంఘం స్థాపించినట్టు ఆమె చెప్పిందట.





కొలుతున్న ప్లాస్టిక్ కాగితాలను పట్టుకున్నట్టు వేళ్లు భగ్గుమన్నాయి — నరనరాల వ్యాపించిన విచిత్ర భావనేదో—గుండెల్లో ఆవిర్లు కక్కుతోంది –

ముచ్చెమటల్లోని వేడి విచి తంగా శరీరాన్ని చుటు ముడుతోంది–చచ్చుపడినట్లున్న చేతిని అతి పయత్నంమీద జేబులోనుంచి బైటకి తీశడు డాక్టర్ దయానంద్.

వేళ్లింకా మండుతున్నాయి. బలహీనంగా వొణుకుతున్నాయి. తిరిగి జేబులోకి వెళ్లబోయిన చెయ్యి – అప్రయత్నంగా ఆగిపోయింది –

సెగలు కక్కుతున్న వచ్చనోట్ల వేడికి భయపడికాదు. దానిని సంపాదించి పెట్టిన తన అమానుష చర్యకి తట్టుకోలేకాదు –

మానవత్వాన్నే మసిచేసిన మనసుకు సమాధానం చెప్పుకోలేక –

వృత్తి ధర్మానికే తిలోదకాలిచ్చిన – తన ప్రవృత్తిని సమాధానపరచలేక –

నీర్సంగా కూర్చున్న డాక్టర్ దయానంద్ భారాన్ని మొయ్యటం ఇష్టంలేనట్టు–చిన్నగా శబ్దంచేస్తూ – ఇబ్బందిగా అటూ ఇటూ తిరుగుతోంది రివాల్వింగ్ ఛైర్.

ప్రతి చెమట బిందువులోనూ మండుతున్న అగ్ని కణాలను ఆర్పడం ఇష్టంలేక రివ్వవ-మెత్తగా – కొత్తగా తిరుగుతోంది సీలింగ్ ఫాన్. దయానంద్ గుండెల్లో – ఎప్పడూ ఎరుగని సుడిగుండాలు సుళ్లు తిరుగుతున్నాయి. అతని మస్తిష్కంలో – ఎన్నడూ తెలియని పెను తుఫాను విలయ తాండవం చేస్తుంది. ఎంతో ప్రయత్నంమీద –నుదుటి నుండి మెడదాకా ఖర్చీఫ్‌తో తుడుచుకుంటున్న డాక్టర్ దయానంద్, బైట నుంచి లీలగా విన్పిస్తున్న మాటలను వినాలని అతి ప్రయత్నం మీద వ్యర్ధ పయత్నం చేశాడు.

అది వ్యర్ధం కాకపోగా – ఎండిన తాటాకుల్ని ముట్టుకున్న చిరుమంటలా గుండెను కాల్చింది.

"ఇలా జరుగుతుందని మాకు ముందే తెల్సు. ఈ కేసు అటువంటిది మరి. ఎంత ప్రయత్నం చేస్తే మటుకు ఏంలాభం ? – ఇరవైనాలుగ్గంటల్లో ప్రాణాల్ని తీసే మాయదారి జబ్బొచ్చి పడినప్పడు.

అప్పటికీ డాక్టరుగారు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఎంతో శ్రద్ధగా ఇప్పటిదాకా కృషి చేశారు...చూస్తూనే వున్నారుగా అక్కడకీ మీరు తెచ్చుకోలేరని–కావల్సిన మందులన్నీ స్వంత ఖర్చుల మీదే కొన్నారు. చూశారుగా ... !"

బైట సిస్టర్ చిలకపలుకులు పలుకుతోంది.

అదురుతున్న కణతలు అరచేతి మధ్య బిగించిన డాక్టర్ దయానంద్ తల వంచుకుని మౌనంగా వుండిపోయాడు.

భయంకరమైన బొమ్మకి అందమైన రంగులు వేస్తోంది సిస్టర్ — అంతకన్నా భయంకరమైన నిజాన్ని–మృదుత్వంతో మలుస్తోంది–తన వృత్తి ధర్మాన్ని– అతి నేర్పుతో చాకచక్యంతో నిర్వర్తిస్తోంది సిస్టర్—

కానీ తను ?

ఎందుకో ఎడమకన్ను విపరీతంగా అధురుతోంది-ఎప్పడూ లేనిది – గుండె నిండుగా గుబులు బరువుగా నిండిపోతోంది – చిరుచెమటలు సన్నని మంటల్లా చుట్టుముడుతున్నాయి–

"డాక్టరుగోరు- దేముడి లాంటోరు. కన కనే- ఈవరదాకా తిండి తిప్పలు మాని-ఆడి

పేనంకోసం — కుత్తి పట్టారు ... కట్టు నుకాలు తెలిసిన మారాజు కనకే — సొంత డబ్బులు మందులకోసం చిల్ల పెంకుల్లా ఎదజల్లారు ... —

నరస్సమ్మా ... — అరినీ అనటంలా— నిన్నూ అనటంలా ... — మా పారబ్దాన్నీ...— మా కరమనీ ... అనుకుంటున్నాము ... — ఒక్కగానొక్క నలుసు నిచ్చినట్టే ఇచ్చి ... లాక్కెళ్లిపోయిన ఆ దేవుడిని అంటన్నాము ... — ”

ఒక్కగానొక్క కొడుకుని పోగొట్టుకుని కూడా — తనమీద సడలని వాళ్ళ నమ్మకం—

తనని కాల్చేస్తోంది—

తనని దేముణ్ని చేసిన వాళ్ల మంచితనం—

తన గుండెను పిండేస్తోంది — తప్పంతా దేముడి మీదికే నెట్టేసిన వాళ్ళ అమాయకత్వం — తనని శపిస్తోంది.

శపిస్తోంది — భగవాన్—

అంతలో హృదయవిదారకమైన ఏడుపులు— మృత్యువు నొక్కిన గుండెకోసం - గుండెలు కలవాళ్ల — గుండెలవిసే ఆర్తనాదాలు.

కాటుతిన్న మంచితనం — కాటు వేసిన మనిషిని —నిలువునా దహిస్తున్నట్టు—హాస్పిటలంతా మారుమ్రోగుతున్నాయి.

డాక్టర్ దయానంద్ బరువుగా ముందుకు నడిచాడు — తన అడుగులు భూదేవి గుండెలు నొక్కేస్తున్నట్టనిపించినా — తన కుతూహలం తననే పరిహసిస్తూ నవ్వుతున్నా— నిర్లిప్తంగా నిలబడిపోయిన డాక్టర్ దయానంద్ కళ్లకి జరుగుతున్నదంతా అస్పష్టంగా కన్పిస్తోంది.

చేతికందిన ఇరవై ఏళ్ల కొడుకుని పోగొట్టుకున్న నిర్భాగ్యుల కళ్లు—కాటిలో సగం కాలిన కొరకంచుల్లా మండుతున్నాయి.

ఎండి పిడచగట్టుకుపోయిన వాళ్ల గొంతుల్లోంచి ఆర్తనాదాలు ప్రేత సంగీతంలా అపశ్రుతులు పలుకుతున్నాయి. గుండె నిండుగా పండించుకున్న అనురాగం నిష్ఫలంగా భళ్ళున పగిలిన కుళ్ళు గుమ్మడిలా — కొడుకు శవంమీదపడి, వాతావరణాన్ని భీభత్సం చేస్తున్నాయి.

దగ్గరకు వెళ్లబోయిన దయానంద్ ఆగిపోయాడు — కాదు ఆపేశాయి.

కల్మష మెరుగని ఆ నిరుపేదల హృదయాలు దయానంద్ అంతరాత్మపై దెబ్బ కొట్టి ఆపేశాయి.

అమాయక ప్రాణాలతో — ఆటలాడుకుని జేబులు నింపుకునే డాక్టర్ల అంతరంగం తెలియని నిర్మలమైన వాళ్ల చూపులు ఆపేశాయి.

ప్రాణాలతోనే వ్యాపారం మొదలు పెట్టిన తన క్రౌర్యాన్ని ఇంకా కృతజ్ఞతతో చూసిన వాళ్ల జాలిచూపులు - ఆ చూపుల్లోని నిస్సహాయమైన వెల్లువ—చల్లగా పాదాల కంటినట్టూ మెల్లగా గుండెనుతాకినట్లై—ఆగిపోయాడు.

కొన్ని గంటల క్రిందట-వాళ్ల కళ్లలో మెరిసిన జీవనజ్యోతి— ఇప్పుడు కొడిగట్టి అంధకారాన్ని పులుముతోంది.

కొంతకాలం క్రితం—వెలుగు నిండిన వాళ్ల గమ్యం ఇప్పుడు అగమ్యమై — అంధకారమయమైంది—వాళ్లకున్న ఒకే ఒక్క ఆధారం ముక్కలు ముక్కలైంది— కారణం వాళ్లు ఊహించలేరు.

వాళ్ల నిర్మలత్వం నిజాన్ని ఆలోచించనివ్వదు.

ఐనా — నిప్పులాంటి నిజం — తనగుండెని కాల్చక వొదుల్తుందా ?

వాళ్ల కడుపుశోకం—తన...!ముచ్చెమటలు పోశాయి డాక్టర్ దయానంద్‌కి— జేబులో వున్న పచ్చ కాగితాలు—గుండెను క్రిందకి లాగుతున్నాయి.

ప్రేగుల్ని మెలి పెడుతున్నాయి అంతలో.

నల్లటి టాక్సీ-పెద్ద శబ్దం చేస్తూ— గుమ్మంలో ఆగింది— హడావుడి పడిపోతున్న ఐదారుగురు స్టూడెంట్సు—ఒక శరీరాన్ని టాక్సీలోంచి కిందికి దింపుతున్నారు—

వాళ్ల మొహాల్లో కళలేదు— వాళ్ళ చేతుల నిండా ఆదుర్దా— ఆ చేతుల్లో మెలికలు తిరుగుతున్న...'

బలమైన మంచుకొండ, బలంగా మొహానికి తగిలి నట్లైంది దయానిధికి—

అగ్నిపర్వతం శగలు కక్కుతూ గుండెల్లో ఒక్కసారిగా పగిలింది—

పదునైన కసాయి కత్తి—ఒక్కవేటున— ప్రేగుల్ని నరికింది.

“బాబూ—!”

ఆర్తనాదం గుండె మంటల్లో చిక్కుకుపోయింది— కర్తవ్యం ప్రేగుముక్కల్లో నొక్కులు పడుతోంది—

అంతలో “అందరం పిక్నిక్‌కి సరదాగానే వెళ్లాము—వెళ్లినకాసేపటిదాకా బాగానే వున్నాడు. తరువాత వంట్లో బాగా లేదని దేంట్లోనూ పార్టిసిపేట్ చెయ్యకుండా పడుకున్నాడు... మాకేం తెలుసు...మామూలు నుస్తీ అనుకుని నెగ్లెక్ట్ చేశాం... ప్రొద్దున్నే లేచేసరికి—కడుపునొప్పితో ఉండలు చుట్టుకుపోతున్నాడు...ఎప్పట్నుంచి అలా బాధ పడుతున్నాడో...మాతో మాటమాత్రం చెప్పలేదు—”

డాక్టర్ దయానంద్ చెవుల్లో—హోరులో అస్పష్టంగా విన్పిస్తున్నాయి.

కన్నీటి పొరలను చీల్చుకుని అతి ప్రయత్నం మీద చూశాడు—

టేబిల్ మీద—తన రవి—తన ప్రాణం—తనకున్న ఒకే ఒక్క బంధం— తన గుండెల్లో వెలిగే—ఒక్కగా నొక్క దీపం—తన కడుపులో కదిలే ఒకే ఒక్క ప్రేగు—

—నరకయాతన పడుతున్నాడు.

—మరణబాధ పడుతున్నాడు.

“ నానీ — ! ”

అరుపు ఆర్తనాదంలా వచ్చింది-

కేసు అర్థమైంది ... —

కర్తవ్యం వెల్లువలా ముందుకు నెడుతోంది—


అప్రయత్నంగా తన చేతులు చూసుకుంటూనే ఆగిపోయాడు—అందులో తను తీసిన అమాయక ప్రాణం—

— ప్రతిఫలంగా తను తీసుకున్న పచ్చనోట్లు—

నిర్దాక్షిణ్యంగా—తన చేతులు పులుముకున్న పసినెత్తురు — తద్వారా శాశ్వతంగా తనతో పాలు పంచుకోబోయే - పాపం—దాని తాలూకు శాపం—

‘ భగవాన్ ! ! ! ’

మంచు ముక్కలమధ్య తడిసిన శవంలా నీరు కారిపోయాడు డాక్టర్ దయానంద్ —



సార్ ! ఇది — నేను రికమండేషన్లను నిరసిస్తూ రాసిన ఘాటైన వ్యాసం ! దీన్ని మీ వీక్లీలో ప్రచురించమని మీ తమ్ముడు గారు రాసిన సిఫారసు ఉత్తరం దీనితో జతపర్చాను ! !

"సిస్టర్ – !"

గొంతు చించుకున్న ఆ అరుపులో స్మశానంలోని గ్రద్దలు నవ్వాయి-కంగారు పడుతున్న సిస్టర్ – ఒక్క పరుగున డాక్టర్ దగ్గర కొచ్చింది–

ఫ్లూ వచ్చినట్టు వణికిపోతున్న డాక్టర్ వంక జాలిగా చూసింది.

"సిస్టర్...డాక్టర్ ప్రసాద్‌ని... పిలు... అర్జంట్...ఇంటస్టైనల్ అబ్‌స్ట్రక్షన్–బాబుకి– ఆపరేషన్–అర్జంట్–"

ఏదోలోకంలో వున్నట్టు, అసంపూర్తిగా మాట్లాడుతున్నా విషయం అర్థమైంది సిస్టర్‌కి–

"బాప్‌రే-!"

ఒక్క గంతులో ఫోన్ దగ్గరకు వెళ్లిన సిస్టర్ చేతులు చురుగ్గా పనిచేస్తున్నాయి–

"సార్ ! డాక్టర్ ప్రసాద్ అవుటాఫ్ స్టేషన్‌ట–"

డాక్టర్ దయానంద్ కళ్ళ ముందు పిడుగులు పడ్డాయి.

"సిస్టర్...ప్లీజ్ కాల్...డాక్టర్ శంకర్!" దయానంద్ గొంతు పీలగా వొణుకుతోంది–

"........."

"——"

"సార్...డాక్టర్ శంకర్... ఎమర్జెన్సీ ఆపరేషన్‌లో వున్నారుట–"

"........."

"డాక్టర్ రమాదేవి–ఇప్పుడే-సిజేరియన్

తనదాకా వస్తే గాని..

ప్రారంభం చేశారుట...!"

"మై గాడ్– !"

డాక్టర్ దయానంద్ పిడికెళ్లు భయంతో బిగుసుకున్నాయి. దవడలు బలంగా బిగుసుకుపోయాయి.

గుండెలో రక్తం గడ్డ కట్టుకుంటోంది–

"సారీ...ఆపరేషన్‌కి–తండ్రిగా మీరు అటెండవటం కష్టమే ... ఐనా గుండె రాయి చేసుకోండి... బాబు కండిషన్ ఏమీ బాగా లేదు... మరో డాక్టర్ కోసం చూస్తూ కూర్చుంటే అసలుబాబే దక్కకపోవచ్చు...సార్ సార్–! "

డాక్టర్ దయానంద్ సిస్టర్ మాటలు వింటూనే అయోమయంగా బాబుని చూశాడు. పరిస్థితి చెయ్యిదాటిపోయే ప్రమాదం కన్పించింది–ఏమాత్రం–ఉపేక్షకీ– ఆస్కారంలేదు. వెంటనే సర్జరీ చెయ్యాలి–సర్జరీ–

డాక్టర్ దయానంద్ నరాలు. అంగుళం అంగుళం పుటుక్కున తెగుతున్నట్టుగావుంది.

రక్తం గడ్డకట్టి–నీటిని చిమ్ముతున్నట్టుంది. తన 'నానీకి' తను ఆపరేషన్ చేయాలి.... కనీసం ఇంజక్షన్ కూడా తన బిడ్డకు స్వయంగా ఇవ్వలేని తను ప్రాణాలకు తెగించి– ప్రాణం నిలబెట్టుకోటం కోసం–ప్రాణాంతకమైన మేజర్ ఆపరేషన్ చెయ్యాలి –తన చేతులతో– తన బిడ్డ పొట్టను నిర్దాక్షిణ్యంగా కొయ్యాలి. వాడి చిన్నారి ప్రేగుల్ని–..."

మరొక ప్రేగు మంట బైటనుంచి సూటిగా గుండలకు తాకింది.

'బాబూ–రావుడూ–మమ్మల్నెంజేసి పోయావురా బిడ్డా– మీ అయ్య నాదిలి–ఇక నుంచీ...వొంటరిగా ఏడ తొంగుంటావురా... అయ్యా..., నువ్వనేక మీయమ్మ కూడెట్టా తింటుందిరా రాజా – !"

డాక్టర్ దయానంద్ చేతులు చల్లబడుతున్నాయి. గుండె మంచు ముద్దతో కప్పినట్టుంది–

తన ప్రమేయం లేకుండానే ఎమర్జన్సీ ఆపరేషన్‌కి కావల్సిన తతంగమంతా చెకచెకా జరిగిపోతోంది.

తన బాబుదగ్గరకు వెళ్లటానికి–తనకాళ్లే సాహసించటంలేదు.

తన నానీని నిమరటానికి – తన పాపిష్టి చేతులే ముందుకు సాగటంలేదు.

తన బాబుకోసం–కన్పించని భగవంతుడ్ని ప్రార్థిద్దామన్నా – కలుషపూరితమైన తన మనసుకు ధైర్యం చాలటంలేదు.

స్నేహితులే బాబుని థియేటర్లో దింపి వచ్చారు – వాళ్ల మంచి మనసులైనా తన బాబుని రక్షించకూడదా ? – రక్షించవా ??

యాంటిసెప్టిక్ లోషన్‌తో చేతులు కడిగినా – బ్రష్‌తో రుద్దినా – మరిగే నీటిని పోసినా... అవి శుభ్రపడటంలేదు... పవిత్ర

మవటంలేదు...

అదేపనిగా చేతులు రుద్దుకుంటున్న డాక్టర్‌వంక తెల్లబోయి చూస్తున్నాడు — వాటర్ పొయ్యటానికి నిలబడ్డ థియేటర్ బోయ్.

'త్వరగా వెడితే–తన బాబు పొట్టను చీల్చాలి ... తనాపని చెయ్యలేడు... కానీ చెయ్యాలి... తప్పదు ... ఆలశ్యం అవుతే బావుండును ఆపరేషన్ మొదలుపెట్టటానికి కానీ — క్షణంకూడా ఆలశ్యం అవటానికి వీల్లేదు...

ఎలా? తన చేతులు...శుభ్రపడటంలేదే...

శాపగ్రస్తమైన ఈ చేతులతో చేసే ఆపరేషన్ విజయవంతమౌతుందా ?

ఏ పాపమూ ఎరుగని తన బాబుకి తన పాపం అంటకుండా వుంటుందా ?

అంటుతుందా ???

'అంటితే ? ఎలా ? ఎలా ?'

చలన రహితంగా నిలబడ్డ డాక్టర్ దయానంద్ ఎప్రన్‌కు తాళ్లు బిగిస్తున్న థియేటర్ అసిస్టెంట్..., మతిపోయినట్టున్న డాక్టర్‌ని మతిపోగొట్టుకుని చూస్తున్నాడు.

అన్నీ రెడీ చేసుకున్న సిస్టర్ కళ్లప్పగించి చూస్తోంది. నిజానికి ఎంతో కంగారుగా నిముషాలమీద జరగవలసిన ఆపరేషన్ ఇది.

అతి ప్రయత్నం మీద పెద్ద కొండలా కదిలిన డాక్టర్ దయానంద్.

స్కాల్‌పెల్ పట్టుకుని — బాబు మొహం లోకి ఒక్కసారి చూశాడు.

మూర్తీభవించిన పవిత్రత మెరుపులా కొట్టింది. తనూహించని తేజస్సేదో — కళ్ళలో సూదులు గుచ్చాయి. స్కాల్‌పెల్ పట్టిన చెయ్యి కొలిమిని కట్టిన దర్భలా కాలుతోంది.

ఆపరేషన్ చెయ్యవలసిన ఫీల్డ్‌లో రాముడి లేతపొట్ట ప్రాంతం ఎగిరెగిరి పడుతున్నట్టు మెరుస్తోంది.

రక్తనాళాలు వెచ్చటి ఆవిరితో ఉబ్బాయి– మెదడులోని రక్తంవెల్లువలా బైటకి ప్రవహిస్తున్నట్టుంటే, పంచరంగులూ కళ్లల్లో తిరిగాయి — వాటిలో —

జబ్బనేదే లేని రాముడి ఆరోగ్యవంతమైన శరీరం — చిన్న బిళ్ళతో పోయే సామాన్యమైన కడుపునెప్పి—రాముడి తల్లిదండ్రుల అమాయకత్వంతో కూడిన తీర్చలేని ఆవేదన.

దాన్ని ఆసరాగా తీసుకుని మూడు పచ్చ నోట్లకోసం తన ఆరాటం. అది కల్పించిన అవసరం – తన అవసరానికి, అవసరంగా — రాముడికి ఎమర్జెన్సీ ఆపరేషనే...

అందులో స్పైనల్ షాక్...

ఎమర్జెన్సీ డ్రగ్స్‌కోసం... వాటిని కొనలేని — వాడి తల్లితండ్రుల అసమర్థతని దృష్టిలో వుంచుకుని, చేతులారా వాడి ప్రాణం కోసం — పచ్చనోటును మార్పించలేక ... అనవసరంగా వాడి ఆయువును పరీక్షించిన తన కాలయాపన...

ఫలితంగా... ఇది హత్య అని బయటకు తెలియని... తెలియలేని — కోల్డ్ బ్లడెడ్ మర్డర్ — దానివల్ల అమాయకులకు తీరని గర్భశోకం...

గర్భశోకం... గర్భశోకం...

"సార్ — !"

సిస్టర్ పెట్టిన చావుకేకకి – ఇన్‌సిషన్ ఇవ్వబోతున్న డాక్టర్ దయానంద్ చేతులు పట్టుతప్పాయి.

నెత్తిమీద మంచు పర్వతం బ్రద్దలైంది— సిస్టర్ కేకకి అర్థం ???

అర్థమైంది.

'తన పాపిష్టి చేతులతో ఆపరేషన్ చేయించుకునేటంతటి అపవిత్రుడుకాడు తన బాబు...'


తన రక్తాన్ని పంచుకున్న పాపానికి – తన పాపాన్ని పంచుకోటానికి సిద్ధంగాలేడు తన బాబు...

'ఇక లేడు తన బాబు...'

నిల్చున్న పళంగా కూలిపోతున్న డాక్టర్ దయానంద్‌ని పట్టుకోవటం, అసాధ్యమైపోయింది.

ఇంద్రధనస్సు

శ్యామల



కనకాంబరం రంగుపూలు ఉన్న తెల్లని జార్జెట్ చీర ధరించి లాన్‌లో పూల మొక్కలవద్ద కూర్చొని ట్రాన్సిస్టర్ వింటున్న రత్నను చూస్తుంటే మనస్సెంతో హాయిగా అనిపించింది కుసుమకి. రేడియో పాటతో పాటు కూనిరాగాలు తీస్తున్న రత్న అక్క రాకని గమనించలేదు.

"యెలుతురంతా మేసి యేరు నెమరేసింది కలవరపు నాబతుకు కలతనిదరయ్యిందీ–"

"రత్నా! కాఫీ"

"థాంక్స్, అక్కా" కాఫీకప్ అందుకుంటూ అన్నది రత్న "ఈ పాట వింటుంటే నీ జీవితాన్నిగురించే రాసినట్టుంది!"

నవ్వింది కుసుమ–"నాసంగతికేమిలే కాని, నీ జీవితం ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను నేను. ఈ గారాల చెల్లిని ఎంత గారాబంగా చూసుకొనే మొగుడు రావాలో– ఈ రత్నం ఎవరి జీవితాన్ని అలంకరించాలో– అప్పుడు మా వంటివాళ్లం అసలు జ్ఞాపకం వస్తామా–" అల్లరిగా అన్నది.

"పో అక్కా!" సిగ్గుపడింది రత్న. అంతలోనే ఆమె దృషి దూరంగా– మబ్బులతో నిండిన ఆకాశంలో మూలగా సప్త వర్ణాలలో మెరుస్తున్న ఇంద్ర ధనస్సుపై పడింది "అటువైపు చూడు, ఎంత అందంగా ఉందో! ఇంద్రధనస్సుని చేతో తాకాలని, ముద్దు పెట్టుకోవాలనీ అనిపించటం లేదూ–!?"

"జీవితమే ఓ రంగుల చక్రం కదూ?" చిన్నగా అన్నది కుసుమ.

రేడియోలో పాట సాగిపోతూనే ఉన్నది–

"ఒక్కతెను నాకేల ఓపజాలని ఈసుకము."

"అక్కయ్య గురించే రాశారు ఈ పాట" మూడ్ మారిపోగా బాధగా అనుకుంది రత్న, బొట్టులేని కుసుమ ముఖాన్ని చూస్తూ.

రిటైర్డ్‌జడ్జి కేశవరావుగారి అమ్మాయిలు వాళ్లిద్దరూ. కుసుమని చూడగానే అందగత్తె అని ఎవరూ అనలేరు. సన్నగా, పొడుగ్గా చామనచాయలో అతి సామాన్యంగా ఉంటుంది ఆమె. ఆమెలో ఆకర్షణీయమైనవి ఆమెకళ్లు మాత్రమే. మనసులోని భావాలన్నిటినీ అద్దాలవలె ప్రతిఫలింపజేస్తూ, ఏదో అపురూపమైన వెలుగుతో నిండిన ఆ విశాల నేత్రాలనిచూసినవారు ఎవరయినా "చెప్పుకోదగిన అందం లేకున్నా ఈమె ముఖంలో మంచి కళ ఉంది" అనక మానరు. రత్న అక్కకన్నా కాస్త పొట్టి. చక్కని కనుముక్కు తీరుతో అందంగా ఉండే రత్న ఒక చైతన్యస్రవంతి. సదా సంతోషంతో, ఏవేవో ఊహాలతో, ఆశలతో జీవితాన్ని ఒక బంగారు స్వప్నంగా భావించే ఆమె గంతులేసే లేడి పిల్లని జ్ఞప్తికి తెస్తుంది.

"వంశీ దగ్గర్నించి ఉత్తరం వచ్చింది!" అంటూ అక్కడికి వచ్చారు కేశవరావుగారు కుసుమచేతికి కవరు సందిస్తూ– "త్వరలో



ఆమె సున్నితమైంది...
ఆమె అర్థంకానిది...
ఆమె మృదువైంది, దృఢమైంది,
సౌందర్యం సంతరించుకున్నది...
అందుకే ఆమె పరిపూర్ణ స్త్రీ...
పట్టువంటి టాల్క్... అనురాగపూరితమైనది. మిమ్మల్ని
అలరించేందుకే ... సరిక్రొత్త సువాసనలతో మిమ్మల్ని
రంజింపచేసేది...క్షణక్షణం మీలో అపూర్వానుభూతిని
కల్గించేందుకు ప్రత్యేకంగా రూపొందించబడింది. అదే మీ
వీయిల్ ఆఫ్ లౌ... హేలో మాత్రమే సమర్పించగలిగేది.
హేలో
వీయిల్ ఆఫ్ లౌ టాల్క్
NEW
Halo
VEIL OF LOVE
TALC
ప్రత్యేకమైన
రూ 1.50 తగ్గింపు
అవకాశం
మా ప్రతి ఎకానమీ సైజ్
ప్యాక్ ఖరీదులో

వస్తాడట" అన్నారు ఆత్రంగా, ఆనందంగా, అంటూనే ఇంటిలోనికి వెళ్లారు భార్యకి ఆ వార్త చేరవేయటానికి

కేశవరావుగారి ఆప్తమిత్రుడు నారాయణ గారి ఏకైక పుత్రుడు వంశీమోహన్. కోరుకొండ సైనిక స్కూల్‌లో అతడు చదువుతూండగా తండ్రి హఠాత్తుగా మరణిస్తే కేశవరావు గారు దగ్గరకు తీశారు. బంధువర్గాన్నంతా వదిలి ఆస్తిపాస్తుల బాధ్యతను, కొడుకు సంరక్షణ భారాన్ని స్నేహితుడు కేశవరావుగారిపై వదిలారు నారాయణగారు. పెద్దవాడై సైన్యంలో పనిచేస్తున్న వంశీ మోహన్ వీళ్ల కుటుంబసభ్యుడుగానే మసులుతూ శలవలకు ఇక్కడికే వస్తూ ఉంటాడు. అతనికి, కేశవరావుగారికీ మధ్యనున్న బంధం చిత్రమైనది. వయస్సులలో తారతమ్యం చాలా ఉన్నా ఆప్తమిత్రులవలె సంచరిస్తూంటారు.

కవరులోనించి ఉత్తరం వెలుపలికి తీసింది కుసుమ. వంశీ ఉత్తరాలంటే ఆమెకు చాలా యిష్టం. ఏ కారణం వలననో కాని జీవితం పట్ల వంశీ దృక్పథం విషాదంతో, నిరాశావాదంతో నిండి ఉంటుంది. అందరికీ ఆనందం కలిగించే: అతనికి అర్థం లేనివిగా తోస్తాయి. పిక్నిక్‌లు, సినిమాలు, సిగరెట్లు, సరదాలు— అతనికి ఎన్నడూ లేవు. సాధారణంగా ఏ యువకుడిలోను అగుపించని భారం అతని ఆలోచనల్లో ఉన్నది. ఏదో విషాదపు పొర అతని జీవితాన్ని సదాక్రమ్మి ఉంటుంది. ఏదో కారణంగా అతడికి అలవడిన విషాదం, కుసుమకి జీవితంలోని అనుభవాల వలన ఎదురయింది. రెండు సంవత్సరాల క్రితం ఇంజనీరుగా పనిచేస్తున్న రాజారావుతో ఆమె వివాహం అయింది. ఎన్నో సంబంధాలు చూసి, చివరికి కేశవరావుగారికి అన్నివిధాలా నచ్చి ఎంతో సంతోషంతో జరిపిన శుభకార్యం అది. పెళ్ళినాటి రాత్రి రాజారావు కారులో విడిదికి తిరిగి వస్తూండగా, కారు రోడ్డు ప్రక్కనఉన్న పెద్ద చెట్టుకి ఢీకొన్నది. డ్రైవరు కొద్ది గాయాలతో బ్రతికి బయటపడినాడు కాని, రాజారావు అప్పటికప్పుడే మరణించాడు.

కుసుమ ఉత్తరం చదవసాగింది.

"ప్రియమైన మామయ్యకి,

బంగ్లాదేశ్‌లో పాక్‌సేనలు మనకి లొంగిపోయినాయి! మనమిప్పుడు విజేతలం!

కాని ఈవార్త నాకు ఉప్పొంగే ఆనందాన్ని

కొన్ని కోరికలు !

ఇవ్వండి మాకో నిచ్చెన
మూడంతస్తుల మేడనెక్కేందుకు కాదు,
ఆకాశాన్నంటే ధరల నందుకొనేందుకు.
ఇవ్వండి మాకు మంచి ట్రీట్‌మెంట్.
మలేరియా వచ్చిందని కాదు.
మానవత్వము మరిచిపోతున్నందుకు.
యివ్వండి మాకో తుపాకి.
మనుషులను చంపేందుక్కాదు.
మనసులలో మతభేదాలను కాల్చేందుకు.
మసలుకోండి ఐక్యతతో,
పరదేశాన్ని పాలించేందుక్కాదు.
అవినీతిని పెంచేందుక్కాదు.
మానవత్వము నిల్పేందుకు.
మంచిని పెంచేందుకు.

—శేఖర్ మరియు హరి

ఇంద్ర ధనస్సు

కలిగించటం లేదంటే నమ్ముతావా? అలాగని దుఃఖాన్నీ కలిగించటం లేదు!

రాత్రిపూట వెచ్చని మంటవద్ద, మరింత వెచ్చని రగ్గు కప్పుకుని పడుకున్నప్పుడు— డేరా కంతల్లోనించి కనిపిస్తున్న నక్షత్రాలు నిండిన ఆకాశాన్ని చూసినపుడు - ఇంకా ఒంటరిగా ఉన్న మరెన్నో సమయాల్లో—నాకు ఎదురయ్యేది ఒకటే ప్రశ్న—

'వంశీమోహన్! నీవు ఇక్కడ ఎందుకు ఉన్నావు?'

నాకు ఎవరిపట్లా ద్వేషం లేదు. పాక్ సైనికులను చంపాలని కోరికలేదు. ఎవరిపైనయినా కాల్పులు జరపవలసి వచ్చినప్పుడు, 'ఇతనుకాని, ఇతని తలిదండ్రులుకాని, ఇతని భార్యాపిల్లలుకాని నాకేమీ హాని చేయలేదే? ఇతనిని నేనెందుకు చంపాలి? వారినందరినీ ఎందుకు బాధించాలి?' అనిపించి మనసు వికలమవుతుంది. కాని అతను మరో దేశానికి చెందినవాడు: నేను ఈ దేశానికి చెందినవాడిని. నా దేశం, ఆ దేశం ప్రస్తుతం శత్రువులు. కనుక అతన్ని నేను చంపాలి; తప్పదు! ఏమిటిదంతా? ఎవరు సృష్టించారు ఈ శత్రుత్వాన్ని? మనిషికీ, మనిషికీ ఎందుకీ విభేదాలు? దేశానికి, దేశానికి ఎందుకీ భేదాభిప్రాయాలు? దేనికి ఈ రక్తపాతం, ఈ హింస? ఏందుకోసం ఇదంతా??

అన్నీ ప్రశ్నలే! వేటికీ సమాధానం తెలియదు!

పక్కనే హాయిగానిదురిస్తున్న నామిత్రుడు సిక్కు సైనికున్ని చూస్తే, ఇతనికి ఇన్ని ఆలోచనలు లేవేమిటనిపిస్తుంది! అతనికి శత్రువుని ఓడించాలనే తీవ్రకాంక్ష ఉంది. తాను జయించాలనే కోరిక ఉంది. కీర్తి పొందాలనే ఆశఉంది.

నాకు ఏవీలేవు! గెలుపు, ఓటమి...వీటికి అర్థమేలేదు!

నాది నిరాశావాదం అని నాకు తెలుసు. జీవితానికే అర్థంలేదని నేనంటే నా మిత్రులు నవ్వుతున్నారు. 'నీకు ఇంకా వివాహం కాలేదు భాయ్! అందుకే ఇలా మాట్లాడుతున్నావు. నీవే కావాలనుకొనే స్త్రీ నీకు తోడుగా జీవితంలో ప్రవేశించినపుడు, నీవారు అనుకోవటానికి పిల్లలు కలిగినపుడు ఇలా మాట్లాడవు!' అంటున్నారు. వారు చెప్పేదీ నిజమేనేమో!

ఏమైతేనేమి-యుద్ధం ముగిసింది. రక్తపాతం, కన్నీళ్లు ఆగాయి.

ఇంకొక నెలరోజుల్లో ఇంటికి వస్తున్నాను.

కుసుమని, రత్నని అడిగాననిచెప్పు. నీకు, అత్తయ్యకి నమస్కారాలు.

— వంశీ మోహన్.

ఉత్తరం సగంలో ఉండగానే రత్న చెవులు కుసుమ స్వరాన్ని వింటున్నా, మనస్సు అందులోని విషయాలు వినటం మానివేసింది. ఆమెకి వంశీ అంటే ఎంతో ఇష్టం. సినిమా హీరో జుట్టులాగా నుదుటిమీదపడే అతని జుట్టంటే మరీ ఇష్టం. తనవైపే చూస్తున్నా, తననిదాటి ఎక్కడో చూస్తున్నట్లుండే అతనికళ్లు, బరువైన అతని స్వరం ఇంకా ఎంతో ఇష్టం. కానీ ఉత్తరాలు మాత్రం కాస్త బోరే...అనుకుంది. గడ్డిపై వెనక్కివాలి రేడియో ఆపుజేసింది. అయినా ముత్యాలకోవవంటి ఆ దస్తూరి తనకి మహా ప్రీతి. "ఇంకొక నెల రోజుల్లో వస్తాడట" అన్న తండ్రి మాటలు తలచుకొంటుంటే తెలియని ఆనందంతో నిండిపోయింది మనసంతా. క్రితంసారి వచ్చినపుడు – నాలుగు సంవత్సరాల క్రితం – సరిగ్గా పదిరోజులే ఉన్నాడు. తను స్కూల్‌ఫైనల్ పరీక్షలు రాసి ఫలితాల కొరకు ఎదురుచూస్తున్న సమయం అది. మిలిటరీ దుస్తులలో గేటు

వద్ద జీపుదిగి హుందాగా లోనికి నడిచి వస్తుంటే చూసింది బాల్కనీ లోనించి. అంతే.. తన మనసు పారవేసుకుంది ఆ క్షణం లోనే. నవ్వుతూ తలచుకుంది ఆ దృశ్యాన్ని.

ఉత్తరం చదవటం పూర్తిచేసిన కుసుమ రత్నని చూసి, కెంపుల్లా మెరిసిపోతున్న ఆమె చెక్కిళ్ళని గమనించి వాటిభావం అర్థం చేసుకుంది. అమ్మకి, నాన్నకి కూడా ఉన్నది ఈ ఉద్దేశమే. తన ముద్దుల చెల్లి, ప్రియ స్నేహితుడు భార్యాభర్తలు కావటం కన్న కావలసినదేముంది? వంశీ ఈసారి శలవ ఎన్నాళ్ళ పెట్టాడో! పెళ్ళి చేసుకొని వెళ్తే బాగుండును! అసలు అతని మనసులో ఏముందో!? అయినా, రత్నని కాదనే మూర్ఖుడు ఉండడు ఎక్కడా. చెల్లి మనసు లోని కోరిక తీరేందుకు తను శాయశక్తులా ప్రయత్నించాలి — వంశీ! నీకు ఏంతక్కువని ఎప్పుడూ బాధగా ఉంటావు? మా రత్న తన చలాకీతనంతో నీకు జీవితంలో హుషారు కలిగిస్తుందిలే!

* * *

వంశీ మోహన్ అరుదెంచే రోజు దగ్గరైంది. కేశవరావుగారి భార్య సుందరమ్మగారు హడావిడిపడుతూ గదులన్నీ సర్దిస్తున్నారు. ఈసారి అతనితో పెళ్ళి విషయం కదపాలని, రత్నని చేసుకోమని అడగాలని ఆవిడ ఆలోచన. రత్న బి. ఎ. ఈ సంవత్సరంతో పూర్తయింది. పెద్దపిల్లకి రెండేళ్లనాడు పెళ్ళి చేస్తే దాని బ్రతుకలా మోడులా అయింది. కుసుమని ఇరవైఏళ్ళ లేత వయస్సులో వితంతువుగా చూస్తుంటే ఆవిడ కడుపు తరుక్కుపోతూంటుంది. మళ్ళీ రత్న పెళ్ళి— ఇంట్లో శుభకార్యం అనుకుంటేనే ఆవిడ గుండెలో దడగా అనిపిస్తున్నది. అయినా చేయగలిగేదేమున్నది? పుట్టిందే ఇద్దరు పిల్లలు ... వాళ్ళే రెండు కళ్ళుగా పెంచుకు వచ్చారు—పిల్లల్ని కన్నాను కాని వాళ్ల రాతల్ని కన్నానా—అనుకుంది బాధగా. వంశీ చిన్నతనం నించి తెలిసినవాడు, బుద్ధిమంతుడు. అతన్ని చేసుకుంటే రత్న సుఖపడుతుంది ... ఎంత డబ్బున్నా కుసుమ జీవితంలోకి సుఖం తేలేను కదా ... కళ్ళు తుడుచుకొని హాల్లోని సోఫా కుషన్స్ మార్చసాగారు ఆవిడ.

మేడమీద గదిని వంశీ కొరకు సిద్ధపరుస్తున్నది కుసుమ. ఈ సాయంకాలమే ... ఇంకా కొన్ని గంటల్లో అతను వస్తాడు. కుండీలో పూవులు అందంగా అమరుస్తుంటే లోనికి వచ్చింది రత్న. కుర్చీలో కూర్చొని వారపత్రిక తిరగవేస్తూ అక్కని చూడ సాగింది.

"అక్కా, వంశీ ఎంత మారిపోయి ఉంటాడో! చూసి నాలుగేళ్ళయింది. ఇప్పటి ఫాషన్స్ ప్రకారం చెంపలు అవీ పెంచుకొని వస్తాడేమో కదూ!"

నవ్వింది కుసుమ. "అతను అంత త్వరగా మారే మనిషి కాడు రత్నా! ఇంకా స్ప్రేపట్లో వస్తాడుగా చూద్దువుగానివి ... అప్పుడే ఇంత ఆత్రుతా?"

ఇంతలో వాకిట్లో టాక్సీ ఆగిన శబ్దం వినబడగా ఇద్దరూ కిటికీలోనించి బయటకు చూశారు. గేటువద్దకు తండ్రి వడివడిగా వెళ్లటం, టాక్సీలోనించి దిగిన యువకుని అలింగనము చేసుకోవటం కనిపించింది.

"అరె! అప్పుడే వచ్చేశాడు!" ఆత్రంగా, ఆశ్చర్యంగా, ఆనందంగా అంది రత్న. కుర్చీలో నించి లేచి క్రిందకి పరుగెత్తింది.

కుసుమకూడా లేచి వెళ్ళబోతూండగా ఏదో ఆలోచన ఆమెను వెనక్కు లాగింది. తను వితంతువు... అపశకునం అంటారు... నమ్మకమున్నా లేకున్నా...ఏదైనా అశుభం జరిగితే తనకే కష్టంగా ఉంటుంది... ఎదురుగా వెళ్ళటం మంచిది కాదు... కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఉత్సాహమంతా చప్పబడగా కుర్చీలో కూలబడింది.

"హల్లో రత్నా!" వంశీమోహన్ చాపిన చేతులని తన చేతుల్లోకి తీసుకుంటూ విప్పారిన వదనంతో అతన్ని చూసింది రత్న.

"వంశీ! 'విక్టరీ' పొంది వచ్చావు!!" ఉత్సాహంగా ఉంది.

అతనునవ్వాడు. అతని నవ్వులో ఏదో వ్యంగ్యం ఉన్నదని జాగ్రత్తగా గమనిస్తే అవి పించక మానదు. రత్న అదేమీ గుర్తించలేదు.

"ఎన్నాళ్ళకి రావటం వంశీ! చూసి ఎన్ని ఏళ్ళుగడిచాయి!" మరో సోఫాలో కూర్చుంటూ అన్నది.

"ప్రయాణంతో బడలికగా ఉన్నావేమో— ముందు స్నానంచేసి వస్తావా? కబుర్లకేం, తర్వాత చెప్పుకోవచ్చు" కేశవరావుగారు అన్నారు.


"బంగారంవంటి పిల్లవాడు, పాడు యుద్ధంతో ఎలా నలిగిపోయాడో" అన్నారు సుందరమ్మగారు.

కాఫీ తీసుకొని వచ్చింది కుసుమ.

"థాంక్స్, కుసుమా!" అంటూ అందుకున్నాడు. పలకరింపుగా నవ్వాడు.

సమాధానంగా తిరిగినవ్వి మరో కుర్చీలో కూర్చొని పరిశీలనగా చూడసాగింది అతన్ని. మాసిన గడ్డము, లోతుగా కళ్లు... మునుపటి కళాకాంతులు లేవు అతని ముఖంలో. మనిషి ఎండిపోయినట్లున్నాడు. 'వంశీ,? ఏమిటి ఇట్లా అయిపోయినావు?' బాధగా అనుకుంది. గలగలా ఏదేదో మాట్లాడుతున్న రత్నని, నవ్వుతూ కబుర్లు వింటున్న వంశీని మార్చి మార్చి చూస్తూ 'నా చెల్లి ఆశలు తీరాలి. వీరిద్దరికీ పెళ్ళికావాలి' అనుకుంది.

రత్నని మురిపెంగా చూస్తూ కూర్చున్న



కుసుమ అంతా గొల్లున నవ్వటంతో ఉలిక్కి పడింది.

"ఏ లోకంలో ఉన్నావు కుసుమా? వంశీ ఇప్పటికి మూడుసార్లు పిలిచాడు."

"ఆఁ...ఏమిటి...?" సర్దుకుంటూ అంది.

"అంత మౌనంగా ఉన్నావెందుకు?' అడిగాడు వంశీ. "ఏమీ కబుర్లు చెప్పవేం?"

"చాలా కాలానికి వచ్చావు... నీవే చెప్పాలి కబుర్లు!"

"కరెక్ట్! ఏంత సేపూ వినటం తప్ప వంశీ మాట్లాడటమే లేదు! చాలా కబుర్లు చెప్తా డని ఆశగా ఉన్నాను నేను! అన్నది రత్న.

* * *

కాలం కులాసాగా గడిచిపోతున్నది వంశీ మోహన్‌కి. సుందరమ్మ, కేశవరావుగార్ల ఆప్యాయత, కుసుమ, రత్న అభిమానం–వీటి నడుమ రోజులు హాయిగా గడిచిపోతున్నాయి రత్నకి తన అందచందాలపైన, తెలివి తేటల పైన, అన్నిటికీ మించి తన వ్యక్తిత్వంపైన విశ్వాసం మెండు. చలాకీ కబుర్లతో, హుషా

ఇంద్ర ధనస్సు

రయిన ప్రవర్తనతో, ప్రతి పనిలోను ఉత్సాహం వెల్లివిరుస్తూ ఆకర్షణ గొల్పుతుంది' 'కుసుమ' అట్లా కాదు. అకాల వైధవ్యం వలన ఆమెజీవితంలో పడ్డ విషాదపు పొర ఆమె ప్రవర్తనలో మార్పు తెచ్చింది. ఎవరితోను ఎక్కువ మాట్లాడదు. వంశీతో అసలే సంభాషణ పెంచదు. అయినా తన పనులన్నీ ప్రచ్ఛన్నంగా ఆమే చేస్తున్నదని గ్రహించాడతడు. ఆమె పెద్దకళ్ళు ప్రపంచాన్ని జాలిగా చూస్తున్నట్లనిపిస్తుంది అతనికి. ఆ కళ్ళల్లోని భావాలు అర్థం అయి అవకా తికమక పెడుతున్నాయి. ఒక నిమిషం 'ప్రపంచమంతా నాదే' నన్నట్లు అందరినీ ప్రేమగా చూస్తూ మరో నిమిషంలో 'ఇదంతా ఎందుకోసం?' అన్నట్లు వైరాగ్యంగా చూస్తూ ఉండే ఆముఖాన్ని పదే పదే చూడాలనిపిస్తుంది. జీవితంలోని ఒంటరితనం పోవాలంటే ఈమె తోడుకావాలని, తన మనస్సులోని శూన్యాన్ని జయించాలంటే ఈమె మనసు తనది కావాలని, అనిపిస్తుంది. రోజులు గడుస్తున్న కొద్దీ కుసుమతో తన జీవితాన్ని పెనవేసుకోవాలని, ఆమె తనది కావాలని కోరిక అధికమవుతున్నది. అందువలననే ఒకరాత్రి భోజనాలయినాక కేశవరావు గారు–

"మీ నాన్న నీ గురించి నా పైన ఉంచిన బాధ్యత ఇంకా పూర్తి కాలేదోయ్! నీవు త్వరలో వివాహం చేసుకోవాలని మా కోరిక" అన్నప్పుడు,

"నేనూ అదే అనుకుంటున్నాను మామయ్యా! జీవితం కష్టసుఖాలు పంచుకోవటానికి, నాది అనుకోగలిగే వ్యక్తి కావాలి. తోడులేకుండా బ్రతకటం కష్టం కదూ?" అన్నాడు.

"మా రత్నని చేసుకో రాదూ?" నవ్వుతూ అనేశారు ఆయన.

"రత్ననా!?" ఆశ్చర్యంగా అన్నాడు. రత్నంటే తనకి ఇష్టము, అభిమానము

(35 వ పేజీ చూడండి)

సీరియల్

రంగులవల

పాలడుగు వెంకటేశ్వరరావు

8

(గత సంచిక తరువాయి)

మంజుల తెచ్చిపెట్టుకొన్న జబ్బు ఇంకా నయం కాలేదు.

రోజూ రాజారావు మంజులని డాక్టర్ సుందర్రావు హాస్పటల్‌కి తీసుకువెళ్లి తిరిగి వస్తూనె వున్నాడు. రోజురోజుకి మంజుల రంజుగా ముస్తాబు చేసుకుని వెళ్లివస్తోంది.

ఆ సుందర్రావు ధోరణే అర్థంకావటం లేదు. హాస్పటల్‌లో వున్నంతసేపూ ముభావంగా వుంటాడు. అవసారాన్కి మించి పెదవి విప్పి ఒక మాటా మాట్లాడడు. నలుగురూ వున్నారని సిగ్గేమో! సిగ్గు ముందుపుట్టి ఆ తర్వాత ఆయన పుట్టి వుంటాడు. అసలు ఇటువంటి మగపురుషులే ఆ తర్వాత భార్య అడుగులకి మడుగు లొత్తుతారు! గీచిన గీటు దాటరు. మగవాడి ఒక కాలుని తాడుతోకట్టి చేతిలో వుంచుకోవటం ఆడదానికి చాల అవసరం మరి!

తన ఆలోచనలకి తనే నవ్వుకుంది మంజుల.

ఆ వెంటనే ఆమె మొహం సిగ్గుతో ఎర్రనయింది.

ఇంటిదగ్గర మంజులని దించి రాజారావు కాలేజీకి వెళ్లాడు. ముసలాళ్లిద్దరూ బియ్యం ఏరుకొంటూ కబుర్లలో పడ్డారు.

అంతలో ఫోను మ్రోగింది.

'ఇంకెవరు ? ఆ మహానుభావుడే అయి వుంటాడు.' అనుకొంటూవెళ్లి రిసీవరు తీసింది మంజుల.

' హలో ఎవరు మాట్లాడుతూంట ? ' అంది మంజుల కటువుగానే.

'నేను సుందర్రావుని మాట్లాడుతున్నాను. మంజులేనా ?'

'అవును.'

కొన్ని క్షణాల నిశ్శబ్దం.

'ఏమిటి చెప్పండి' అంది మంజుల చిరాకుగా.

'నామీద కోపం వచ్చిందా డియర్ ?'

'మరి రాదా ?'

'మనిషి ఎదుటవుంటే నా నాలుక ఎదురు తిరుగుతుంది. అది నా బలహీనత. తర్వాత నా ప్రవర్తనకి నేనే సిగ్గుపడుతుంటాను. నన్ను త్వరగా నీ కొంగున ముడివేసుకోరాదా? అప్పుడు ఈ సిగ్గులు, బిడియాలు, భయాలు ఏమీ వుండవుగద అన్పిస్తుంది డియర్.'

మంజుల నవ్వుకుంది.

'అయితే ఇప్పుడు మీరు ఏమిటంటారు?'

'ఈ సరస నాకేం బాగా లేదు మీ దాగుడుమూతలు చాల ప్రమాదకరంగా వున్నాయి. ఏమయినా వుంటే సూటిగా చెప్పండి. అసలింతకీ మీ వుద్దేశ్యం ఏమిటి ? ఆడది ఒక ఆటవస్తువు అనుకొంటున్నారా ? ఈ దొంగాటలు అసలు నాకు నచ్చవు.' అంది తెగేసి.

అతను తత్తర పడ్డట్టున్నాడు.

'ఈ తప్పు కాయమంటున్నానుగా ? కాబోయే శ్రీవారిమీద ఆ మాత్రం జాలి చూపించాలేరా ఆధునిక నవలామణులు!''జాలి గొలిపేట్టు అన్నాడు.

మంజులకి నవ్వువచ్చింది. ఫక్కునన్వింది.

'అదిగో. అదిగో. అమ్మాయిగారు నవ్వారు. అదిచాలు నాకు. రేపు మరల వస్తావుగా!వూఁ?

'ఎందుకు ?'

'మిస్ మంజులని చూడకుండా నేను ఒక రోజు బ్రతకగలనా ?'

'అలాగేం, పాపం'

'దేవిగారు కాస్త కోపం తగ్గించాలి. అదిగో ఆ పెదాలు నవ్వుతున్నాయి. వాట్ని ముత్యాల వంటి పళ్లు అణిచి నవ్వుని బిగపట్టున్నాయి.'

మంజుల ఫక్కున నవ్వింది.

'ఇంతపిచ్చివాళ్లేమండి మీరు?'అంది.



'నిజంగా నిన్ను చూసాక నేను పిచ్చివాడ నయిపోయాను, రాణీ.'

'పాపం !'

'ఇవతల పేషంట్సు ముసురుతున్నారు. ఇక లాభం లేదు. ఎంత బిజీ అయినా, నీ ఆలోచనలు నన్ను వదలవు.'

'మరి వెళ్ళిరండి.'

'అబ్బ ! ఈ ఆడవాళ్ళగుండెలు ఎంతకఠిన మయినవి ?!'

'సర్లెండి. నేను ఫోను పెట్టేస్తున్నాను.'

మంజుల ఫోను పెట్టేసింది.

9

రాజారావు భూషయ్యకి వుత్తరం రాసేడు.

'బావా ! నువ్వు అదృష్టవంతుడివి. బంగారంవంటి డాక్టరుకుర్రాడు మీఅమ్మాయి వలలో పడ్డాడు. నువ్వూ నీ ప్రత్తీ ఎలా వున్నారు ? ఇచ్చట సర్వేజ్యూరాలు మా అక్కగారూ, చి. సౌ. మంజుల కులాసాగావున్నారు.

మీ కాబోయే అల్లుడి అన్నగారు ఈ వూళ్ళోనే వున్నారు. అయితే కుర్రాడి తరపున తను మాట్లాడేది ఏమీలేదని అతను అన్నాడు. ఈ డాక్టర్ మంచి చెడ్డలు అన్నీ హైదరాబాద్‌లో వుంటున్న వాళ్ళ మేనమామ చూస్తు

> *జరిగిన కథ 2 :* మంజులను పెండ్లాడే ప్రయత్నంలో వచ్చిన బోసుబాబును భూషయ్యబావ అవమానించి పంపగా అక్క కాంతమ్మను సంప్రదించడానికి తానే వస్తాడు రాజారావు. అవమానాలన్నీ భరించి తనతోపాటు ఖమ్మం తీసుకువచ్చిన మంజులకి డాక్టర్ సుందర్రావు నచ్చాడని తెలుసుకుంటాడు రాజారావు.

న్నాడట. మనం మంచిచెడ్డలు అతనో మాట్లాడాల్సి వుంటుంది. వీలయితే ఈలోగా నేను ఒకసారి హైదరాబాద్ వెళ్ళి మాట్లాడి వస్తాను. నువ్వు నీ ప్రత్తి విషయం కొన్నాళ్ళు ఎవరికో వప్పచెప్పి ఒక ఐదారు వేలు పైకం పుచ్చుకొని వీలయినంత త్వరగా రావలెను. మనం అన్ని విషయాలు సెటిల్ చేసుకుందాము. చిత్తగించవలెను–ఇట్లు, మీ బావమర్ది అబద్ధాల రాజారావు (వ్రాలు."

ఆ వుత్తరం చూసుకొని భూషయ్య ఆనందంతో చొంగలు కార్చాడు.

ఆ వూళ్ళోనే భూషయ్య తమ్ముడు, మరదలు వుంటున్నారు. అతను స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నాడు. పేరు చలమయ్య. చలమయ్య భార్యపేరు జానకి. వాళ్ళకి పెద్ద ఆస్తిపాస్తులు లేవని వాళ్ళని మొదట్నుంచీ దూరంగానే వుంచాడు భూషయ్య, ఎప్పుడయినా వాళ్ళ అవసరం వచ్చిచేరవచ్చినప్పుడు ఛిదిలించి కొట్టిన సందర్భాలు వున్నాయి. సాధారణంగా ఇవాళా రేపూ ఆ ఇంటిమీది కాకి ఈ ఇంటిమీద వాలరాదు. ఎపుడయినా వాలపోయినా భూషయ్య తరిమి కొట్టున్నాడు

అటువంటి భూషయ్య ఆ సాయంకాలమే పనిగట్టుకొని చలమయ్య ఇంటికి వెళ్లేడు. అతన్నిచూసి నల్గురు కుర్రాళ్లకి ప్రైవేట్లు చెప్పుకుంటున్న చలమయ్య తత్తర పడ్డాడు. పడి కంగారుగా కుర్చీతెచ్చి వేసాడు. లోపలికి వెళ్లి గ్లాసుతో మంచినీళ్లు తెచ్చిఇచ్చాడు.

కుర్చీలో విశ్రాంతిగా కూర్చుని భూషయ్య. సకిలించాడు. కాసేపు కళ్ళు మూసుకొని ఆలోచించాడు. తర్వాత జేబులోంచి చుట్ట తీసి తాపీగా వెలిగించాడు.

ఇంత సేపూ చలమయ్య 'యట్ యువర్ సర్వీస్ ప్లీజ్' అన్నట్టుగా నించొని అన్నగారినే చూస్తువుండి పోయేడు.

కాసేపు చుట్టపీల్చి, బుగ్గ లుబ్బించి బ్రహ్మానందంగా నవ్వేడు భూషయ్య. నవ్వి 'ఖమ్మం నుంచి వుత్తరం వచ్చింది' అన్నాడు. అదేమిటో అర్థంగాక తెల్ల మొహం వేసేడు చలమయ్య, వేసి 'వెంకట్రామన్ బనీను'మీదున్న కండువా సరిచేసుకొన్నాడు. తన పొరపాటు గ్రహించిన భూషయ్య చిర్నవ్వునవ్వి, 'ఇంటో అమ్మాయియుందా ?' అన్నాడు వెంటనే.

భూషయ్యకి చలమయ్య తెలివితేటలమీద కంటె జానకి తెలివి తేటలమీద నమ్మకం ఎక్కువ. తన అవలక్షణాలేమిటో భూషయ్యకి తెల్సు. అయితే తన వెనకాల డబ్బు వుండటం వలన అది కమ్ముకుని వస్తూందన్న నమ్మకం వుంది. చలమయ్య తన తమ్ముడు కావటం వలన తనలోని ఆ అవలక్షణాలన్నీ అతన్లోనూ తప్పకుండా వుండి వుంటాయని భూషయ్య విశ్వాసం. అందువలన వాటినన్నిట్నీ చలమయ్యకి అంటగట్టి వినోదించటం భూషయ్య హాబీ. దానికి చలమయ్య మెతకదనం, డబ్బు లేనితనం మరింత ప్రోత్సాహం ఇచ్చింది.

అందుకే భూషయ్య పకపక నవ్వాడు. నవ్వి ఒక రకమయిన ఆనందం అనుభవించాడు.

'జానకా ? ఉందన్నయ్యా. పిలవనా ?' అన్నాడు చలమయ్య.

"పిలవక మరేంచేస్తావురా భూషయ్య తమ్ముడా ?" అన్నట్టు ఒకచూపు విసిరాడు భూషయ్య.

తత్తరపడిన చలమయ్య లోపల్కి వెళ్ళి జానకిని పిల్చుకొచ్చాడు.

రచనలు, వ్యాసాలు, బొమ్మలు, ప్రశ్నలు మొదలైనవన్నీ పంపవలసిన చిరునామా:
సంపాదకుడు,
ఆంధ్ర సచిత్ర వారపత్రిక,
గాంధీనగరం, విజయవాడ–520003.

కొంగుకి చేతులు తుడ్చుకొంటూ వచ్చి గోడ వారగా నిలబడింది జానకి.

భూషయ్య నవ్వి "అమ్మాయి. ఖమ్మంనుంచి వుత్తరం వచ్చింది. అక్కడ మా బావమర్ది, 'మంజుతల్లి'కి మంచి సంబంధం కుదిర్చేడు. నేను కూడా వెళ్లి మాట్లాడిరావాలి. అందుకని ఆ ప్రత్తి చేను కొన్నాళ్లు మీరు చూడాలి." అని ఆగేడు.

చలమయ్య జానకి వింటువుండిపోయేరు.

భూషయ్య చెప్పకొచ్చేడు. "రాజాలాంటి సంబంధం. అబ్బాయి డాక్టరు. అందగాడు. గవర్నమెంటు వుద్యోగం. ప్రవేటు ప్రాక్టీసు. రెండు చేతులా సంపాదిస్తున్నాడట! వెనకాల ఆస్తి బాగానే వుందట. పైగా వెనకాముందూ ఎవరూ లేరు. ఇంతకంటె ఏం కావాలి ?"

"మన మంజుల అదృష్టవంతురాలు బావగారూ !" అంది జానకి.

"కనుక నేను ఖమ్మం వెళ్లిరావాలి. అవసరమయితే హైదరాబాదుకూడ వెళ్లిరావాలి. అందుకని ఈ నాల్గురోజులు మన చలమయ్యని ఇల్లు పొలం అన్నీ చూడమని చెప్పాలి."

"అట్లాగేనండి" అంది జానకి వినయంగా.

ఎదురుగా చలమయ్యని పెట్టుకొని, భూషయ్య, జానకి ద్వారా అతనికి ఆర్డర్సు పాసు చెయ్యటంలో ఒక పన్నాగం వుంది. దానివలన, ఒకవేళ ఒరిజినాలిటీ ఏమాత్రంగాని చలమయ్యలో వున్నట్లయితే, దాంతో అది చచ్చి వూరుకొంటుంది. అలా మనుషుల్ని చావగొట్టటం కాపిటలిస్టిక్ పాటర్న్‌లో గల ఒక ప్రాథమిక సూత్రం. తన వద్ద యింత డబ్బు పేర్చుకొనివున్న భూషయ్య వంటి మనుషులు, నిరక్షరకుక్షులు అయినా, ఇటువంటి పద్ధతుల్ని అనుసరించటం కాకతాళీయంగా నేర్చుకొనివుంటారు. డబ్బుమాత్రమే పరమార్ధం అనుకొన్న భూషయ్య, దానికి విలువ యివ్వక జీవితపు విలువల్ని పట్టుకొని ప్రాకులాడుతున్న చలమయ్య వంటి మనుషుల్ని, సదా ఏదోవిధాన దెబ్బతియ్యటాన్కి ప్రయత్నిస్తూనే వుంటాడు. అందులో ఆనందం పొందుతూనూ వుంటాడు. అదొక పద్ధతి.

గుండెల్నిండా పొగపీల్చి, చుట్ట అవతలపారేసి, లేచాడు భూషయ్య. "ఎల్లుండే నా ప్రయాణం. మరి నేను వస్తాను. జాగ్రత్త" అని హెచ్చరించి బయలుదేరాడు. గేటుదాకా వచ్చిన చలమయ్యనీ, జానకినీ గమనించకుండానే వెనక్కితిరిగి చూడకుండానే సాగిపోయాడు. వానకురిసి వెలిసినట్లు గుండెల్నిండా గాలిపీల్చి వదిలాడు చలమయ్య. జానకి ముసి ముసిగ నవ్వింది.

10

ముందుగానే తను ఫలానా రోజున వస్తున్నానని ఉత్తరం రాసి—

ఆరువేల రూపాయలు రొంటిని దోపుకొని, రెండుజతల గుడ్డలు సంచిలో పెట్టుకొని ఖమ్మం రైలు స్టేషన్లో చుట్టకాల్చుకుంటూ దిగేడు భూషయ్య. అతనికి వీరోచిత స్వాగతం లభించింది. రాజారావు, నీలమ్మ, మంజుల వచ్చారు స్టేషన్కి.

రిక్షాలవైపు నడవబోతున్న భూషయ్యకి

'ఇటు ఇటు' అంటు దారిచూపి ప్రక్కగా ఆగివున్న కారు దగ్గరకి తీసుకువెళ్లేడు రాజారావు. పంచ ఎగగట్టి నిల్చుని నిరుత్తరుడయిన భూషయ్యని కారు వెనక సీటులో కూలేసేడు.

ఇల్లుచేరి, భూషయ్య వేణ్ణీళ్ల జలకమాడేక, డజను ఇడ్లీలు తినిపించి ఆరంగుళాలెత్తు కంచు గ్లాసునిండా పాలు తాగించి, కూర్చోపెట్టి చుట్ట వెలిగించి, "ఇప్పుడు చెప్పు బావా! ప్రయాణం ఎలా జరిగింది?" అని అడిగేడు రాజారావు.

"ఏం చెప్పమంటావు నాయనా! ఎరక్క నావంటివాడు ఈ రైళ్లు ఎక్కకూడదు. నానా గత్తరా అయింది. చిన్నా పెద్దా లేదు. మంచి చెడూ లేదు. ప్రతివాడూ మొగాడే. నా అంతవాణ్ణి నన్ను పట్టుకొని తోసి, తొక్కి, కుమ్మి వాళ్ల హూనమయేలా చేసారు." అన్నాడు భూషయ్య.

రాజారావు నవ్వాడు. నవ్వి "సోషలిజమ్ బావా!" అన్నాడు.

"అంటే?"

"అంటే అందరూ సమానం అని. చిన్నా పెద్దా లేదు. స్పెషలిటీల్లేవు. నీవు ధనవంతుడవయితే ఫస్టుక్లాసులో రా. అంతేగాని నాదగ్గర డబ్బుంది. మీరందరూ లేచి సీటు యిచ్చి నుంచోండి. లేవండి అంటానికి లేదు."

"నీ మొహంలా వుంది" అని సకిలించాడు భూషయ్య.

రాజారావు చిన్నపుచ్చుకొన్నాడు.

హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చినట్లు మొహంపెట్టి రొంటినుంచి డబ్బుతీసి "ఇదుగో నయ్యా, నువ్వడిగిన వెయ్యీ తెచ్చాను. తీసుకో. ఇప్పుడు ఏం చేస్తావో చెయ్యి" అని రాజారావు చేతిలో పెట్టాడు భూషయ్య.

చిర్నవ్వుతో వాట్నందుకుని, "బావా! నువ్వు రడీనేనా మరి?" అని అడిగాడు రాజారావు.

"డబల్ రడీ" అన్నాడు భూషయ్య.

రాజారావు చిలక్కి చెప్పినట్లు చెప్పాడు. "అసలే నీ నోరు మంచిదికాదు. నోరు తెరిస్తే కాబోయే పనికూడ చెడిపోయే ప్రమాదం వుంది. కనుక మనం వెళ్లినచోటనల్లా నువ్వు నోరు మెదపక వూరికే చూస్తూ కూర్చో. అంతా నేను చూస్తాను. తర్వాత నీకే సందేహాలున్నా నన్నడుగు. నే చెప్తాను. సరేనా?"

భూషయ్య నవ్వాడు.

తన నోరు మంచిదికాదని భూషయ్యకీ తెల్సు. అయినా మరో సందర్భమయితే ఆ మాటలకి రాజారావు నాలుకని చీల్చించివుండేవాడు అవసరం అటువంటిది. అవసరమయితే వసుదేవుడే గాడిద కాళ్లు పట్టుకొన్నాడని చెప్పాడు మోపర్రు హరిదాసు.

అందుకే భూషయ్య నవ్వాడు, అహాన్ని దిగ్గమింగి.

ఇద్దరూ లేచి వీధిలోకి వచ్చేసరికి ఇందాకటి కారు రడీగా వుంది.

"ఇదేమిటి ఈ కారెక్కడిది?" అన్నాడు భూషయ్య ఆశ్చర్యంగా.

"తర్వాత చెప్తాలే. మాట్లాడవద్దన్నానుగా." అంటూ విసుక్కున్నాడు రాజారావు.

రంగుల వల

"అదికాదయ్యా! ఎక్కడిదీ అవి?"

"అబ్బ! వదిలిపెట్టవుగదా. మందే లే. అద్దెకి తీసుకువచ్చాను."

"అద్దెకా? ఎంత?"

"రోజుకి యాభయిరూపాయలు."

"యాభయిరూపాయిలే. అంటే రోజుకో ధాన్యంబస్తా అన్నమాట! నువ్వు ముందూ వెనకా చూడవయ్యా, రాజారావు!"

"నలభయి ఎకరాల మాగాణి, ముప్పయి ఎకరాల మెట్ట..."

"అయితే"

"...అంత ఆస్తి గలిగిన లక్షాధికారి భూషయ్య

వెర్రి పాట

చరిత్ర పేరున చదివేదంతా చెత్తని
విద్యకూ సమాజానికి సంబంధం లేదని
ఈ డిగ్రీలకు ఉద్యోగాలు రావని
తెలిసీ, చదివే విద్యార్థులకు వెర్రి

రేషన్ షాపులు పేరుకేనని
తప్పివచ్చిన సరుకు కూడా
వెనక గుమ్మంలోంచే వెళుతుందని
తెలిసీ, క్యూలో పడిగాపులు కాసే పేదలకు వెర్రి

ఎన్నికైనవాడు మళ్ళీ రాడని
వచ్చినా మధ్యంతర ఎన్నికలకో
మళ్ళీ వచ్చే ఎన్నికలకోనని
తెలిసీ, ఓటును నమ్మే వోటర్లకు వెర్రి

సంఘం తప్పుల తడకని
గొప్పలంటే గతంవే తప్ప
ప్రస్తుతమది పనికి రాదని
తెలిసీ, వూరుకుంటున్న జనానికి వెర్రి

ఉపయోగం గూర్చి ఆలోచించక
ఎవడైనా అర్థం చేసుకుంటాడేమోనని
ఊహలను విచ్చలవిడిగా
తెలిసీ, వదిలిన వాకు వెర్రి.

— ఆర్. అరుణ

అల్లుడ్ని చూసుకొని సంబంధం మాట్లాడటానికి కాల్నడకన లేక రిక్షాలో వెడతాడండి?!"

"వెళ్తే తప్పా?"

"సర్లె. నోర్ముయ్యి. ఎవరయినా వింటే నవ్వుతారు. ప్రిస్టేజీ వుండాలయ్యా. నిన్ను చూసి అవతలివాడు నువ్వు నిజంగా అంత ఆస్తిపరుడివేనని నమ్మాలా వద్దా?"

భూషయ్య నోరు మూసాడు.

కార్లో రాజారావు మరీ మరీ హెచ్చరించాడు. 'బావా! నా మాట విని నువ్వు నోరు తెరిచి మాట్లాడమాకు. నువ్వు మాట్లాడితే అంతా కంపవుతుంది. నువ్వు పిసినారివనీ, పైసాకోసం ప్రాణం విడుస్తావనీ వాళ్ళకి తెలిసిందంటే పోపొమ్మంటారు. ఇంతవరకూ లాక్కువచ్చిన వ్యవహారం చెడి కూర్చుంటుంది. మీ అల్లుడికి అసలే స్టైలు ఎక్కువ. నాకూడా రా. అతను ఏమిటని అడుగుతాడు. గుండెల్లో నొప్పని చెప్పు. పరీక్ష చేసి మందిస్తాడు. ఈలోగా నోరు విప్పకుండా నీ పరీక్షలేవో నువ్వు చేసుకో. సందేహాలుంటే తర్వాత నన్నడుగు. ఓ. కే.?"

"అంటే?" అన్నాడు భూషయ్య అమమానంగా.

"వచ్చాంరా బాబు" అనుకున్నాడు రాజారావు.

"ఆదేనయ్యా. ఏదో ఓకో బోకో అన్నావుగా. అంటే ఏంటి?" అన్నాడు భూషయ్య బుద్ధిమంతుళ్ళా.

"అంటే అర్ధమయింది గదా? చెప్పినట్టు చేస్తావుగదా? అని" అని నవ్వాడు రాజారావు.

"సర్లేవయ్యా. నీ బాబుని దొంగల్దోల. నన్ను చావగొట్టి చెవులు మూస్తున్నావుగదయ్యా?" అని సకిలించాడు భూషయ్య.

రాజారావు నవ్వుకొన్నాడు.

కారు ఆగింది.

"వచ్చాం. దిగు." అంటు తలుపు తీసాడు రాజారావు.

కారు దిగుతూనె అంతా స్తనశల్య పరీక్షకి గురి చేసాడు భూషయ్య.

డాక్టర్ సుందర్రావు హాస్పటలు ఎప్పట్లా రష్గా వుంది. అందరి మధ్యనుంచి సందుచేసుకొని, స్ప్రింగ్ డోరు తీసుకొని లోపలికి దూసుకువెళ్ళాడు రాజారావు.

భూషయ్య అక్కడ్నె నిలబడి రోగుల్తో బాతాఖానీ వెయ్యటం మొదలుపెట్టాడు. ఏ వూరు? ఏం జబ్బు? ఎన్నాళ్ళనించి? డాక్టరు మంచివాడేనా? ఎంత ఎంత డబ్బు గుంజాతాడు? అంటు ప్రశ్న పరంపర గుప్పించాడు.

ఇంతలో రాజారావు తలుపు తెరచుకొని వచ్చి, రమ్మని చెయ్యి పట్టుకొని లోపలికి లాక్కుపోయేడు, భూషయ్యని.

"డాక్టర్! వీరేనండి. మా బావగారు. భూషయ్యగారని లక్షాధికారి" అంటు డాక్టర్కి పరిచయం చేసేడు. డాక్టర్ చిర్నవ్వు నవ్వి 'నమస్కారమండి' అన్నాడు.

భూషయ్య నిలువుగుడ్లు వేసుకుని డాక్టర్ని ఆ పాద మస్తకం పరిశీలిస్తూ వుండిపోయేడు. డాక్టర్ సిగ్గుపడి తల వంచుకొన్నాడు. మరు నిముషం చిర్నవ్వుతో తలెత్తి, 'చెప్పండి?' అన్నాడు వాచీ చూసుకొంటూ.

"ఈయనకి గుండెల్లోనొప్పండి. మీరు చూసి ప్రిస్క్రిప్షన్ ఇస్తారని తీసుకువచ్చేను." అన్నాడు రాజారావు.

"అలాగా. చూస్తాను రండి." అంటు లేచేడు డాక్టర్ సుందర్రావు.

ఎగ్జామినేషన్ రూంలో చొక్కా విప్పించి అన్ని పరీక్షలు చేస్తున్నంతసేపూ ఒళ్ళు డాక్టరుకి అప్పచెప్పి, కళ్ళకి అతన్నప్పచెప్పేడు భూషయ్య.

"బుద్దాడు బాగానే వున్నాడు. ఎర్రగా బుర్రగా వున్నాడు. అందంలో మంజు తల్లితో పోటీ పడ్డాడు. పోతే రోగుల్దగ్గర్నుంచి బాగానే గుంజుతున్నట్లున్నాడు. రాజారావుకి నోటి దూలగాని మంచి సంబంధమే తెచ్చాడు. అయితే గియితే చాలా మంచి సంబంధం." అనుకుంటు గుటకలు మింగాడు భూషయ్య.

(ఇంకా వుంది)

నా శ్వాసలో శ్వాసించే నా ప్రియుడు



నన్ను విడిచి క్షణం


స్వర్గంలో కూడా ఉండలేనంటాడు

నిర్మలమై, తాజా రుచి గలిన బినాకా గ్రీన్ నాకెంతో అవసరమైన ఆత్మ విశ్వాసాన్ని చేకూర్చుతుంది. ముఖ్యంగా నేనతని చేరువనున్న మధుర క్షణాలలో. ఎందువల్లనంటే, బినాకా గ్రీన్‌లో శ్వాసయొక్క దుర్వాసనను హరించి మీ నోటికి రోజంతా హాయి గొల్పే తాజా తనాన్నివ్వగల ప్రకృతిసిద్ధమైన దురంధ-సంహారక పదార్థము, కోరోఫిల్ ఉన్నది. అందు చేత బినాకా గ్రీన్ నాకత్యంత ప్రియతమమైంది.

నన్నెంతగా ప్రేమించే నా ప్రియుణ్ణి కేవలం నా వాడిని చేసిన బినాకా గ్రీన్‌కు ధన్యవాదాలు.



మా గాఢ అన్యోన్య ప్రేమకు కారణం- బినాకా గ్రీన్



బినాకా టూత్ బ్రష్‌కి గుండ్రటి కొనలు ఉంటాయి ఇగుళ్ళను ఏమాత్రం గాయపరచవు.

సీరియల్

అహం - అనురాగం

జి. పరిమళా సోమేశ్వర్

(గత సంచిక తరువాయి)

మరో నెలరోజుల తరువాత రఘుకి ఉద్యోగం వచ్చింది. ఆ నెలరోజులూ రఘూ రాధల అన్యోన్యతని చూసి శ్యామల ఎంతగానో ముచ్చట పడింది. వాళ్లని చూస్తుంటే తమ వివాహపు తొలి దినాలు గుర్తుకువచ్చేవి శ్యామలకి.

తను చేజేతులా జారవిడుచుకున్న స్వర్గం యేమిటో ఆమెకు స్పష్టంగా తెలిసి వచ్చింది. భార్యాభర్తల అనుబంధం ఎంతో పవిత్రమైనది. అహంకారంతో, అవివేకంలో తాను దానిని మలిన పరచింది. తన పాపానికి నిష్కృతి లేదు అనుకుని పశ్చాత్తాపపడింది శ్యామల.

రఘుకి నిజామాబాదులో వుద్యోగం వచ్చింది. భార్యని తీసుకుని వెళ్లబోయేముందు రఘు శ్యామల పాదాలకు నమస్కరించి ''నన్ను ఆశీర్వదించు వదినా!'' అన్నాడు.

ఒకప్పుడు తనని ఎంతో నిరసించి, ''అన్నయ్యను యింట్లోనుండి వెళ్లగొట్టింది నువ్వే!'' నని తన మొహంమీదనే చీదరించుకున్న రఘు యిప్పుడు తన ఆశీర్వాదాన్ని కోరుకుంటున్నాడు! కాలం ఎంత చిత్రమయినది! ఓడలను బండ్లుగా బండ్లను ఓడలుగా మార్చుతుంది. మిత్రులను శత్రువులుగా, శత్రువులను మిత్రులుగా మార్చుతుంది.

రఘూవాళ్లు వెళ్లిపోయేక శ్యామలలో ఎంతో మార్పు వచ్చింది. ఇప్పుడామెలో కన్నీళ్లుకూడా యింకిపోయినవి. యాంత్రికంగా పనులు చేసుకుపోతోంది. చిరునవ్వు అనేది ఏకోశానా ఆమె ముఖంలో కనపడటంలేదు. ఏదో తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించటానికి బ్రతుకుతున్నట్లుగా ఆమె ప్రవర్తించేది.

ఒకరోజున బట్టలషాపులో బట్టలు కొంటూవుంటే చంద్ర, అతని భార్య కనిపించేరు.

వాళ్లను చూడనట్లే శ్యామల తలవంచుకుని పోతోంటే చంద్ర అడ్డువచ్చి ''శ్యామలా!'' అంటూ ఆపేడు.

''ఈమె నా భార్య విద్య. ఈమె శ్యామల. నా చిన్ననాటి స్నేహితురాలు'' అంటూ ఒకరినొకరికి పరిచయంచేసిన తరువాత ''అరె! శ్యామలా! అదేమిటి? ఇంత చిక్కిపోయేవేమిటి? ఆ ముఖంలోని కళ, కాంతి అన్నీ ఏమయిపోయినయ్? మొదట నిన్నసలు గుర్తుపట్టనేలేకపోయేను సుమా!'' అన్నాడు చంద్ర.

శ్యామలకి దుఃఖం వచ్చినా ఆ సమయంలో దానిని వెలిబుచ్చటం సభ్యతకాదని తెలియటంవల్ల పైకిమాత్రం చిరునవ్వు నవ్వింది. ''ఏముంది? నేను బాగానే వున్నానుగా'' అంటూ.

చంద్ర ఆమెనింక ఏమీ ప్రశ్నించలేదు.

అతని కళ్లల్లో అప్రయత్నంగానే కన్నీళ్లు నిల్చినయి. ఆ కన్నీళ్ల వెనక ఎన్ని జ్ఞాపకాలో! ఎన్ని భావాలో!

శ్యామల వాళ్లిద్దరికీ నమస్కరించి యింటికి వచ్చేసింది.

ఇంటికి వచ్చిన తరువాత తనని తాను పరిశీలించుకుంది శ్యామల. చంద్ర తనని షాపులో పలకరిస్తే ఏమాత్రం కోపంరాలేదు. అసహ్యం కలగలేదు. ఒకరిమీద కోపం తెచ్చుకునేంత అహంకారం తనలో ఏనాడో చచ్చిపోయింది.

అంతేకాదు. చంద్రలో కూడా వివాహమైన తరువాత ఎంతో మార్పు వచ్చినట్లు కనబడుతోంది. ఇదివరకటిలా ఆ కళ్లలో లాలస, పెదవులలో పెంకితనం లేవు. ఎంతో సౌమ్యంగా, ఆదర్శ భర్తలా కనపడుతున్నాడు. అతని భార్య అతనిని పూర్తిగా మార్చివేసినట్లుంది. ఆమెని చూసినా తనకి ఎలాటి అసూయా కలగలేదు. పైగా యీమధ్య ఏ దంపతులను చూసినా వాళ్లు కలకాలం అన్యోన్యంగా జీవించాలని తను మనస్ఫూర్తిగా కోరుకుంటోంది. తనలాటి నికృష్టపు బ్రతుకు మరే స్త్రీకీ పట్టకూడదనుకుంటోంది.

వారంరోజుల తరువాత చంద్ర ఒక్కడే యింటికి వచ్చేడు. బాబు, శ్యామల తప్ప ఆ సమయంలో యింట్లో ఎవ్వరూ లేరు.

''శ్యామలా! నిన్నిలా ఒంటరిగా కలుసుకోగలనో లేనోనని భయపడ్డాను. అదృష్టంకొద్దీ నాకా అవకాశం లభించింది. నీతో ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను...'' అంటూ ఆగిపోయేడు చంద్ర.

''ఏమిటో చెప్పు చంద్రా! సందేహమెందుకు?'' అన్నది శ్యామల.

తల వంచుకుని అన్నాడు చంద్ర. ''నిన్ను చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది శ్యామలా! నీ అందమంతా ఏమయింది? అసలు నిద్రాహారాలు పూర్తిగా మానివేసేవాయేం? రవిని నువ్వు ఎంతగా ప్రేమిస్తున్నావో నీ యీ రూపమే చెప్తోంది. మీరిద్దరూ ఒకరినొకరు యింత గాఢంగా ప్రేమించుకున్నారని నాకప్పట్లో తెలిసేదికాదు ఇప్పుడు నేనూ ఒక యింటివాణ్నయ్యేను. త్వరలో తండ్రిని కూడా కాబోతున్నాను. భార్యాభర్తల అనుబంధం ఎంతటి పవిత్రమైనదో, ఎంతటి సున్నితమైనదో నాకు అనుభవపూర్వకంగా తెలిసివచ్చింది. ఒకప్పుడు అజ్ఞానంలో, అహంకారంలో నిన్ను బాధపెట్టినా యిప్పుడు నిజంగా నీ స్థితికి నేను జాలిపడుతున్నాను. చిన్ననాటి స్నేహితుడిగా, ఒక సోదరుడిగా నాకు చేతయినంత సహాయం చేస్తాను. నా తప్పులన్నీ క్షమించి నా సహాయాన్ని పొందుతావా? రవి ఎక్కడున్నాడో ఏమాత్రమైనా ఆచూకీ తెలుసా నీకు? నువ్వు చూచాయగా చెప్తే నేను వెళ్లి నీ తరపున క్షమాపణ వేడుకుని, అవసరమైతే అతని కాళ్లమీద పడైనాసరే అతనిని నీదగ్గరకు తీసుకువస్తాను. చెప్పు శ్యామలా! అతనెక్కడున్నాడో చెప్పు'' అన్నాడు చంద్ర గాద్గదిక స్వరంతో.

అతని మాటలు వింటుంటే, శ్యామలకు దుఃఖం ఆగలేదు. ఎన్నోరోజుల తరువాత గుండె బరువు తీరేలా ఏడ్చింది. ''ఆయన ఎక్కడువున్నారో చూచాయగానైనా తెలిస్తే నేనిలా ఎందుకుంటాను చంద్రా? ఈ క్షణంలో వెళ్లి ఆయన పాదాలమీద వాలను? నాకా అదృష్టంలేదు చంద్రా! నాకోసం నువ్వు బాధపడకు. నావంటి పాపిష్టి స్త్రీ కోసం నువ్వేకాదు. లోకంలో ఎవ్వరూ బాధపడకూడదు'' అంటూ వెక్కి వెక్కి ఏడిచింది శ్యామల.

10

అశ్వని తను వ్రాయబోయే సినిమా కథకు ప్లాటును గురించి ఆలోచిస్తూ కాళ్లు బారజాపి టేబులుమీద పెట్టి సిగరెట్టు తరువాత సిగరెట్టును తగలవేస్తున్నాడు.

ఇంతలో రాణి దేవకన్య వేషం వేసుకుని పరిగెత్తుకుంటూ వచ్చింది.

''అశ్వనిబాబూ! నేనెలా వున్నానీ డ్రెస్సులో'' అంటూ చిన్నపిల్లలా అడిగింది.

''కామినీపిశాచంలా వున్నావు'' అన్నాడు తెల్లని దుస్తులను చూస్తూ అశ్వని.

''ఫో! నువ్వెప్పుడూ అంతే!'' అంటూ బుంగమూతిపెట్టి అతను కాళ్లుపెట్టిన బల్లమీద కూర్చుంది రాణి.

అశ్వని చటుక్కున కాళ్లు తీసేసుకున్నాడు.

అది గమనించనట్టే రాణి ''ఇప్పుడు చెప్పు. నేను మేనకలా వున్నానా లేనా?'' అంది.

''నువ్వయితే అచ్చు మేనకలానే వున్నావుకాని నన్నుమాత్రం విశ్వామిత్రుడిని కమ్మనకు. పో తల్లీ నీకు పుణ్యముంటుంది. నా మూడ్ చెడగొట్టకు'' అన్నాడు అశ్వని.

జరిగిన కథ 15: స్త్రీల కళాశాల లెక్చరర్ శ్యామల, విద్యార్థినులతో నెహ్రూ జూలాజికల్ పార్కుకు వెళ్లివచ్చి, అక్కడ తనను ప్రమాదం నుంచి కాపాడిన వ్యక్తి బి.ఎ. తప్పిన పేద చిరుద్యోగని అతనిద్వారా తెలుసుకుంటుంది. చంద్రను పెళ్లి చేసుకోవటానికి కూతురు శ్యామల నిరాకరించగా దిగులుతో ఆరోగ్యం చెడి మరణిస్తారు వెంకటేశ్వరరావుగారు. చంద్ర హెచ్చరిక లెక్కచేయక రవినే వివాహం చేసుకుంటుంది శ్యామల. అయిష్టంగా బి.ఏ. పరీక్షకు కట్టి తప్పుతాడు రవి. వుద్యోగం పోయి మానసికంగా దిగజారిపోయిన రవి – శ్యామల తొందరపాటు తనంవల్ల ఇల్లు విడిచి వెళ్లిపోతాడు. తన తొందరపాటుకు పశ్చాత్తాప పడ్డ శ్యామల రవి కుటుంబాన్ని ఆదరిస్తుంది. మద్రాసు బయల్దేరిన రవికి రైల్లో పరిచయమయిన సినీ రచయిత అశ్వనిబాబు ఆశ్రయం లభిస్తుంది. లక్ష్మి ప్రేమించిన రాజు కపట ప్రవర్తనను ఆమెకు తెలియచేసిన శ్యామల వర్ణాంతర వివాహం చేసుకున్న మరది రఘు రాధలను ఆదరిస్తుంది.

అంతవరకు వాళ్ల సంభాషణ వింటూ అవతలగా డ్రెస్ చేసుకుంటున్న రవి వీళ్ల దగ్గరకు వచ్చి "పోనీ ఆవిడ అంత ముచ్చటపడుతుంటే మీరు కాసేపు విశ్వామిత్రుడి పాత్ర ధరిస్తే మాత్రం ఏం పోతుంది సార్?" అన్నాడు నవ్వుతూ.

"ధరించటానికి నాకేం అభ్యంతరంలేదుకాని మళ్లీ ఏ శకుంతలో పుట్టుకువస్తే ప్రమాదం కదా." అన్నాడు అశ్విని.

"మీరేమీ బెంగపెట్టుకోకండి. శకుంతల పుట్టటమంటూ జరిగితే కణ్వమహర్షి పాత్రను నేను ధరిస్తాలెండి" అన్నాడు రవి.

వాళ్లిద్దరూ పగలబడి నవ్వుకున్నారు. రాణి కోపంతో చరచర లేచి వెళ్లిపోయింది. "ఛీ! మీరు మనుషులు కారు" అంటూ.

ఆ మాటలకి అశ్విని యేం చలించలేదుకాని రవి మాత్రం బాధపడ్డాడు.

"పాపం ఆమె ప్రేమను యిలా పరిహాసం చెయ్యటం భావ్యంకాదు సార్" ఆమె అంతగా వెంటపడుతోంది కదా – కాస్త కనికరించ కూడదూ?"

"నీకు రాణిమీద నిజంగా సానుభూతి ఉందా రవీ?" సీరియస్‌గా అడిగేడు అశ్విని.

"సానుభూతికేం? కావలసినంత వుంది."

"ఐతే యింకేం? ఆమెను ప్రేమించెయ్."

"ఛ! అదేమిటి?"

"ఔను. మరి సానుభూతి వుందికదా ప్రేమించటానికి అభ్యంతర మేమిటి?"

"సానుభూతి వేరు. ప్రేమ వేరు."

"నా విషయంలోనూ అంతే అనుకోరాదూ?"

"ఆమె మిమ్మల్ని ప్రేమిస్తోంది."

"ఐతే నిన్నామె ప్రేమించకపోవటమే అభ్యంతర మంటావు!"

"రామ రామ! అదికాదండీ! నా మనసు ఒక స్త్రీకి ఎప్పుడో అంకితమైపోయింది."


"నా మనసేనా కానిది?"

"క్షమించండి. మీ వ్యక్తిగత విషయాలను గురించి మీరెప్పుడూ నాకు చెప్పనేలేదు."

"అక్కడికి నీ వ్యక్తిగత విషయాలన్నీ నువ్వు నాకు చెప్పేసినట్లే మాట్లాడుతున్నావే."

"దయచేసి నన్నా విషయాలేమీ అడగకండి."

"నిన్నెవరడిగేరయ్యా? నా విషయాలు



యస్. హెచ్—గుంటూరు.

'హాజ్ కింజ్' డిసీజ్ అంటే ఏమిటి? దాని లక్షణాలు, అది రావటానికి గల కారణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, మందులు తెల్పండి.

★ "హాడ్జ్ కిన్స్" డిసీజ్ అనేది, దాదాపు కేన్సర్ అనతగిన, లింఫ్ గ్రంధుల వాపునకు వాడబడే రోగమునకు పేరు. ఈ రోగం ఉన్నవారికి, మెడమీదగాని, లేక శరీరంలో లింఫ్ గ్రంధులున్న ప్రదేశా లన్నిటిలోగాని, ఈ గ్రంధులు వాయటంవల్ల, ఆయా ప్రదేశాలలో పెద్ద కాయలలాగా కనిపిస్తుంది. ఈ కాయలు, రెండు లేక మూడు కలిసి ఒకే సమయంలో ఉండటం ఈ రోగలక్షణం. ఈ రోగం రావటానికి కారణం నిర్ధారణంగా ఇంతవరకూ తెలియదు. కారణం తెలియదు కాబట్టి, తీసుకోవలసిన జాగ్రత్తలంటూ ఏమీ లేవు.

ఈ రోగం ఉన్నవారు, నిపుణులైన శస్త్ర వైద్యులవద్ద చికిత్స పొందటమే తగినమార్గం. శస్త్రచికిత్స,లేక ఎక్స్‌రే. కిరణములవల్ల చికిత్స జరుగుతుంది.

సి. హెచ్. కె—కరీంనగర్

కుటుంబ నియంత్రణ పాటించుట కొరకు మార్కెట్‌లో దొరకు మాత్రల గురించి వివరములు తెల్పండి. దంపతులు పాటించగల పద్ధతులు తెల్పండి.

డాక్టర్ సలహాలు

★ కుటుంబ నియంత్రణకు, చాలా రకాల మాత్రలు, ఇంకా చెప్పాలంటే చాలా పద్ధతులు ఉన్నాయని అందరికీ తెలిసే ఉంటుంది.

ఈ పద్ధతులు—దంపతుల ఇష్టాను సారంగా—అవలంబించవలసి ఉంటుంది. ప్రతి చోటా కుటుంబ నియంత్రణ కేంద్రాలు అమరిఉన్న ఈ రోజుల్లో, మీకు కావలసిన సహాయం ఉచితంగా, మీకు దగ్గరలోనే దొరుకుతుంది.

అయినా ఈ పద్ధతులను గురించి ఇదివరకే తెలియజేశాను. కాస్త ఓపికగా పాత పత్రికలు తిరగవేయండి.

పి. ఎల్—కాగజ్ నగర్

నాకు తరచు మూర్ఛలు వస్తుంటాయి. ఆ మూర్ఛ వచ్చేముందు నాకు అంతా అయోమయంగా వుంటుంది. తల తిరుగుతుంది. మూర్ఛ వచ్చిన సమయములో నాలుక, పండ్లు కరుచుకుంటానట. నోటి నుండి నురుగు వస్తుందట. ఎన్ని మందులు వాడినా ప్రయోజనము కన్పించుటలేదు.

★ ఈ రోగ లక్షణాలు—'ఎపిలెప్సీ' అనే మెదడుకు సంబంధించిన వ్యాధిని సూచిస్తాయి.

మీరు వ్రాసిన 'మూర్ఛ' అనేది వచ్చేముందు, అయోమయంగా ఉండటం, తల తిరగటం, మొదలయినవి,

---

నువ్వు అడగవద్దు. నీ విషయాలు నేను అడగవద్దు. సరేనా? యింతకీ నేను చెప్పేదేమిటంటే మనని ఎందరో ప్రేమిస్తారు. మనవెంట ఎంతమందో పడతారు. కాని వాళ్లందరినీ మనమెక్కడ ప్రేమిస్తాము?" అన్నాడు అశ్వని.

రవి మళ్లీ మాట్లాడలేదు.

అశ్వని ప్రవర్తన, అతని స్వభావం రవికి ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుండేది. అశ్వని పైకి ఎంత బోళాగా కనపడతాడో అంతటి లోతైన మనిషి. ఎంత విపరీతంగా తాగుతాడో అంత నిగ్రహంగల వ్యక్తి. అందుకే రవికి అతనిని చూస్తే జాలి, భక్తి రెండూ కలుగుతాయి.

అశ్వని రవితో ఎంతో చనువుగావున్నా తన వ్యక్తిగత విషయాలను ఎన్నడూ అతనితో చెప్పలేదు.

కాని అతనిని గురించి సినీరంగంలోని వ్యక్తులందరూ తలా ఒకరకంగా చెప్పుకునేవారు. చిన్నతనంలో అశ్వని ఎవరో అమ్మాయిని ప్రేమించేడని, కాని ఆ అమ్మాయి అతనిని తిరస్కరించిందనీ, ఆ అవమానం తట్టుకోలేక త్రాగుడు అలవాటుచేసుకున్నాడనీ కొందరంటారు. మరికొందరేమో ఆమెకూడా అతనిని ప్రేమించింది కాని ఆమె తల్లిదండ్రులు ఆమె నెవరికో బలవంతంగా పెళ్లి చేసేరని అప్పటి నుండి యిలా తయారయ్యాడనీ అనుకునేవారు. ఎవరేమనుకున్నా అవన్నీ వాళ్ల వాళ్ల ఊహాగానాలే తప్ప నిజం ఎవ్వరికీ తెలియదనీ, కనీసం అతని ప్రేయసి పేరుకూడా ఎవ్వరికీ తెలియదనీ, అసలు అతనికి ఒక ప్రేయసి అంటూ ఉన్నదా లేదా అన్న సంగతి ఎవ్వరికీ నిర్ధారణగా తెలియదనీ రవి గ్రహించేడు.

ఏమైనా అశ్వని హృదయంలో విషాదం గూడు కట్టుకుని ఉన్నదనీ, ఆ విషాదానికి కేంద్రం ఒక స్త్రీ అనిమాత్రం రవి ఊహించుకోగలిగేడు.

వ్యక్తిగానే కాక అశ్వని రచయితగా కూడా చాలా చిత్రమైనవాడు.

సాధారణంగా అతను తను వ్రాయబోయే కథలను గురించిగాని, సంభాషణలను గురించిగాని అదే పనిగా ఆలోచించడు. ఎప్పుడు చూసినా అతను తాగుతూ, నలుగురితోనూ ఛలోక్తులు విసుర్తూ, మాట్లాడుతూ ఉంటాడేతప్ప సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు ఎన్నడూ కనపడడు. ఒకసారి ఒక నిర్మాత పదిహేను రోజుల్లో స్క్రిప్టు రెడీగా కావాలన్నాడు. 'సరే' నని కొంత అడ్వాన్సుకూడా పుచ్చుకున్నాడు అశ్వని.

కాని పది రోజులు గడచినా అతను కలం పట్టుకోకపోవటం చూసి రవి ఆశ్చర్యపోయేడు.

"భగవంతంగారికి వ్రాసివ్వవలసిన స్క్రిప్టు సంగతి మర్చిపోయేరా?" అంటూ ఉండబట్టలేక అడిగేడు రవి.

"ఇలాటి విషయాలను ఎలా మర్చిపోతానోయ్? నా వృత్తే అదయ్యె."

"మరి... మీరింతవరకు దానిని మొదలేపెట్టలేదు. ఎప్పటికి పూర్తి చేస్తారు?"

"మనకి మొదలుపెట్టటం, పూర్తి చెయ్యటం అన్నీ ఒక్కసారే! ఇంకా ఐదు రోజుల టైముంది. అంటే ఐదూ ఇంటూ ఇరవై నాలుగు... అంటే... నూట యిరవై గంటల టైముంది. నిమిషాల్లో చెప్పాలంటే, నూటయిరవంట్యా యింటూ అరవై... అబ్బ ఎంతోయ్? మనం లెక్కల్లో పూర్‌లే!"

"ఏడువేల రెండు వందల నిమిషాలు"

"ఆఁ ఏడువేల రెండు వందల నిమిషాల టైముండగా మన కెందుకోయ్ అంత భయం?"

రవికి యింక యేం మాట్లాడాలో తోచలేదు.

మరో మూడు రోజులు కులాసాగా గడిచిపోయినయ్. రవికి కంగారు పుట్టసాగింది. ఏమిటీ మనిషి? చీమ కుట్టినట్లయినా లేకుండా యిలా తిరుగుతున్నాడు? నిజంగానే యీసారి ఆయన స్క్రిప్టు సంగతి మర్చిపోయి ఉంటాడు" అనుకున్నాడు.

"చూడండి — భగవంతంగారి కివ్వవలసిన స్క్రిప్టు సంగతి..." అంటూ గుర్తు చేసేడు రవి.

"ఔనోయ్. గుర్తుంది. దానిని గురించే ఆలోచిస్తున్నా" అన్నాడు అశ్వని.

అహం–

"ఇంకా రెండు రోజులే టైముందండి! అంటే నలభై ఎనిమిది గంటలు – అంటే – రెండు వేల ఎనిమిది వందల ఎనభై నిమిషాల టైము మాత్రమే ఉంది."

"ఓ! దటీజ్ మోర్ దాన్ ఎనఫ్! టైము బాధ యేంలేదు. ప్లాటును గురించే ఆలోచిస్తున్నా పొద్దున్నుంచి" అన్నాడు అశ్వని.

రవికి నోట మాట రాలేదు. ఎల్లుండి స్క్రిప్టు యివ్వవలసి ఉండికూడా యింతవరకు ప్లాటును గురించి ఆలోచించలేదంటే యితని నేమనుకోవాలి? ఎందుకైనా మంచిదనుకుని "మీరు ఆయన దగ్గర ఎడ్వాన్సుకూడా పుచ్చుకున్నారు. గుర్తున్నదా?" అని అడిగేడు మళ్లీ.

అశ్వని గట్టిగా నవ్వేడు.

"ఎందుకోయ్ అలా కంగారు పడతావు?" అంటూ.

రవికి నవ్వాలో ఏడవాలోతెలియలేదు. పైగా తన కంగారును గురించి ఆయన నవ్వటమా?

ఆ రోజు, ఆ మర్నాడు పగలుకూడా అశ్వని కలం ముట్టలేదు.

రవి అతనినే అంటిపెట్టుకుని అతని ప్రతి కదలికా పరిశీలించేడు. రేపు స్క్రిప్టు యివ్వవలసిన రోజనగా ఆ పగలంతా తాగుతూ ఆలోచిస్తూ గడిపేడు అశ్వని. ఆ రోజు అతని ప్రత్యేకతల్లా మౌనం! ప్రతిరోజూ నవ్వుతూ తుళ్లుతూ ఉండే అశ్వని ఆ ఒక్క రోజు మాత్రం మౌనంగా, గంభీరంగా ఉండిపోయేడు. తపోముద్రలో ఉన్న మునిలా కనపడుతున్న అశ్వనిని పలకరించటానికే భయం వేసింది రవికి. కాని మనసులో మాత్రం స్క్రిప్టును గురించిన భయం మెదులుతూనే ఉంది.

సాయంత్రం ఐదు గంటలు కావస్తుండనగా "భగవంతం స్క్రిప్టు కోసం ఎప్పుడు వస్తానన్నాడోయ్?" అనడిగేడు అశ్వని.

"రేపేనండీ!"

"రేపేనని నాకూ తెలుసునోయ్! ఏ టైముకి?"

'ఫిట్లు' రావడాన్ని సూచించేవి మాత్రమే! దీనిని ఆంగ్లంలో 'ఆరా' అంటారు.

మందులు వాడటం, సక్రమంగా వైద్యుల పర్యవేక్షణలో జరిగినప్పుడు ప్రయోజనం కనబడక పోవటం, అసాధారణం. మందులు క్రమంగా వాడక పోవటంవల్ల, ఫిట్లు, రావటం సంభవిస్తే అవి మందుల విలువను, తగ్గించటంగాని, హెచ్చించటంగాని, చేయలేవు.

ఎస్. ఎస్—అమలాపురం

నా వయస్సు 20 సంవత్సరాలు. 6 ఏండ్ల క్రిందట చెరువులో స్నానము చేశాను. అప్పటినుండి గోకితే దద్దుర్లు వస్తున్నాయి. దద్దుర్లనుండి రక్తము వస్తోంది. దద్దుర్లు మానిపోయి నల్లని మచ్చలు ఏర్పడుతున్నాయి.

★ చెరువులో స్నానం చేసిన తర్వాత, దురద, కురుపులు మొదలయినవి రావటం, ఎక్కువగా ''ఫంగస్'' అనే సూక్ష్మక్రిములవల్ల జరుగుతుంది. ఈ ఫంగస్ శరీరంలో ప్రవేశించినప్పుడు పై లక్షణాలన్నీ ఏర్పడేఅవకాశం ఉన్నది.

ఇలా ఉన్నవారు, గ్రైసోవిన్ మాత్రలు రోజుకి 6 వంతున వరుసగా 10 రోజులు వాడటం, దీనితో బాటుగా, 'కెనలాగ్–ఎస్' లేక 'మిల్లి కార్టిన్–వయోఫాం' ఆయింట్‌మెంట్, దద్దుర్లు ఉన్నచోటల్లా పై పూతగా వాడటం మంచిది.

కె. వి ఆర్—చిన్నయ్య గూడెం.

మా పాపకు ప్రస్తుతము 4సంవత్సరములు. ఏడాది వయస్సులో ధనుర్వాతం వచ్చి ఒక కన్ను, నోరు వంకర పోయినవి. దీనికి ఎన్నో మందులు వాడినా పూర్తిగా ఫలితము కన్పించ లేదు. అప్పుడప్పుడు చెవిలో చీము కారుతోంది. దీనికి సరియైన వైద్యము ఎక్కడ జరుగును?

★ కన్ను, నోరు వంకరపోవటం అనేది, వాటికి సంబంధించిన వరములు, దెబ్బతినటం వలన సంభవిస్తుంది.

చెవులలో చీముకారటం, చెవివెనుక ఎముకలో చీము చేరటం, వలన అవుతుంది.

కన్ను, నోరు, వంకర పోవటం—క్రమంగా, సరిఅయిన పద్ధతిలో ఎక్సర్‌సైజ్ చేయించటం వలన కొంత వరకూ నయమవుతుంది.

చెవులలోని చీమును తీసి 'మైక్రోస్కోప్' తో పరీక్షించి, రోగకారకాలైన క్రిములను కనుగొని, వాటికి తగిన మందులను నిర్ణయించి (సెన్సిటివిటీ) వాటిని క్రమ పద్ధతిలో వాడటంవల్ల, నివారించవచ్చును.

—డా॥ కె. వెంకటేశ్వరరావు ●

అనురాగం

''సాయంత్రం ఐదు గంటలకి...''

''ఓ. కె. ఇంకా యిరవైనాలుగు గంటల వ్యవధి ఉంది చాలు.''

''ఔను. పధ్నాలుగు వందల నలభై నిమిషాల వ్యవధి ఉండే. చాలకేం చేస్తుంది?'' కొంచెం నిష్ఠురంగానే అన్నాడు రవి.

అశ్వని నవ్వుతూ అతని బుజం తట్టేడు. ''భయపడకోయ్, మాట యిచ్చిన ప్రకారం రేపు సాయంత్రం ఐదు గంటలకల్లా స్క్రిప్టును భగవంతంగారి చేతిలో పెడతాను. నువ్వే చూస్తావుగా'' అన్నాడు.

ఆ రాత్రి ఏడు గంటలకల్లా భోజనం చేసేసి గదిలో తలుపులు బిగించుకుని కూర్చున్నాడు అశ్వని. వంచిన తలెత్తకుండా అతను వ్రాసుకుపోతుంటే బయట రవి అటూ యిటూ పచార్లు చేయసాగేడు. ఒకటి, రెండు, మూడు... ఒకదానివెంట ఒకటిగా గంటలు దొర్లిపోతున్నయ్.

అర్ధరాత్రి పన్నెండయినా అశ్వని తలుపులు తీయలేదు. రవికి భయం వేసింది. అలా ఏకధాటిగా వ్రాసుకుపోతుంటే ఆతనికి నీరసం రాదుకదా. అనుకున్నాడు. అతనిని పిలుద్దామా వద్దా అని తచ్చాట్లాడుతుండగా అశ్వని దగ్గర పనిచేసే నౌకరు ''ఏమిటి బాబూ! ఇక్కడ నుంచున్నారు? అయ్యగారు లోపల వ్రాసుకుంటున్నారా?'' అనడిగేడు.

ఇతనికెలా తెలుసా అని లోలోపల ఆశ్చర్యపోతూ ''ఔను. ఏడున్నరనుండి బయటకు రానేలేదు. కాస్త టీ అదీ యేమైనా కావాలేమో కనుక్కో'' అన్నాడు రవి.

అతను నవ్వుతూ ''అయ్యగారి కేమీ అక్కర్లేదండీ. వ్రాసేటప్పుడు ఆయన యేమీ పుచ్చుకోరు. మధ్యలో ఎవరైనా పలకరిస్తే మీదపడి చంపినంత పని చేస్తారు. ఒక్కొక్కసారి ఒక రాత్రి, ఒక పగలు కూడా తిండి, నిద్రా లేకుండా వ్రాస్తారు. ఆయన తీరే అంత. ఆరేళ్లబట్టి ఆయనను చూస్తున్నానుగా. కాని మహ దొడ్డమారాజండీ!'' అంటూ వెళ్లిపోయేడు.

చేసేదేంలేక రవి వెళ్లి పక్కమీద మేను వాల్చేడు. కొద్ది నిమిషాలలోనే అతనికి గాఢంగా నిద్ర పట్టేసింది. తెల్లవారుఝామున నాలుగు గంటల ప్రాంతంలో ఎవరో తనని కుదుపుతున్నట్లనియి కళ్లు తెరిచేడు రవి.

ఎదురుగా అశ్వని. ఎర్రబారిన కళ్లతో వడిలిన ముఖంతో ఉన్న అశ్వనిలో ఏదో సంతృప్తి తొంగి చూస్తోంది. ''రవీ! లే! క్విక్! నువ్వు ఫెయిర్ కాపీ తీయాలి. స్క్రిప్టు పూర్తయింది'' అన్నాడు.

రవి లేచి ముఖం కడుక్కుని కాఫీ తాగి అశ్వని వ్రాసినదానికి కాపీ వ్రాయటం ప్రారంభించేడు. అది పూర్తయేసరికి పన్నెండు గంటలయింది.

అప్పుడు భోజనానికి లేచేడు రవి.

ఆతనికోసం తనుకూడా భోజనం చెయ్యకుండా కూర్చున్నాడు అశ్వని.

''పూర్తయిందా?'' అనడిగేడు అశ్వని.

''అయింది'' అని సమాధాన మిచ్చేడు రవి — అంతవరకు తను వ్రాసిన స్క్రిప్టులోని సంభాషణలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ. ఎంతో బరువైన డైలాగులు, హాస్యాన్ని చిలకరించే సన్నివేశాలు, శృంగారం వొలికించే సంభాషణలు, గుండెను పిండి చేసే పదాలు... ఏం వ్రాసినా ఆయా రసాలలో రచయిత పూర్తిగా తాదాత్మ్యం పొంది వ్రాసినట్లనిపిస్తోంది. నవరసాలను ఒకే వ్యక్తి అంత గొప్పగా ''ఈ రసాన్ని యీ రచయితే బాగా రక్తి కట్టించగలడు'' అని దేనికదే అనిపించేంత గొప్పగా వ్రాయగల గటం నిజంగా గొప్ప వరం అనుకున్నాడు రవి. అందునా లోకం దృష్టిలో త్రాగుబోతుగా, కులాసా పురుషుడిగా చెలామణి అయ్యే వ్యక్తిలో యింతటి ప్రతిభ దాగిఉన్నదంటే చూసికూడా నమ్మలేకపోతున్నాడు. నిర్మాత లందరూ అశ్వని కోసం ఎందుకు ఎగబడతారో అర్ధమయింది రవికి.

''చూసేవా? అన్న టైముకి యింకా ఐదు గంటల ముందే మన పని పూర్తయింది.'' అన్నాడు అశ్వని.

రవికి 'వాణి నా రాణి' అన్న పిల్లలమర్రి పిన వీరభద్రుడు గుర్తుకు వచ్చేడా సమయంలో.

తరువాత ''భగవంతం యీ స్క్రిప్టు తీసుకుని పదివేలు యిస్తాడు. డబ్బు చేతికి వచ్చిన తరువాత సర్దాగా ఊటీ, కొడైకెనాల్, కన్యాకుమారీ... అవీ చూసివద్దాం. ఆ పరిసరాల్లో నీకూ కాస్త యిన్స్పిరేషన్ వస్తుంది. నాకూ మార్పు కావాలి'' అన్నాడు అశ్వని.

అనుకున్నట్లుగా ఆయా సుందర ప్రదేశాలలో రవికి గొప్ప అనుభూతి కలిగింది. జీవితంలో అంతకు ముందెన్నడూ పొందని నిర్మలమైన మధురమైన ఆనందం కలిగింది. కాని ఎంత ఆనందాన్ని పొందినా ఆ ఆనందాన్ని తనతో పాలుపంచుకోవలసిన అర్ధాంగి పక్కన లేదే అన్న ఆవేదనకూడా కలిగింది. ''శ్యామలా! నే నెక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా, నా శరీరంలోని సగభాగం నీ దగ్గరే ఉంటోంది'' అంటూ కళ్లు తుడుచుకున్నాడు ఒకసారి.

సరీగ్గా అదే సమయానికి అటు వచ్చిన అశ్వని అతని కళ్లలోని నీళ్లు చూసి ''సారీ!'' అంటూ వెనక్కు వెళ్లిపోయేడు.

రవి తన మనసులోని ఆవేదనను, అనుభూతులను అన్నిటినీ పదిలంగా డైరీలలో దాచుకున్నాడు.

ఆనందం, ఆవేదన మిళితమైన ఆ విచిత్ర క్షణాలలో మహా వెల్లువలాటి ఆవేశం అతనిలో పెల్లుబికి అతనిలోని కవితా రత్నాలను వెలికి తీసుకు వచ్చింది.

అతను వ్రాసిన గేయాలను చదివి అశ్వని ఆశ్చర్యపోయేడు. ''యు ఆర్ రియల్లీ వెరీ టాలెంటెడ్ రవీ!'' అన్నాడు.

మద్రాసు వెళ్లిన తరువాత రెండు గేయాలను తను స్క్రిప్టు వ్రాసిచ్చిన నిర్మాతకి యిచ్చేడు. అవి కథలోని కథానాయకుడి భావాలకు అనుగుణంగా ఉండటంవల్ల వాటికి మంచి బాణీలను పెట్టి డబ్బు చేసుకున్నాడు నిర్మాత.

[ఇంకా ఉంది]

సినిమా విశేషాలు

"శోభన్ అంగీకారం"

"దేవుడు చేసిన పెళ్లి" చిత్రం ప్రజాదరణ పొందిన నిజాన్ని ఎవరూ "కాదు" అనలేరు. ఇప్పటికీ ఆడవాళ్లకు యిష్టమైన చిత్రంగా దే. వే. పె. ప్రదర్శిత మవుతున్నది. ఈ చిత్రాన్ని హిందీలో నిర్మించే వుద్దేశ్యం నిర్మాత పూర్ణచంద్రరావుకు గలదని రాశాను. ప్రస్తుతానికి ఆ ప్లాను విరమించ బడింది.

"మే" నుండి శోభన్‌బాబు కాల్‌షీట్లు యివ్వ డానికి అంగీకరించినట్లు తెలిసింది. ఆయనతో వెరైటీ కథ నొకదాన్ని తెలుగులో నిర్మించేందుకు నిర్ణయించినట్లు, దర్శకుడు తాతినేని రామారావు చెప్పారు.

శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్‌కు యింతవరకు విజయమే ప్రాప్తిస్తున్నది. "రవుడి రాణి, పాపం పసివాడు, దేవుడు చేసిన పెళ్లి" చిత్రాలు ప్రేక్షకులను ఆక ర్షించాయి. నిర్మాతకు ధనాన్ని, బ్యానర్ వేల్యూని తెచ్చిపెట్టాయి.

శోభన్‌తో కృష్ణంరాజు !

కలిసి నటిస్తున్న కలర్ చిత్రాన్ని ఏడుకొండల స్వామిని తన పేరుతో యిముడ్చుకొన్న, రతనం తలపెట్టారు. ఈ చిత్రానికి పేరులో విష్ణువుమ, ప్రతిష్ఠలో విక్టరీని గొన్న ప్రముఖుడు పారధిగా వ్యవహరిస్తారు.ముఖర్జీ ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు.

శోభన్‌బాబు పరపవ చల్లదనం వున్న 'ఠ', కృష్ణంరాజు ప్రక్కన వెన్నెల వున్న 'ఠ' నటిస్తున్నారు.

ఇద్దరు హీరోలు కలిసి నటిస్తున్న యీ వర్ణ చిత్రం షూటింగు ఏప్రిల్‌లో ప్రారంభమవుతుందని తెలిసింది.

సంగీతంలో ముఖ్య స్థానం వహిస్తున్న వర్తి, ఛాయాగ్రహణంలో ప్రత్యేక స్థానం వహిస్తున్న రత్నం, రచనలో రాణిస్తున్న నిజానంద్, విజయాన్ని తన అధీనం చేసుకున్న రావు యీ చిత్రానికి ముఖ్య సారధులు.



"రాముని మించిన రాముడు"లో



"అమ్మాయిల శపథం"లో చంద్రకళ

ఆచార్య అందించే చిత్రం

దర్శక, నిర్మాత బి. విఠలాచార్యగారు ఏ చిత్రం తీసినా అది ప్రయోగంగామా వుంటుంది, అందులోనే ప్రయోజనమూ వుంటుంది అని చాటి చెప్పే మరో నిర్దుష్టమైన సాక్ష్యమే "ఆడదాని అదృష్టం."

అదృష్టం చాలా చిత్రమైంది. అది ఏ నిమి షంలో, ఏ రూపంలో ఎవర్ని, ఎలా వరిస్తుందో చెప్పడం కష్టసాధ్యం. కొంతమంది అదృష్టపు ఛాయలకు దగ్గరగా వుంటూనే, అవివేకంతో, అహంకారంతో అంధకారంలో పడి వరించిన అదృ ష్టాన్ని దూరంచేసుకుని, అవాంతరాలొచ్చాక వాపో తుండడం సహజం. పై చిత్రకథ మూలాంశం అదే. కొంద రాడవాళ్లు ఏఇంట అడుగిడితే ఆఇంట అదృష్టం కల్పి వస్తూండడం కూడ సాధారణమే. ఆ విషయం తెల్సుకున్నవారు తెలివిగా ప్రవలుకుంటు

బంగారద మనుష్యగా కృష్ణ

"బంగారద మనుష్య" (కన్నడం) చిత్రం ఎంత బ్రహ్మాండంగా పోయిందో అందరికి తెల్సు. అలాంటి కుటుంబ గాథా చిత్రాన్ని తెలుగులో తీస్తే బాగుంటుందనుకుంటున్నారు హరి నా పిక్చర్స్ ఎస్. గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి హోమ్‌లీగా తీస్తాడనిపించుకున్న కె. ఎస్. రామిరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అశోక్‌కుమార్ పాత్రను నాగభూషణం వేస్తున్నారు. చిత్రంలోని మరో

జె. జె. ఫిలిమ్స్

"చందన" చిత్ర నిర్మాత – దర్శకుడు అగు బంజారు గిరిబాబు నిర్మించనున్న కొత్తచిత్రం

అధినేత డి. ఎస్. రాజు. అనుకోవడమేకాదు ఆచరణలో కూడా పెట్టాము. ఇప్పటికి ఏడురీళ్ల చిత్రం తయారైంది. నాల్గు పాటలు రికార్డ్ చేయడం, కొన్ని పాటలు చిత్రీకరించటం కూడా జరిగింది. రాజ్‌కుమార్ పోషించిన టైటిల్ పాత్రను హీరో కృష్ణ పోషిస్తున్నారు తెలుగులో. కృష్ణకు ఇదొక వెరైటీ భూమిక. తోబుట్టువు జీవితం విషాదమయం కాకుండా, తన అండదండలతో ఆవిడ సంసారాన్ని చక్కబరుస్తూ, జీవితాన్నే త్యాగం చేయ సమకట్టిన త్యాగధనుడి పాత్రను కృష్ణ చక్కగా చేస్తున్నట్టు వార్త. కృష్ణ సోదరిగా షావుకారు జానకి, అతని జోడీగా మంజుల నటిస్తున్న యీ చిత్రంలో నాగభూషణం, రాజబాబు, చంద్రమోహన్, వెన్నిరాడై నిర్మల ముఖ్య పాత్రధారులు.

సి. ఎస్. రావు దర్శకత్వంలో సర్వాంగసుందరంగా తయారౌతున్న పై చిత్రానికి డి. వి. నరసరాజు మాటలను, జి. కె. రాము ఛాయను, కె.వి.మహదేవన్ సంగీతాన్ని,గోఖలే కళను సమకూరుస్తున్నారు.

గుడ్డిపిల్లగా శ్రీదేవి

మొన్న మొన్నటివరకు బుల్లి, బుల్లి పాత్రలను పోషిస్తూవచ్చిన శ్రీదేవికి ఇపుడొక సదవకాశం వచ్చింది. "సృజన" నిర్మిస్తున్న తొలి చిత్రంలో గుడ్డిపిల్లగా నటిస్తోంది.! శ్రీదేవి భావి జీవితానికి ఈ పాత్ర ఒక మలుపు కావొచ్చు.

హిందీ చిత్రం "అనురాగ్" ఆధారంగా ముఖ్య పాత్రను 1974 లో ఉత్తమ బాలనటుడిగా జాతీయ బహుమతి పొందిన "కాడు" చిత్రంలో నటించిన మాష్టర్ నటరాజ్ ధరిస్తున్నాడు. తదితర ముఖ్య పాత్రలను రాజబాబు, అల్లురామలింగయ్య, రవికాంత్, శ్రీధర్, రమణమూర్తి, వై. వి. రాజు, శుభ, ఝాన్సీ పోషిస్తున్నారు.

గొల్లపూడి మాటలు, బాలుమహేంద్ర ఛాయ, సత్యం సంగీతం, భాస్కరరాజు కళ, మణి కూర్పు "సృజన" తొలి సృష్టికి ఎంతో దోహదం చేస్తున్నాయి.



"అయినవాళ్లు"లో సుజాత, హరిబాబు

యీ సంస్థనుంచి నిర్మితమవుతుంది. ఈ చిత్రం షూటింగు బెంగుళూరు కంటీరవలో జరుగుతుంది. (తెలుగు, కన్నడ భాషలలో.) రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారి కథ యీ చిత్రానికి ఆధారం. ఈ చిత్రం తాలుకు పాటలను రమేష్‌నాయుడు ఫిబ్రవరి 24 నుండి వరుసగా రికార్డు చేశారు. జయంతిది విశిష్టమైన వేషం అని తెలిసింది.



"లక్ష్మణ రేఖ"లో చంద్రమోహన్, జయసుధ

వ్వారు. తెల్పుకోనివాళ్ల తిక్కలో పడడమే కాకుండా, చిక్కుల్లోకూడా పడుతుంటారు. ఈ చిత్రంలో లక్ష్మి అనే అమ్మాయి చుట్టూ తిరుగుతుంది కథ. "ఆడదాని అదృష్టం" అంటే ఏమిటో విశదపరుస్తుంది పై పాత్ర.

లక్ష్మిగా సుమ లక్షణంగా చేయడమే కాదు, కొన్ని సన్నివేశాల్లో సహజ నటన్ను ప్రదర్శించి, సన్నివేశ ప్రాధాన్యతను రక్తి కట్టించింది. జి. వి. ఆర్. శేషగిరిరావు దర్శకత్వంలో తయారైన ఈ చిత్రానికి హనుమంతరావు సంగీతాన్ని, రాజశ్రీ మాటలను, సత్యనారాయణ ఛాయను, మోహన్ కూర్పును, నాగరాజన్ కళను సమకూర్చారు.

చలం వెరైటీపాత్రను పోషిస్తున్న ఈచిత్రంలో రామకృష్ణ, మమత, నిర్మల, కాశీనాథ్ తాతా, చిట్టిబాబు, గౌరీశ్రీయ, సాక్షి, కె. కె. శర్మ, వై. వి. రాజు, కేశవరావు, పద్మాంజలి, భీమరాజు, జావియర్ కాంచన, జయమాలిని ప్రధాన తారాగణం.

హాస్యం, వినోదం, విషాదం అన్ని రసాలను సమపాళ్లలో రంగరించి, నూతన పంథాలో చిత్రాన్ని మలిచిన దర్శకుడు జి. వి. ఆర్. శేషగిరిరావు అభినందనీయుడు ;

జనప్రియమైన అన్నిరకాల అలంకరణలతో తయారైన ఈ చిత్రం విజయాద్వారా మార్చి 14 వ తేదీ ఆంధ్రా అంతటా విడుదలౌతోంది.



"సంతానం—సౌభాగ్యం"లో కృష్ణ, విజయనిర్మల

సినిమా

ఎన్టీఆర్ అపూర్వ నటన !

చూడాలంటే, ''రాముని మించిన రాముడు'' చిత్రం కొరకు వేచియుండాల్సిందే. ఈ చిత్రంలో యిద్దరు రామారావులు కనిపిస్తారు. ఇద్దరిలో ఎవరు గొప్పగా చేశారో తేల్చడం అతికష్టమైన పని అవుతుంది.

మేజరుకు గల ధీరోదత్తతను, డాక్టరుకు గల సహన శీలతను ''నటరత్న'' అపురూపంగా చూపెట్టారు. ఈ చిత్రానికి గోపీనాథ్ దర్శకుడు. అతడి ప్రతిభ అనేకచోట్ల ప్రస్ఫుట మవుతుంది.

సంగీతం గూర్చి రాయాలంటే, చలపతిరావు ఒక పట్టు పట్టారనే చెప్పాలి. ప్రతి పాట శ్రోతల నోట పదే పదే పలికేట్టు, రాగాలను పొదిగారు. ఇక ఛాయాగ్రహణం అంటారా, జి. కె. రాము నిష్ణాతుడయ్యె !

అగ్రనటి హీరోయిన్ గాబట్టి, ఆమె నటన అగ్రస్థానాన్ని ఆక్రమించింది. మిగతా ముఖ్య భూమికలను శ్రీవిద్య, పండరీబాయి, జగ్గయ్య, ప్రభాకర రెడ్డి, త్యాగరాజు ధరించారు. హాస్యం శ్రుతిమించకుండా నాగేష్ నటించారు.

ఉగాది పర్వదినాన ''రాముని మించిన రాముడు'' చిత్రాన్ని విడుదలచెయ్య వుద్దేశించినట్లు నిర్మాత భక్తవత్సలం చెప్పారు.

గురజాడ... వీరేశలింగం !

ఈ మహాత్ములు చొనరించిన మంచి పనులు జగద్విదితాలు. సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి, ఆచరించిన మహానుభావులు.

ఈ రెండు పాత్రలను శోభన్‌బాబు పోషించారు. రవిశంకర్ ఆర్ట్ పిక్చర్స్‌వారి వర్ణ చిత్రం ''బలిపీఠం''లో శోభన్‌బాబు పై రెండు పాత్రలను పోషించిన విధానాన్ని రషస్‌లో చూచి ఆశ్చర్య పడ్డాను. మూర్తీభవించినట్లు గురజాడ, కందుకూరివలె అగుపించారు.

''కరుణ సమాజం''లో వీరేశలింగం జయంత్యుత్సవాలు జరిగాయి. ఆ సమాజానికి భాస్కరరావు ముఖ్య ఆలంబకుడు.

అనాధ శరణాలయంలోని బాల బాలికలను సమీకరించి, వారికి మన దేశ నాయకుల సాంఘిక సేవా నిరతిని వెల్లడిచేశారు.

''బలిపీఠం'' చలన చిత్ర చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని సృష్టించగలదు ఈ చిత్రం రజతోత్సవ వైభవాన్ని చూడగలదేమో ! ముప్పలనేని శేషగిరిరావు సమర్పించు యీ చిత్రానికి సునీల్ నిర్మాత. గడుసరి దర్శకుడు. నవయుగ రిలీజ్.

ఈశ్వర్ డైరెక్టరా ?

పబ్లిసిటీ ప్రముఖుడుగ పేరు, ప్రఖ్యాతులు పొందిన ఈశ్వర్ ఏమిటి ? డైరెక్టర్ కావడం ఏమిటి అని విస్తుపోయినవాళ్లలో నేనూ ఒకడ్ని.

ఆయన 42 రోజులలో రూపొందించిన ''అయినవాళ్లు'' చూచిన తరువాత యింతటి ప్రతిభావంతున్నడా ఈశ్వర్ అనిపించింది. పాటల చిత్రీకరణలో ఒక ప్రత్యేక పద్ధతి అగుపించింది. పాత్రలను బాగా డ్రెమటైజు చేశారు. కథ తనదే అవడంచేత, పాత్రలమీద గురి తప్పకుండా నటీ నటుల చేత కావలసిన ఫలితాన్ని పొందగలిగారు.

నటీ నటులలో మూగపిల్లగా నటించిన రత్నాంజలి మొదటి మార్కులను కొట్టేస్తుంది. తరువాతి స్థానం హరిబాబుకు వస్తుంది. మిగతా వాళ్లలో వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, రమేష్‌బాబు, సీతాలత, గిరిజారాణి గార్ల నటన ప్రశంసనీయంగా వున్నది.

ఈ చిత్రానికి అవుట్‌డోర్ దృశ్యాలు సుందర ఆకృతిని యిచ్చాయి. కెమరామెన్ నటరాజన్ అభినందనీయుడు. (కైకవర, మోర్త) సంగీతం పట్ల శ్రీరాజ్ కృషి వాలుగు పాటలలో కనిపిస్తుంది.

నిర్మాత బోణం ఆంజనేయులు ధైర్యం చేసినందుకు, యిబ్బంది కలగదు.



రవికాంత్, జయప్రద,
''స్వతంత్రం వచ్చింది''లో కొత్త నటులు

అన్నపూర్ణగా జయంతి

లలితా మూవీస్ పతాకం క్రింద జి. జగదీష్ చంద్రప్రసాద్ నిర్మించిన తొలి చిత్రం ''చల్లని తల్లి'' పూర్తయి, విడుదలకు సిద్ధమైంది. ప్రముఖ నిర్మాత డి. మధుసూదనరావుగారు సమకూర్చిన ఈ చిత్ర కథలో పాత్రల వ్యక్తీకరణ చాలా స్పష్టంగా, సమంజసంగా వుండడానికి మరో మచ్చుతునకే అన్నపూర్ణ పాత్ర.

ఈ అన్నపూర్ణ చిన్నతనంలోనే కన్న తల్లిదండ్రులను పోగొట్టుకున్న అభాగిని. పినతండ్రి ఇంట పెరిగింది. సంస్కారం, సాంప్రదాయం అలవరచుకుంది. స్వేచ్ఛా భావాలకు దూరంగా వుంటుంది. ఎంతటి ఓటమినైనా ఓర్పుతోనే జయిస్తుంది. ఆఖరుకు పెంచిన పినతండ్రే తన్నొక అవామకుడికిచ్చి పెండ్లి చేయ నిశ్చయిస్తే, నవ్వుతూ నరకాన్ని అనుభవించడానికి ఆయత్తమయిందేగానీ, ఎవరిని పల్లెత్తు మాట అనలేదు. ఇలా అడుగడుగునా జీవితంలో అగాధాలను ఎదుర్కొంటూ పోరాడిన అన్నపూర్ణ పాత్రను జయంతి భేష్‌గా చేసింది. పోషించే పాత్రకు పరిపూర్ణతను చేకూర్చే కొద్దిమందిలో తామూ ఒకరై అని మరోసారి నిరూపించింది. అన్నపూర్ణ పాత్రకు అతివల సింపతీ లభిస్తుందనడంలో సంశయంలేదు.

అన్నపూర్ణ విడుదల చేసే ఈ చిత్రానికి కె. ఎస్. రామిరెడ్డి దర్శకుడు. రాజేశ్వరరావు సంగీత శాఖకు, గొల్లపూడి రచనావిభాగానికి, సెల్వరాజ్ కెమెరా శాఖకు, చలం కళా విభాగానికి, మణి కూర్పుకు అధిపతులు. ఈ చిత్రాన్ని డి. మధుసూదనరావుగారు సమర్పిస్తున్నారు.



''బలిపీఠం''లో అల్లు రామలింగయ్య, జానకి



"జీవన జ్యోతి"లో శోభన్‌బాబు, రాజబాబు

పరుగులు తీసే పాట!

జగపతి స్టాఫ్ ఎంటర్ ప్రైజెస్ రంగులలో నిర్మిస్తున్న "పిచ్చి మా రాజు" చిత్రానికిగాను, ఫిబ్రవరి 14 వ ఒక పాటను రికార్డ్ చేశారు.

మహాకవి ఆత్రేయ రాసిన :

"నిక్కి నిక్కి చూశావో
నీ డొక్క చించుతారు
డోలు కడతారు" అనేడి పాటకు, మహదేవన్ సంగీతాన్ని సమకూర్చారు. బాలు పాడారు. పరుగులు తీసే పాటగా, ప్రతినోటా పలికే అందరినీ ఆకర్షించే పాటగా వచ్చింది.

అదేమిటోగాని, మహదేవన్ జగపతికి చేసే పాటలలో ప్రత్యేకత కొట్టొచ్చినట్టు అగుపిస్తుంది.

తన సంస్థను అంటిపెట్టుకొన్న, పనివారల కోసం జగపతి అధినేత యీ మంచి కార్యాన్ని తల పెట్టారు. ఈ సత్సంకల్పానికి దైవకృప తప్పక లభిస్తుంది. ప్రజల ఆదరణ అవశ్యం లభిస్తుంది.

ఈ చిత్రంలో శోభన్‌బాబు, మంజుల, రాజబాబు ప్రధాన పాత్రధారులు. రచనకు సత్యానంద్, ఛాయకు వెంకటరత్నం, ఆర్టుకు కృష్ణారావు, కూర్పుకు సంజీవి సారధులు. జనప్రియుడు రాజేంద్ర ప్రసాద్ దర్శకుడు.

గడుసరి కొచ్చిన కొత్త చిత్రాలు

దాసరి నారాయణరావును గడుసరి అనడం నాకు అలవాటు. కష్టించి, శ్రమ ఫలితంగా పైకొచ్చిన ప్రతిభావంతుడు. ఇంతవరకు అపజయం ఎరుగని విజయుడు.

తక్కువ చిత్రాలను ఒప్పుకుందామని ఎంత భీష్మించుకుని కూర్చున్నా, కావాలనుకుని వచ్చేవాళ్ల మాటను కాదనలేకపోతున్నారు.

అందుకనే, అయిదు కొత్త చిత్రాలను అంగీకరించారు. అవి ఏవన.

ప్రసాద్ ఇంటర్నేషనల్ కొకటి. దేవీ ఆర్ట్స్ కొకటి. గీతా ఆర్ట్స్ కొకటి. విజయ వేలాంగణికి యింకొకటి. రవిశంకర్‌కు మరొకటి.

ఇవిగాక, నాగేశ్వరరావుగారితో సినిమా నిర్మించాలన్న కోర్కె వున్న నిర్మాతకు, చెయ్యాలన్న ఆతురత దాసరికి వున్నది.

బాబు ప్రత్యేకత!

మారుతీ ప్రొడక్షన్స్ నిర్మించిన వర్ణ చిత్రం "బాబు" యింతవరకు వచ్చిన రిచ్ సినిమాలన్నిటినీ మింగేసింది. సెట్ల వైభవాన్ని గూర్చి వ్రాయనా, కెమరా చాతుర్యాన్ని గూర్చి విశదపరచనా, రాఘవేంద్రరావు దర్శకత్వ విలువలను వివరించనా లేక చక్రవర్తి సంగీత సామర్థ్యాన్ని సమీక్షించనా ... యిలా రాసుకుపోతుంటె, అన్ని శాఖలు పోటీపడ్డాయి అనాల్సివస్తుంది.

కథలో కొత్తదనం గూర్చి లిఖించనా, కథనంలోని మజాను గూర్చి తెలపనా, సంభాషణల సారస్యాన్ని గూర్చి చర్చించనా ... అన్నీ "ఎవన్"గా వున్నాయి.

శోభన్‌బాబుకు ముగ్గురితో పని తగిలింది. అగ్రనటితో కాస్సేపు, అరుణాయిరానీతో యింకాస్సేపు, లక్ష్మితో మరికాస్సేపు నటించారు.

నటనలో వాణిశ్రీ పేరు ముందు చెప్పి, మిగతా పేర్లను తరువాత చెప్పడం సమంజసం అనిపిస్తుంది.

నిర్మాత ఏ. కుమార్ పెద్ద పెట్టుబడిని పెట్టినందుకు, ప్రేక్షకులు పెద్దగా ఆశలు పెట్టుకొన్నందుకు అనుకూలంగా "బాబు" తయారైంది.

"గాజుల కిష్టయ్య"లో జరీనా, అంజలి

"అందరూ మంచివారే"లో మంజుల, జయంతి

*





ఈలపాట యికలేదు...అది విన్నవారికి ఆ అనుభూతి మాత్రం శాశ్వతం!



పిల్లనగ్రోవి లేని శ్రీకృష్ణుడన్నాడు జవహర్‌లాల్ నెహ్రూగారు. నైటింగేల్ ఆఫ్ ఆంధ్ర అన్నాట్ట రవీంద్రనాథ్ టాగూరుగారు. అసలు పేరు కళ్యాణం వేంకట సుబ్బయ్య అయితే యీ మహానటుని బాల్యం లోనే దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారు ఓసారి రఘురాముడి వేషంలో చూసి ఆశీర్వదించి "రఘురామయ్య" అని పేరు పెట్టారని, నిజంగా అది తన జీవితానికో మలుపు అని – జపాన్ దేశం పర్యటించటానికి వెళ్తూ రెండేళ్ల క్రితం "ఈల పాట" రఘురామయ్యగారు ఎంతో సగర్వంగా చెప్పాడు. "నాకు డెబ్భై రెండు ఏళ్లొచ్చాయండి కాని చూడండి నా పళ్లొక్కటయినా వూడాయా?... [టక టక ఆడించి చూపాడు] నా జుట్టు యిదిగో చూడండి [లాగి లాగి చూపించి] వూడిందా? లేదు... చూడండి... ఎన్ని పద్యాలయినా ఎలా ఆలాపిస్తానో ఆయాసం రాదే అంటూ పాండవోద్యోగ విజయాలను "వోహో" మనేలాగ, ఏ ఆర్కెస్ట్రా అక్కర్లేకుండా పాడి— అంతలోనే ఆలపట లేదు అని నిరూపించటానికా అన్నట్లు మధ్య వేలు ముడిచి నాలిక క్రింద పెట్టి మృదు మధుర మురళీగానం వినిపించాడు — "యోగం" మీద యోగాసనాల ప్రయోగంమీద ధృఢ నమ్మకమున్న ధృఢకాయుడు 'కళ్యాణం' రెండుసార్లు కళ్యాణం చేసుకున్న యిద్దరు పత్నీమణుల్ని, ఆర్గురు సంతానాన్ని ఎందరో "సినీ – రంగస్థల కళ్యాణమూర్తి రఘురామయ్య" అని ప్రేమతో చెప్పకునే అభిమానుల్నీ శాశ్వతంగా వదిలి పోయాడు [ఫిబ్రవరి 24 మంగళవారం].

ఈ మధ్యనే భారత ప్రభుత్వం పద్మశ్రీ యిచ్చి గౌరవించినప్పుడు హైద్రాబాద్‌లో జరిగిన సన్మాన సందర్భంలో తీసిన చిత్రమే యీ పేజీలో వున్నది... శ్రీకృష్ణుడు, నారదుడు కూడా వేసి శభాష్ అనిపించుకున్న రఘురామయ్య 8వ ఏట రంగస్థల ప్రవేశం చేసి దానికి కీర్తి ప్రతిష్టలను సంపాదించి తాను చరితార్థుడైనాడు. వెండి తెర వచ్చాక వంద చిత్రాలలో – పద్యాలను రఘురామయ్య భాణీలో వినిపిస్తూ రాణించాడు... దేశ విదేశాల్లో "ఈల పాట" కచ్చేరీలు చేసి, 74·వ ఏట కూడా పాండవోద్యోగ విజయాలు ఆడి చూపించి నాలుగు తరాల ప్రేక్షకులను మురిపిస్తూనే... దీర్ఘ వ్యాధులతో తీసుకోకుండా గుండెపోటుతో భౌతిక కాయాన్ని వదిలిపోయాడు. ముందు తరాలవాళ్లకి "ఈల పాట" ఒక "మిస్టరీ"గా రఘురామయ్యగారు ఒక హిస్టరీగా వుండిపోతారు!

—[పిరాజీ]

కదంబ కార్యక్రమానికి విజయం

తెలుగు సినిమా తారలు ఆంధ్రదేశంలో నిర్వహించిన వినోద కదంబ కార్యక్రమానికి ప్రజల సంపూర్ణ సహకారం లభించింది. వెళ్లిన ప్రతి చోటా ఈ ప్రదర్శనలకు ప్రశంసలు ప్రాప్తించాయి.

తెలుగు సంవత్సరాదినాడు జరుగనున్న ప్రపంచ మహాసభల నిర్వహణకు యీవిధంగా సహాయపడిన తెలుగు కళాకారులకు ప్రభుత్వం ఎంతేని ఋణపడి యుంది.

షూటింగుల వొత్తిడివల్ల కొందరు పాల్గొనలేకపోయారేగాని, విముఖతవల్ల కాదన్న నిజాన్ని ప్రజల దృష్టికి తేవలసిన బాధ్యత నాకున్నది.

సినిమా

బాధిత కుటుంబాలకు సహాయం చెయ్యాలన్న సత్సంకల్పంతో, సినిమాతారలు మూడు లక్షలు ప్రోగుచేసినందుకు ఎంతేని అభినందించాలి. ఈ డబ్బును ఏ రూపంలో, ఎవరెవరికి ఎలా బట్వాడా చేస్తారో వేచిచూడాలి.

"సర్వే జనా సుఖినో భవంతు" అనేది ధ్యేయం యీ అసోసియేషన్‌కు వున్నది.

— శ్రీనివాస్

"పుట్టింటి గౌరవం"లో భారతి



విశాఖపట్నంలో ప్రయోగాత్మక చిత్రం వయసు మనసులు


విశాఖపట్నం చలనచిత్ర నిర్మాణ కేంద్రంగా తన స్థానాన్ని రూపొందించుకుంది. జనవరి 14 సంక్రాంతినాడు విశాఖపట్నంలో సేవాసదన్ ఎంటర్‌ప్రైజెస్ వారు నూతనంగా నిర్మిస్తున్న ప్రయోగాత్మకచిత్రం "వయసు మనసులు"కి ప్రారంభోత్సవం జరిగింది. ఆరోజు సాయంత్రం స్థానిక విక్రం హోటల్లో పత్రికా విలేఖరుల గోష్టిలో చిత్రనిర్వాహకులు, కళాకారులు, సాంకేతిక నిపుణులు అంతా పాల్గొన్నారు.

ఈ సందర్భంలో నిర్మాత శ్రీ నారాయణ మహేశ్వరి ప్రసంగిస్తూ, విశాఖపట్నంలో పూర్తి చిత్ర నిర్మాణం సాగించాలనే తన చిరకాల వాంఛ నేడు నెరవేరుతున్నందుకు తాను ఎంతగానో సంతోషిస్తున్నానని, అన్నారు. విశాఖపట్టణంలోనూ, పట్టణ పరిసర ప్రాంతాలలోనే చిత్రం షూటింగు అంతా జరపడం, నటులు అంతా సరిక్రొత్తవారు అవడం తమ నిర్మాణంలోని ప్రత్యేకతలు అని ఆయన అన్నారు. (ఈ చిత్రానికి రచయిత శ్రీ ఆరుద్ర)

తరువాత నటీనటులు అనిల్‌కుమార్(హీరో), కుమారి అమృత (హీరోయిన్), డాక్టరు మూర్తి (సైడ్ హీరో), కుమారి కె. విజయ (సైడ్ హీరోయిన్), జి. ఎస్. ఎన్. రాజు (విలన్), కాబరా డ్యాన్సర్ ముంతాజ్ (సేఠ్), డైరెక్టర్ రాజ్‌కుమార్ మిట్టల్, సహకార దర్శకుడు గోవిందరావు, అశోక్‌కుమార్ (కెమెరా), శ్రీరాములు నాయుడు (ఎడిటింగ్), శేషూ, రాజు (డ్యాన్సస్), సత్యం (స్టిల్స్) మరికొందరిని సభలో పరిచయం చేశారు. నిర్వాహకులు శ్రీ కొర్రి అప్పారావు, శ్రీకాటాజీరావుకూడా సమావేశానికి హాజరయ్యారు.

మొదట విశాఖపట్నంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కొండపై వున్న కోవెలలో షూటింగు ప్రారంభించబడింది.

— జి. ఎస్.



CMGF-41-175 TL



ధర్మ పథం

బులుసు వేంకట రమణయ్య

మన దేశంలో పౌరాణికులు సాధారణంగా రాత్రి పూట పురాణాలు చెప్తూ వుంటారు. వారు పురాణ గాథలతోపాటు అనేక నీతులనూ, ధర్మాలనూ ఆ యా సందర్భాలలో చెప్తూ ఉంటారు. వాటిని వినడానికి మహిళలు కూడా వెళ్తూ అనేక విషయాలను గ్రహిస్తారు.

ఒకనాటి పురాణ కాలక్షేపంలో ఒక పౌరాణికుడు స్త్రీలను ఉద్దేశించి 'పతి భక్తి' అనే విషయంపైన ఎన్నో ఉదాహరణలతో ఉపన్యసించాడు. భర్తపైని భక్తి కుదరడానికి ఉదయమే స్నానం చేసి, వంట మున్నగువవి ముగించి, దేవుణ్ణి పూజించి పతిని స్తుతించే శ్లోకాలూ, పతి భక్తిని తెలిపే శ్లోకాలూ ప్రతి దినం చదువుతూ ఉండాలని ఆయన చెప్పాడు. ఆ శ్లోకాలను కూడా కొన్నిటిని చెప్పగా, అక్కడికి వచ్చిన మహిళలు వాటిని వ్రాసుకుని, ఆయన చెప్పిన ప్రకారం వాటిని చదవసాగారు.

ఒకనాడు ఒక మహిళామణి ప్రాతః కాలంలో జరపవలసిన కృత్యాలు జరపడంలో కొంత ఆలస్యమైంది. ఆమె వంట, పూజ ముగించేసరికి భర్త భోజనం చెయ్యవలసిన టైము అయింది. ఆయన స్నానాదులు ముగించుకుని సిద్ధంగా వుండి, అన్నం పెట్టవలెననీ, ఆఫీసుకు వెళ్ళడానికి టయిము అవుతున్నదనీ తొందరపెట్టసాగాడు. లేకపోతే భోజనం చెయ్యకుండానే పోవలసి వస్తుందన్నాడు. అతని భార్య అప్పుడే పతి స్తుతి శ్లోకాలు చదవడం ప్రారంభించింది. అయిదు నిమిషాల్లో తన స్తుతి పాఠం ముగిసిపోతుందనీ, వెంటనే అన్నం పెడతాననీ, ఈ లోపున తొందరపడితే ఎలాగనీ సమాధానం చెప్పింది. భర్తకు ఆశ్చర్యం కలిగింది.

పతి భక్తి పతి స్తోత్ర పాఠం వల్ల వ్యక్తం కాదు. భర్త అవసరాలు తీర్చి, అతని మనస్సును అనుసరించడమే సరియైన పతి భక్తికి దృష్టాంతం. దానిని విడిచి, స్తోత్రాలు పఠించడంవల్ల మాత్రం ఏమీ ప్రయోజనం ఉండదు.

విజయవాడలో

ఫ్రాక్స్ ప్రదర్శన

→

విజయవాడ మహిళా మండలి హాలులో ఫిబ్రవరి 23 ఆదివారం జరిగిన పిల్లల చేనేత దుస్తుల ప్రదర్శనలో ఒక భాగం.



ఆడవాళ్ళు అందమైన దుస్తులు వేసుకోడం మగాళ్ళ కోసమూ కాదు, తమకోసమూ కాదు. కేవలం తోటి స్త్రీలను ఏడిపించటానికే గొప్పగా అలంకారాలు చేసుకుంటారూ అని ఎవరో అన్నారు. అదే మాట పిల్లల దుస్తుల విషయంలో కూడా ఆంధ్ర వనితలకైనా అమెరికన్ మహిళలకైనా ఒక్కలాగే నప్పుతుంది. మన పిల్లల్ని చూసి యిరుగమ్మ పొరుగమ్మ – టీచరమ్మ అంతా మురిసిపోవాలి... [నిజం చెప్పొద్దూ వుడుక్కోవాలి] అనుకుంటూనే రకరకాల తంటాలు పడిపోతుంది ఏ తల్లి అయినా తన బిడ్డలకి ముస్తాబు చేస్తూ... విజయవాడలో ఫిబ్రవరి నెలలోని ఆఖరు ఆదివారంనాడు స్థానిక మహిళా మండలి మందిరంలో జరిగిన చిన్నపిల్లల కోసం పనికొచ్చే అందాల చేనేత దుస్తులు "ఫ్రాక్స్" "మినీ" "మిడీ" "మాక్సీ"ల ప్రదర్శన బాగుంది. దానికి పిల్లల్ని తీసుకుని ఇల్లాండ్రు – వాళ్ళ వెనుక గృహ యజమానులు కూడా విరివిగా హాజరైనారు... మొత్తం నో 'వంద' రకాల చేనేత 'గౌన్లు' 'ఫ్రాక్'లు, అవీ ప్రదర్శించారు... వీటిని తయారు చేయించి యీ ప్రదర్శన ఏర్పాటు చేసిన ఆకురాతి వేంకటేశ్వరరావుగారి వుద్దేశంలో అమెరికా, కెనడా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా లాంటి సంపన్న దేశాల్లో మన చేనేత దుస్తులకి ముఖ్యంగా పిల్లకాయల దుస్తులకి మంచి గిరాకీ వుంది. అమెరికాలో వున్న మనవాళ్ళు అంటే మహిళలు యీ "మాడల్స్"ని వాళ్ళ తీరికవేళల్లో చేసి, అక్కడ మార్కెట్‌కి యిస్తే యిటు కాలక్షేపం, అటు చిరు సంపాదన కూడా దక్కుతాయి." వేంకటేశ్వరరావుగారు ఆంధ్రా హాండ్‌లూమ్స్ కార్యదర్శి కనుక యీ దుస్తులను వివిధ రకాల కొత్త కొత్త పద్ధతుల్లో చేసి రెండేసి డాలర్లకు మించని రేటుకి ఎగుమతి చేయొచ్చునంటున్నారు కనుక ఈ మధ్యనే ఆయన విదేశ యానం చేసివచ్చారు కనుక ఆ అంచనాని నమ్మాలి. మన దేశంలో స్త్రీ సంక్షేమ సంఘాలవారుకూడా యీ నూరు "మాడల్స్" లనే కాదు యిలాంటి మాడల్స్ మరిన్ని తీసుకుని "చేతి పనివాడితనం"తో "ఎంబ్రాయిడరీ" – చిన్న బొమ్మలు అవీ ఫ్రాకుల మీద కుట్టటం లాంటివి చేస్తే వారి తీరిక వేళలు "కళారాధన" గా గడచిపోతాయని కూడా యీ ఎగ్జిబిషన్ నిర్వాహకుల అభిప్రాయం. "పదహారు రూపాయిలకన్నా ఏ గౌనుకి ఎక్కువఖర్చు కాదుట!" [టూ డాలర్స్ వోన్లీ] – అయితే యీ ప్రదర్శనలో "ఫ్రాక్"లు నేరుగా అమ్మకానిక్కాదు– "మీరిలాంటి మాడల్ ఫ్రాకులు నో అరడజన్ మాకు మీ తీరిక వేళల్లో కుట్టి యివ్వండి – వస్త్రువులు మావి – పనివాడితనం మీది – దాంతోపాటు యీ గౌనుల్లో ఏదైనా మీది" అంటున్నాడాయన... అక్కడి స్త్రీలు చాలామంది యివి కొందామనుకొని – అయితే "సొంతంగా కుట్టుకోమంటారు?" అనడం–"కుట్టి మాకివ్వండమ్మా... అమెరికాలో పాపలు గర్వంగా కొనుక్కొని గొప్పగా వాటిని తొడుక్కుంటారు..." అని నిర్వాహకులు అనడంమొత్తంమీదయీ "ఫ్రాక్స్" ప్రదర్శన [ఫ్రాగ్స్‌లాగ] పిల్లలు అటూ యిటూ గెంతుతూంటే, తల్లులు మాడల్ దుస్తులను తన్మయంగా పరికిస్తూంటే చూసే వాళ్ళకికూడా ముచ్చటేసింది.

—[వీరాజీ]

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఎస్. కె. బి. బి. పిడుగురాళ్ల.

నేను ఏ మంత్రినో అయితే మీకు స్త్రీ శిరోమణి అన్న బిరుదు నిచ్చేదాని...

అమ్మా, తల్లీ, సిగమోసే ఓపికే లేదు నాకు! ఇంకా శిరోమణినెలా మోయగల ననుకున్నావు?

ఎమ్. ఎ. పి. సుల్తానాబాద్.

నేతిబీరకాయలో నెయ్యి ఎంత ఉందో నేటి సోషలిజంలో అంత నిజం ఉందంటాను . . .

ఏ శాస్త్రవేత్తో పరిశోధనలు జరిపి నేతి బీర కాయలో నెయ్యి ఉందని నిరూపించకలడేమో గాని యీ సోషలిజాన్ని నిర్వచించలేడు!

వి. పి. ఎస్. ఆర్ – నిర్మల్.

సంసారం సాగరమని తెలిసి కూడా యీదడం ఎందుకు?

ఛాలెంజిగా తోచేదాన్ని జయించాలనిపించడం— మానవ నైజం.

జి. కె. ఆర్ – సికింద్రాబాదు.

దయ అంటే?

ఎదుటివాడి కష్టం చెప్పకుండా తెలుసుకోకల్గడం.

కె. ఆర్. ఆర్. కరీంనగరు

హిందూధర్మశాస్త్రం ప్రకారం బొట్టు చాలా ముఖ్యం. షాషన్ ప్రకారం కొందరు నారీమణులు బొట్టును విసర్జించారు. వీరినేమనాలి?

ఏం? అభ్యుదయ వాదులని ఆడవారిని అన కూడదా? సంప్రదాయాన్ని మీరు ధిక్కరిసే ప్రోగ్రసివ్. మేం ధిక్కరిస్తే నేరమా?!

కె. బి. ఎస్. ఆర్. కురబలకోట.

మీరే పార్టీ? నాగేశ్వరావా? రామారావా?

నేను ఏ పార్టీకాదు. ఎవరి సినిమా భరించ కల్గితే ఆసినిమా చూస్తాను!

ఎస్. ఏ. బి. హెచ్ – కోటబొమ్మాళి

విరసం సభ్యుల విడుదలకై విశ్వవిద్యాలయాచార్యులే ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తున్న ప్రస్తుత తరుణంలో మిగతా సాహితీ లోకమంతా ఏం చేస్తున్నట్టు?

ఇంకా వయం ఏ బనాయింపు కేసైనా ఒకటి చూపి జైల్లో తోశారు వీళ్ళని. అలా కాకుండా ఎక్కడో జరిగిన దొంగతనాలకి అనుమానం మీద ఖైదు చేసి రెండేళ్ళ నుంచి నాలుగేళ్ళ దాకా యింకా "రిమేండు" లోనే వుంచిన మాజీ నేరగాళ్ళున్నారట—కొంచెం ఆ విశాలదృక్పథం దగాపడిన యీ తమ్ముళ్ళ మీద కూడా చూపకూడదా? స్టూఆర్టుపురం పోయి వాళ్ళ గోడు కూడావిని ఆ వత్తిడేదో కాస్త తేస్తే ... అప్పుడూ మనకి సాటి మానవుణ్ణి గురించి అరిచే హక్కు వుంటుంది. గొడ్డు గేదెకి ఉట్టి అరుపులు ఎక్కువన్నట్టు—ఎందుకీ నినాదాలూ, హెచ్చరికలూ, సానుభూతి ప్రదర్శనలూ...

జె. ఎవ్. కె వికారాబాద్.

సమాజం సాహిత్యం అనే వ్యాస సంపుటిలో దిగంబర విప్లవ కవులను గురించి రాశారు. కాని వారు విప్లవ రచయితలను సమర్థిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా అన్నది అర్థం కాలేదు . . .

అదే కదా నేర్పంటే . . . నాలా కుండబద్దలు కొట్టినట్టు అభిప్రాయాలుచెప్పి అందరికీ శత్రువు లవుతారా?!

కె. ఎస్. ఆర్. గుంటూరు.

స్త్రీలకు సమానమైన హక్కులు యిస్తే దుర్వినియోగం చేస్తారు....

ఇన్నాళ్ళూ మీరు చేసినట్టేనా?!

ఎం. ఏ. పి. వరంగల్లు.

ఏమండీ, పిలువని పేరంటానికి వెళ్లితే ప్రతిష్ఠ హెచ్చుతుందా? తగ్గుతుందా?

దక్ష యజ్ఞం కథ వినలేదా? పిలువక తండ్రి ఇంటికి కూడా వెళ్లకూడదు!

బి. వి. ఎన్. బెంగుళూరు.

'లవ్‌యీజ్ గాడ్' దీని అర్థం ఏమిటి?

ప్రేమే దైవం! (నా ఇంగ్లీషు పరీక్షిస్తున్నారా?! కరక్టేనా?!!)

పి. వి. వి. ఆర్. హైదరాబాదు

ఆడదాని జీవితాన్ని అరిటిచెట్టుతో పోల్చుతా రెందుకు?

బహుశా ఆడది కూడా అరిటిచెట్టులాగే గెల వేశాక విలువ తగ్గిపోతుందేమో! ఉపయోగపే గాని విలువ అంత వుండదు కదా?

ఎ. పి. కూచిపూడి.

తల్లి తండ్రులంటే కూతుళ్లకే కొడుకుల కంటే ఎక్కువ ప్రేమ వుంటుందంటాను. మీరు ఏమ ఏమంటారు?

నిజమే. ఎంత దూరాన ఉన్న అయ్య చేతిలో పెట్టినా కష్టంలోనూ సుఖంలోనూ కూడా పుట్టింటిని తల్చుకుంటుంది ఆడపిల్ల.

కె. వి. ఎస్. ఎస్. చిత్తూరు.

ఆడదాన్ని ఆడది గౌరవించదు.

నిజమే ఆడదానికి ఆడది సహాయం కూడా చెయ్యదు సరికదా గొడ్డు గోతిలో పడితే మొదటి రాయి తనే విసురుతుంది. అది ఆమె జాతి బల హీనత. అనుమానంతో, అసూయతో, అసహనంతో తన కన్ను తనే పొడుచుకుందుకు సిద్ధపడుతుంది ఆడది!

జి. ఎన్. కె. విజయవాడ.


మగవాళ్ల కామెంట్స్ అధికం అయిపోతున్నాయి ఈ కామెంట్సు, అల్లర్లు తగ్గే రోజులు ఎప్పుడు వస్తాయి?

ఆడది భయపడ్డం మానేసినప్పుడు. నిజమే అందమైన కామెంట్స్ వినడానికి ఫరవాలేదు. కాని కొందరబ్బాయిలు — సభ్యత గిరి దాటి అసహ్యంగా వాగుతారని (ముఖ్యంగా ఆంధ్రలో) విన్నాను ఇక్కడా కుర్రాళ్లు అల్లరిచేస్తారు. మధ్యవయస్సు దాటిపోయినవాళ్లే అసహ్యంగా మాట్లాడుతారం టారు అమ్మాయిలు.

ఆర్ట్‌లవ్వర్ పగకాల.

భగవంతుడు ఆడవాళ్లపై ఎంత చిన్నచూపు చూశాడండి. పిల్లల్ని కనడం, పెంచడం. అన్నీ

ముందు నీ కలం పేరు మార్చు బాబు, ఆడదాన్ని ఇలా పిల్లలు కనే యంత్రంగా భగవంతుడు సృష్టించాడనుకొనే వాడు ఆర్ట్‌లవ్వర్ ఎలా అవుతాడు?! పిల్లల్ని కనడానికి, పెంచడానికి ఆడది బాధపడదు. అందుకు తప్ప యింకెందుకూ ఆడది పనికిరాదనుకుంటేనే— బాధపడేది.



"చల్లని తల్లి"లో ఒక సన్నివేశం

21-3-1975 శుక్రవారం మొదలు
27-3-1975 గురువారం వరకు

వారఫలం

—మహేష్—

మేషం :— మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్త్రీలకు-ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్యకళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

వృషభం :— మీ ఆలోచనలు ఫలిస్తాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. వారం ఆఖరులో సామాన్యమైన పనులకు కూడా యెంతో కృషి చేయవలసి వస్తుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాలలో పాల్గొంటారు.

మిధునం :— వృత్తిలో ఆదాయం బాగుంటుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. ఇతరులతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

కర్కాటకం:— మీ కార్యక్రమాల్లో శ్రమ కలుగుతుంది. వృత్తిలో చికాకులు ఏర్పడతాయి. వారం మధ్యలో అన్ని వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. మీ తాలూకు వస్తువులుపోయే ప్రమాదం ఉంది.

సింహం :— ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. వారంమధ్యలో ప్రయాసకు గురికాగలరు. మీ ప్రయత్నాలకు అటంకాలు వస్తాయి. వారం ఆఖరులో మీ కార్యక్రమాల్లో అనుకూలత లభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కన్య :— అన్ని వ్యవహారాల్లోను గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

తుల :— నూతన విషయాలను తెల్సుకొంటారు. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. నూతన వ్యవహారాలు బాగుంటాయి. ముమ్ముందు ఉపయోగించగల సంభాషణలను జరుపగలరు. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

వృశ్చికం :— మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. ప్రయాణాల్లో శ్రమకలుగుతుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలించగలవు. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమకలుగుతుంది, పోటీవారిలో గౌరవం లభిస్తుంది.

ధనుస్సు :— రావలసిన డబ్బు అందుతుంది. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వారం మధ్యలో ఆందోళనకు గురి కాగలరు. వృత్తిలో ఎవరినీ విశేషంగా నమ్మడం తగదు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. ప్రయాణాలోచనలు చేస్తారు.

మకరం :— వ్యాపారంలో పోటీవారిపోటీ పెరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు. ప్రయాణాలు ఫలిస్తాయి. ప్రయోజనంగల సంభాషణలను జరుపగలరు. వారం ఆఖరులో మీరు వెనుకకు తగ్గడమే మంచిదికాగలదు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు.

కుంభం :— మీ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. పోటీవారితో మాట పట్టింపులు తగవు.వృత్తిలో శ్రమమీద అనుకూలత లభిస్తుంది. వారం ఆఖరులో మీ ఆలోచనలు ఫలిస్తాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మీనం :— ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. నూతన వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వారం ఆఖరులో అనవసరమైన సందేహాలు కలుగుతాయి. స్త్రీలకు—దైవకార్యాలు నెరవేరతాయి. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఇంద్ర ధనస్సు

(16వ పేజీ తరువాయి)

ఉన్నాయి. కాని అన్నకి చెల్లెలిపట్లకాని, ఒక మిత్రుడికి మరో మిత్రుడిపట్ల కాని ఉండే భావానికి మించి మరేమీలేదు. మెల్లిగాజవాబు చెప్పాడు.

"నాకు కుసుమని చేసుకోవాలని ఉంది'

"కుసుమా?" ఈ సారి ఆశ్చర్యపోవటం కేశవరావుగారి వంతయింది.

"అవును మామయ్యా! ఎందుకో రత్నని భార్యగా ఊహించుకోలేక పోతున్నాను. నాకు కావలసింది కుసుమ. రత్నకి మరొక సంబంధం చూసి చేయవచ్చును. కుసుమ ఇష్టపడుతుందో లేదో ముందు తెలుసుకుంటే ..."

అప్పటికి ఆశ్చర్యంనించి కొంత తేరుకున్నారాయన. "వంశీ!" ఆనందం స్ఫుటమయింది ఆయన స్వరంలో. "కుసుమ జీవితంలో మళ్ళీ వసంతం వస్తుందనుకోలేదు నేను! ఒకసారి పెళ్ళయిన పిల్లని మరెవరు చేసుకుంటారని బాధపడ్డాను. ఈ వయస్సుకే విరాగిణిలాగా తయారయింది. ఇంతకుమించి నాకేం కావాలి ... నీ వన్నట్లే రత్నకి మరొక సంబంధం చూద్దాం."

"మీకు ఇష్టమే కనుక, ఇక కుసుమని అడగవలసిఉంది. మామయ్యా, తనని నేనే అడుగుదామనుకుంటున్నాను."

"అలాగే! నీవే అడుగు" ఒక నిమిషం ఆగి అన్నారాయన "కుసుమపట్ల జాలితో నీవు ఈ నిర్ణయానికి రాలేదు కదా?"

వంశీ నవ్వాడు "జాలి కలిగితే కేవలం జాలి చూపిస్తాను! సానుభూతి ప్రకటిస్తాను! అంతేకాని పెళ్ళి చేసుకోవా లనుకుంటానా మామయ్యా? నేను కుసుమని ప్రేమిస్తున్నాను ..." మనస్సులోని భావం మాట రూపంలో బయటికి రావటంతో ఎంతో తేలికగా, హాయిగా అనిపించింది అతనికి.

మర్నాడు చీకటితోనే లేచాడు వంశీమోహన్. చల్లని నీటితో స్నానం చేస్తుంటే శరీరానికి, మనసుకికూడా హాయి అనిపించింది. కుసుమని వెతుకుతూ తోటలోనికి నడిచాడు. పారిజాతం చెట్టుకింద పూవులు ఏరుతూ కనిపించింది. మబ్బురంగు చీర కట్టుకున్నది తలంటి పోసుకున్నదేమో, నిడుపాటి జుట్టుని జడ అల్లుకోకుండా వదిలేసింది. ఇంకా

> **చిట్కాలు**
>
> అమ్మాయిలూ మీజుట్టు లొంగటం లేదా అయితే ముందుకు వొంగి తల వొంచి జుట్టంతా మొహంమీద నుంచి క్రిందకి వ్రేలాడదీసి శుభ్రంగా ముందుకి ఓ యాభైసార్లు దువ్వండి ఆ తర్వాత వెనక్కి తల విసిరి మామూలుగా దువ్వుకోండి! అణిగి మణిగి వొత్తుగా వుంటుంది మీ కేశ సంపద!

ఇంద్ర ధనస్సు

సూర్యోదయం కాలేదు. అయినా తూర్పు దిక్కున ఆకాశం ఉషః కాంతులతో గులాబి రంగులో మెరిసిపోతున్నది. శరీరాన్ని చల్లగాలి స్పృశిస్తుంటే ఎంతో ఉల్లాసంగా ఉన్నది.

"కుసుమా!"

ఉలిక్కిపడి వెనుదిరిగి చూసింది కుసుమ. రోజూ చూసే వంశీ మోహన్ క్రొత్తగా కనిపించాడు ఈ ఉదయం. ముఖంలో ఎంతో సంతోషం! ఏమిటో విశేషం?

"కుసుమా! రాత్రి మామయ్యతో మాట్లాడాను. ఆయనకి ఏమీ అభ్యంతరం లేదన్నారు. పైగా ఎంతో ఆనందించారు!" ఉత్సాహంగా అన్నాడు.

దేనికి అభ్యంతరం లేనిది? ఏమిటి చెప్తున్నాడితను? జరగకూడనిది జరిగినట్లుగా మనసంతా వికలమయిపోయింది. అయోమయంగా చూసింది అతని వైపు.

"అలా చూస్తావెందుకు? నీవు కాదనవు కదూ? చెప్పు కుసుమా, నేనంటే ఇష్టమని చెప్పు!"

"ఏమిటీ మాటలు? నీవంటే నాకు ఎప్పుడూ ఇష్టమే, వంశీ. రత్నని, నిన్ను భార్యాభర్తలుగా చూడాలని నా కోరిక."

"కుసుమా, నీవు నా భార్యవి కావాలి" ఆమె మాటలు విననట్లే అన్నాడు.

నమ్మలేనట్లు చూసింది కుసుమ.

"నాకు యిదివరకే పెళ్లయింది తెలుసా?" మెల్లిగా అంది.

"తెలుసు! నీకు రాజారావుతో పెళ్లికి ముందు పరిచయం లేదనీ తెలుసు! పెళ్లయినరాత్రే అతనికి జరిగిన ప్రమాదం గురించీ తెలుసు! కుసుమా అమాయకంగా మాట్లాడకు. అతను నీ మనస్సులోని ఏ సున్నితపు పొరలనీ స్పృశించక ముందే, మీ యిద్దరి మధ్యా ఏ అనుబంధమూ పెరగక ముందే అతను పోయాడు ... నాకు నీవు కావాలి!"

"రత్న నీపైన ఆశలు పెట్టుకుంది. నీవు ఆమెని పెళ్లి చేసుకోవాలి."

"రత్న స్వభావమే అంత! నాలా స్నేహపాత్రురాలు. ఎవరన్నా అభిమానంగానే ఉంటుంది. నాపట్ల తను చూపుతున్న ఆప్యాయతని నీవు అపార్థం చేసుకుంటున్నావేమో!"

"లేదు వంశీ! రత్న స్వభావం నీకంటే నాకు బాగాతెలుసు. నిన్ను పెళ్లి చేసుకోవాలని దాని ఆరాటం ... మనిద్దరికీ పెళ్లి ఏమిటి-?" నవ్వుతూ తేల్చేసింది. "మీరిద్దరూ కలసి కలకాలం సుఖంగా ఉండాలి." పైకి తేలికగా నవ్వినా మనసులోని కలవరపాటుని కన్నులు చెప్పకనే చెప్తున్నాయి.

చేతిలోని పూల సజ్జవైపే చూపులు నిలిపి, శిరీష వృక్షాన్ని ఆనుకొని నిలబడ్డ ఆమెని చూస్తూ వుండిపోయాడతను. అనుకోని ఆమె ధోరణి అతన్ని తికమక పెడుతున్నది. ఆ అయోమయావస్థలోను స్పష్టంగా తెలుస్తున్న విషయం ఒక్కటే – 'ఈమెని నేను ప్రేమిస్తున్నాను...ఈమె లేకపోతే నా జీవితానికి అర్థంలేదు.'

"నేనంటే ఏమాత్రం ప్రేమ లేదా, కుసుమా?" మమతలు. అనుబంధాలు ఎంత బాధని ఇవ్వగలవో తెలుస్తున్నది.

ఆమె మాట్లాడలేదు.

"ఒక్కమాట చెప్పు, నేనంటే ప్రేమ లేదని! నిన్ను ఆట్టే విసిగించకుండా వెళ్లిపోతాను."

దుఃఖంతో మాట పెగలటంలేదు ఆమెకి. ఎలాగో కష్టపడి అన్నది – "కోరుకున్నది జరగకపోవటమనేది రత్న జీవితంలో ఎన్నడూ జరగలేదు. నీవంటే ప్రాణం పెడుతుంది. ఇటువంటి దెబ్బని తట్టుకోలేదు. తనని చేసుకొని సుఖపెట్టాలి నీవు."

"అది సాధ్యమేననుకుంటున్నావా? రత్నని చేసుకున్నా మనస్సు సదా నిన్నే వాంఛిస్తుంటే నేను కాని, తనుకాని సుఖపడగలమా?"

"వంశీ, ఇటువంటి మాటలు నీవు అనకూడదు. నేను వినకూడదు?"

"నాకు పిచ్చి ఎక్కేటట్లుంది కుసుమా! నన్నేం చేయమంటావు? అసాధ్యమయినది అడుగుతున్నావు"

'నీవన్నట్లే మనిద్దరం పెళ్లి చేసుకుంటే – రత్న ఆశలన్నీ పడగొట్టానే, ఆమె కోరినది నేను పొందానే అనే ఆలోచన నాలో ఎప్పుడూ నిలిచి, నాకు శాంతి లేకుండా చేస్తుంది. చెల్లెలి దుఃఖమనే పునాదిమీద నా సంసారపు మేడని నిలుపుకోగలనా? అది సాధ్యమేనా? వంశీ!"

[ఇంకావుంది]

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

యువభారతి "మరుపురాని మనీషి"

యువభారతి వారు ప్రచురించిన "మరపురాని మనీషి" 'తెలుగు నావెల్' అనే రెండు గ్రంథాలు ఆవిష్కరణోత్సవం ఫిబ్రవరి మొదటి వారంలో సరోజినీ దేవిహాలులో శ్రీ కోదాటి నారాయణరావు అధ్యక్షతన జరిగినప్పుడు ముఖ్యాతిథి అయిన విలాస యాత్ర, గ్రంథాలయ శాఖామాత్యులు డాక్టర్ దేవానందరావు చెప్పిన సలహాలు ఏ తెలుగువాడయినా పాటించవలసినవే "తెలుగువారు ఆంగ్లంలో మాట్లాడ్డం ఏదో గొప్పగా భావిస్తారు. అది సరికాదు మనభాష ఎలాటి భావవ్యక్తీకరణకైనా తగినంత పదజాలం గలిగినట్టిది. కనుక తెలుగుసాహిత్యాన్నిక్షుణ్ణంగా చదువాలి. ఆంగ్లేయుల పరిపాలన దాస్యం నుంచి మనం విడివడినా, భావదాస్యం నుంచి విడివడలేదు. చిన్నతనం నుంచే మనం పిల్లలకు మమ్మీ, డాడీ అనే పదాలు నేర్పుతున్నాము. అమ్మా నాన్న అనే మాటలు వదలి" అని ఆయన విచారం ప్రకటించారు. "మరపురాని మనీషి" పూర్వం ఆంధ్ర ప్రభ వారపత్రికలో ప్రచురించిన లేఖినీ చిత్రాల సంకలనం. దీనిని మహాకవి వానమామలై వరదాచార్యులు ఆవిష్కరించారు. దీని రచయిత తిరుమల రామచంద్ర దీనిని శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రికి అంకితమిస్తూ, రచనోద్దేశం వివరించారు. శ్రీ లక్ష్మణశాస్త్రి రచయితను సన్మానించి పద్యాలతో ప్రస్తుతించి "లేఖినీధనుడు" అని ప్రశంసించారు. డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యం లేఖినీ చిత్రాల విశిష్టత తెలిపారు. తెలుగు నావెల్—12 తెలుగు నవలల పరిచయం తెలిపే ఆంగ్ల గ్రంథం. దీనిని సికింద్రాబాద్ సాయంకళాశాల ప్రిన్సిపాల్ శ్రీ పి. ఎల్. ఎన్. శర్మ ఆవిష్కరించారు. డాక్టర్ అక్కిరాజు రమాపతిరావు, డాక్టర్ అడపా రామకృష్ణరావు, శ్రీ శివరామమూర్తి తెలుగు నవలా వికాసం గురించి ప్రసంగించారు. అధ్యక్షులు శ్రీ కోదాటి నారాయణరావు ఇలాటి పుస్తకాల అవసరాన్ని గురించి ప్రసంగిస్తూ, యువభారతి కృషిని మెచ్చుకున్నారు.

ఈలపాట రఘురామయ్య కాలధర్మం

ప్రముఖ రంగస్థల, చలనచిత్ర నటుడు, ఈలపాటతో ఈలపాట రఘురామయ్య అని ప్రసిద్ధి చెందిన శ్రీ కల్యాణం రఘురామయ్య ఫిబ్రవరి 24 న గుండెపోటుతో కాలధర్మం చెందడంతో రంగస్థల నటుల పాతతరం అంతమైందని చెప్పవచ్చు. 74 సంవత్సరాల రఘురామయ్య తన ఎనిమిదవ ఏటనే రంగస్థలం ప్రవేశించి 65 సంవత్సరాలపాటు వందకుపైగా నాటకాలలోను 100 చిత్రాలలోను నటించారు. 1928 లో శకుంతల పాత్రకు దుష్యంతుడైన రవీంద్రునితో 'నైటింగేల్ ఆఫ్ ఆంధ్ర' అని ప్రశంసలు పొందిన శ్రీ రఘురామయ్యకు, 1972 లో తూర్పు ఆసియా, ఆగ్నేయ ఆసియా, జపానులలో పర్యటించిన రఘురామయ్యకు, మొన్న రిపబ్లిక్ దినోత్సవాన "పద్మశ్రీ" బిరుదం లభించింది. నిరుడు ఆయనకు కేంద్ర సంగీత నాటక అకాడెమీ అవార్డు ఇచ్చింది. ఇటీవల రాష్ట్ర సంగీత నాటక అకాడెమీ అతనిని సభ్యత్వమిచ్చి గౌరవించింది. పాత నటులతరంలో మిగిలిన రఘురామయ్య అనుభవాలను అకాడెమీలు ఎంతగానో వినియోగించుకోవలసింది ఇంకా. కాని దురదృష్టవశాత్తు ఆయన కన్నుమూశారు.

నారాయణగూడ పాఠశాల వార్షికోత్సవం

ఎంతోకాలంగా జాతీయ భావాలను, ఆంధ్ర సంస్కృతిని పిల్లలకు నేర్పి, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్న, ఇక మూడేళ్లలో స్వర్ణోత్సవం జరుపుకొననున్న శ్రీ మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాల 46 వ వార్షికోత్సవం ఫిబ్రవరి 25 సాయంకాలం అతి వైభవంగా జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తలిదండ్రులు దాదాపు మూడు నాలుగు వేలమంది హాజరయ్యారు. అధ్యక్షత వహించిన విద్యాశాఖామంత్రి శ్రీ మండలి వేంకటకృష్ణరావు తమ ప్రసంగంలో స్త్రీ విద్యా సమస్యల పరిశీలన పరిష్కారంకోసం త్వరలో ఒక సంఘాన్ని ప్రభుత్వం నియమిస్తుందన్నారు. ప్రధానోపాధ్యాయిని శ్రీమతి కస్తూరీ ప్రసాద్ నివేదిక చదివిన తర్వాత శ్రీమతి మండలి ప్రభావతీ కృష్ణారావు బహుమతులు పంచిపెట్టారు. పిల్లల వినోద కార్యక్రమాలతో ఉత్సవం సమాప్తమైంది. ఈ కార్యక్రమంలో కిండర్ గార్డెన్ విద్యార్థినుల 'హిస్ట్ వాన్' గేయనాటిక నేనూ నాదేశం, పెద్దపిల్లల 'వాపస్' నాటిక ఆకర్షణీయంగా ఉన్నాయి.



ఫిబ్రవరి 2 న హైదరాబాదులో యువభారతి ఆధ్వర్యంలో జరిగిన సభలో శ్రీ తిరుమల రామచంద్ర గారి "మరపురాని మనీషి" గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న "అభినవ పోతన" శ్రీ వానమామలై వరదాచార్యులు.

అఫ్ఘన్ చిత్రకారుడు

సుప్రసిద్ధ అఫ్ఘన్ చిత్రకారుడు కాబూల్ విశ్వ విద్యాలయంలో తత్త్వశాస్త్రాచార్యుడు శ్రీ ఇనాయతులా షహ్రానీ ఫిబ్రవరి చివరివారంలో మద్రాసునుంచి హైదరాబాద్‌కు వచ్చి, సాలార్ జంగ్ మ్యూజియం మొదలైన వానిని చూచి, పలువురు ప్రముఖ చిత్రకారులను కలుసుకొన్నారు. లలితకళా అకాడెమీ కళాభవన్‌లో తన సన్మానార్థం జరిపిన విందులో ఆయన ముచ్చటిస్తూ, కళారంగంలో ఆఫ్ఘన్—భారత్ సంబంధాలను వివరించారు, షహ్రానీ అఫ్ఘన్‌కళపైన, భాషపైన, సాహిత్యంపైన దాదాపు 20 పుస్తకాలు వ్రాశారు. ఉజ్బెకిస్తాన్, ఈరానీ మొదలయిన చాలభాషలు వచ్చినవాడు. వయస్సు 32 సంవత్సరాలు. "నేను పాశ్చాత్యుల రీతులను అనుసరించాను. అఫ్ఘన్ జాతీయ రీతిని అనుసరించడానికి, వాస్తవికతను చిత్రించడానికి ప్రయత్నిస్తాను" అన్నారు. "ప్రకృతితో ప్రోత్సాహితమైన చిత్రాలు, ప్రజల భావాలు ప్రతిబింబించే చిత్రాలుఉత్తమమైనవని నా అభిప్రాయం" అని ఆయన తన సిద్ధాంతం చెప్పారు. ఆయన దాదాపు వెయ్యిచిత్రాలు గీచారు. వాటిలో కొన్ని అమ్ముడుపోయాయి. అమ్మకం తన దృష్టి కాదన్నారు. "ఆఫ్ఘనిస్తాన్‌లో కళాకారులు కేవలం కళతోనే జీవించగలుగుతున్నారా?" అని ప్రశ్నించగా ఫరవాలేదని సమాధానమిచ్చారు.

శ్రీ నీలం సంజీవరెడ్డి సూచన

మాజీ లోక్‌సభాపతి శ్రీ నీలం సంజీవరెడ్డి ఫిబ్రవరి 22 న పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో ప్రసంగిస్తూ, "నేను త్వరలో రాష్ట్రమంతటా పర్యటన జరిపి, ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి ఎంతవరకు తమ ఎన్నికల వాగ్దానాలను నిలబెట్టుకున్నారో పరిశీలిస్తాను" అన్నారు. కాని, తాము పార్లమెంటరీ కార్యకలాపాలలో దిగడంలేదని ఆయన స్పష్టపరిచారు. "వచ్చే నెలనుంచి జనం భావాలు గ్రహించడానికి ఆంధ్రప్రదేశ్‌తో దేశ పర్యటన ప్రారంభిస్తాను. శ్రీమతి ఇందిరాగాంధి దాదాపు 10 సంవత్సరాలుగా ప్రధానిగా వున్నారు. దేశపురోగతికి ఎవరో అడ్డుపడుతున్నారని చెప్పడానికి అవకాశంలేదు. అవినీతి, నిరుద్యోగం దేశమంతా వ్యాపిస్తున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి, పార్టీలతో ప్రమేయం లేకుండా, నీతి, నిజాయితీగల నూరుమంది జాతీయ ప్రముఖులను సంప్రదించి వారి అభిప్రాయాలను స్వీకరించడం ప్రధానికి చాల అవసరం" అని ఆయనఅన్నారు.

ఉపశ్రుతి :

"మంత్రుల జీతభత్యాలు పెంచడానికి ముఖ్యమంత్రి త్వరలో శాసనసభలో బిల్లు ప్రతిపాదిస్తారట, చూచారా ?" అన్నాను. "మరెలా ? ధరవరలు పెరిగాయి, శాసనసభ్యుల జీతాలు పెరిగాయి. మంత్రుల జీతాలు పెరగవద్దా ? మా జీతం పెంచమంటే కష్టం కాని!" అన్నాడు ఒక ఉపాధ్యాయుడు ●

మీకోసం మా విమాన సర్వీసులన్నీ తిరిగి ప్రారంభింపబడ్డాయి!

11




యూరోప్

యూరోప్‌కు వారానికి 11 సర్వీసులు

మా '747' విమానాలు మళ్ళీ లండన్‌కు వారానికి 8 సార్లు, ఫ్రాంక్‌ఫర్ట్‌కు 4 సార్లు, రోమ్, పారిస్‌లలో ఒక్కొక్క చోటుకూ 5 సార్లు, జెనీవాకు ఒకసారి పయనిస్తున్నాయి. అంతేకాదు, మా '707' విమానాలు మళ్ళీ వారానికి రెండు సార్లు మాస్కోకు ఒక్కొక్కసారి జెనీవా, లండన్‌లకు పయనిస్తున్నాయి.

7



న్యూయార్క్

న్యూయార్క్‌కు వారానికి 7 సర్వీసులు

మా '747' విమానాలు రోజుకు ఒకసారి, వారంలో ప్రతి రోజూ, మధ్య ప్రాచ్యదేశాలు మరియు యూరోప్ గుండా పయనిస్తున్నాయి. మా ఎక్స్‌కర్షన్ టికెట్టు ఖరీదుపైన మీరు పయనిస్తుంటే, రాకపోకలకు మీకు ఒకసారి వెళ్ళేందుకయ్యే ఖరీదు కన్న తక్కువే పడుతుంది.

18



మధ్యప్రాచ్యదేశాలు

మధ్యప్రాచ్య దేశాలకు వారానికి 18 సర్వీసులు

కువెయిట్, బీరూట్‌లలో ఒక్కొక్క చోటుకు 5 సర్వీసులు. దుబాయ్, బెహరెయిన్‌లలో ఒక్కొక్క చోటుకు 3 సర్వీసు అబూధాబి, ధహారాన్, షిహారాన్‌లలో ఒక్కొక్క చోటుకు 2 సర్వీసులు. అంతేగాక ఏడెన్, మస్కట్, దోహా, కైరోలలో ఒక్కొక్క చోటుకు వారానికి ఒక సర్వీస్ ఉన్నాయి.

అంతేగాకుండా, ప్రతివారం

తూర్పు ఆఫ్రికాకు
3 సర్వీసులు

దక్షిణ పూర్వ ఆశియాకు
10 సర్వీసులు

జపాన్‌కు
6 సర్వీసులు

మోరిషస్‌కు
2 సర్వీసులు


ఆస్ట్రేలియాకు
2 సర్వీసులు

ఎయిర్-ఇండియా

రామనాధంగారి కుటుంబం మధ్యతరగతి కుటుంబం. ఎదుగు పొదుగూ లేని గుమాస్తా జీవితం, వయస్సులో వున్నప్పటి సంపాదన, ఓపిక అన్నగారి సంతానంకే ఖర్చుపెట్టారు. రామనాధంగారి భార్య శాంతమ్మగారు శాంతమూర్తి. పేరుకు తగిన గుణవంతురాలు చిన్నతనంలో కాపరానికి వచ్చినా, భర్తతో సహకరించి సహనంతోను, మంచితనంతోను, అత్తమామల సేవకు, బావగారి సంతానానికి చాకిరీ చేసిన వుత్తమురాలు. యిక తమకు సంతానం ప్రాప్తి లేదని నిరుత్సాహంతో కాలం గడపసాగారు. "కట్టింది చీరెకాదు, కనంది కడుపు కాదు" అన్న సూక్తి రామనాధంగారి దంపతులపట్ల రుజువైంది. అన్న, వదిన, తల్లి, తండ్రి గతించినా బాధ్యతలు, బరువులు మోసి యింతవార్ని అంతవార్ని చేసారా దంపతులు. వారి మంచితనంకి భగవంతుడు మెచ్చి, వరమిచ్చాడా! అన్నట్లుగ రామనాధంగారికి చాలా కాలానికిగాను సంతానం కల్గింది. వారి ఆనందంకి అవధులు లేవు. ఏమైనాసరే తమ పిల్లలకు ఏలోటూ రాకూడదు అనే నిర్ణయానికివచ్చి, ప్రైవేట్లు చెప్పి, ట్రైవు నేర్పించి పిల్లలను అతి గారంగా చూడసాగారు. వారికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు కల్గాడు.

కలలు కన్న రాధ

సీతాలక్ష్మీరావ్



వారు సంతానం పొందటం ఒక నేరంగా భావించి, అన్నగారి సంతానం తొంగి అయినా చూడలేదు. ఆయన అందుకు బాధపడలేదు. తమ కర్తవ్యం నెరవేరిందని, వారు వాళ్ళ కాళ్ళపై నిలబడగల స్తోమతు వచ్చిందని తృప్తి పడ్డారు.

రామనాధంగారి సంతానం నల్గురు. శారద లక్ష్మి, రాధ, రవి.

శారద, లక్ష్మి గొంతెమ్మ కోర్కెలు కోరి మారాంచేసి అయినాసరే తీర్చుకునేవారు. రాధ, రవి యిచ్చిన దానితో తృప్తిపడి ఆనందించేవారు ఒక్క తల్లి పిల్లలలోనే యింత బేధంవుంటే పరాయివార్ని అని లాభం ఏమిటి? అని రామనాధంగారు బరువుగా నిట్టూర్చేవారు.

తల్లి శాంతమ్మగారికి ఓపిక రాను రాను నశించి పోయింది. తన పిల్లలకు చేసుకోవచ్చే వరికి యిలా అయిందేమా? అని చింత పడేది.

తండ్రి ఎలా సంపాదిస్తున్నాడు? తల్లి ఎలా పెట్టి సమర్ధిస్తుందన్న ఆలోచన వచ్చేది కాదు. శారదకి, లక్ష్మికి. కాల ప్రభావం అయితేనేం, పరిస్థితుల పరిణామం అయితేనేం మానవునిపై బ్రహ్మాస్త్రంలా అమోఘంగా పనిచేస్తుందన్న సత్యం, రామనాధంగారి పట్ల నిజమైంది ఆయనలో వయస్సు ముదురుతున్న కొలదీ, విసుగు, అసమర్ధత ఎదిగే పిల్లల ఆశలు, ఆశయాలు, తన మెదడులో మెదిలి అహో రాత్రులు సంపాదనకోసం ఆరాటపడేవారు. సంతానంవల్ల మున్ముందున తమకు సుఖం వున్నదో లేదో కాని, వారి ఆశలు తీర్చటం మాత్రం తమవల్ల కాదని, వయస్సు మీరిన తర్వాత సంతానంవల్ల కల్గిన పరిణామం అంతేనని రామనాధంగారి దంపతులకు బాగా తెల్సును.

* * *

పెరట్లో మల్లెపందిరి క్రింద, నులక మంచంపై కూర్చుని, ఆకాశంలో నక్షత్రాలు, మిలమిల మెరిసే వాటి మధ్య ఠీవిగా రాజకుమారుడిలా వెళ్ళే చంద్రుణ్ణి చూస్తూ కలల వాకిళ్ళో సోలిపోయేవారు అక్క చెల్లెళ్ళు.

"నేను అందమైన యువకుణ్ణి, ఐశ్వర్యవంతుణ్ణి నా కనుగుణంగా వుండే భర్తను చేపట్టి, ఆస్తి, అంతస్తులు వున్న గృహిణిలా మహారాణిలా వెళ్ళిపోతాను.

నా కోర్కెలు తీర్చేవాణ్ణి చేసుకుంటాను. కాని అమ్మలాగా బండ చాకిరీచేస్తూ—రోగిష్టి మారిదానిలా తయారవను, నాన్నగారిలా గాను గెద్దులా చాకిరీచేసి, వారిలా జీవితంతో

రాజీ పడను. నాతోనే జీవితం రాజీ పడేలా చేసుకుంటాను'' అనేది శారద సగర్వంగా. తండ్రి చెప్పించలేనన్నా కావాలని ఫట్టుపట్టి కాలేజీలో చేరింది తను. బాయిస్ అంతా, తను మాట్లాడితే చాలని, ఓరచూపు విసిరితే చాలని వెర్రెత్తించే తీరున అలంకరణ చేసుకొనేది. కొందరు, తోటి విద్యార్థినులు అనుకరించేవారు. మరి కొంతమంది బుద్ధి మంతులు కిసుక్కున చాటుగ నవ్వుకునేవారు, ఇళ్లల్లోనుండి తొంగి చూసి, ''ఇదేం పోయే కాలం తల్లీ, చూసావా వదినా, ఆ పోయే అమ్మాయి నడక, కట్టు, బొట్టు, తీరూ హవ్వ, కలికాలం పాడు బుద్ధులూను. మన కాలంలో యిలా వుండేవాళ్లా? ఎందుకు వచ్చిన చదువులు, అందం, అంగసౌష్టవం, బజార్లో మిఠాయిలా ప్రదర్శించే తీరు. ఛీ... ఆడవాళ్లకే తలవంపులు, అన్న మాటలు చెవికి శోకినా, లెఖ్ఖచేసేది కాదు శారద.

ఆ పుణ్య దంపతుల కడుపున చెడ బుట్టారు వీళ్లు అనే మాటలు, గాలికి వదిలేసేది శారద. అక్కబాట తనకు పూల బాటగా ఎంచి అనుసరించేది లక్ష్మి.

''నీవైతే అందమైనదానివక్కా, నీ అంత అందం నాకు లేదు. ధైర్యంకూడా అంతంత మాత్రమేలే. ఆఫీసర్ భార్యనై భర్త, పిల్లలతో హాయిగా వుండాలని, అంతస్తు అనుభవించాలనే వుంది. కాని అక్కా నాన్నగారు మన ఆశలు తీర్చి, ఆశయాలు నెరవేర్చగలరంటావా?'' అంది లక్ష్మి సందేహాత్మకంగా.

''తీర్చకపోతేతీర్చుకోవాలి! కానివాజమ్మల్లా చేతులు ముడ్చుకుని కూర్చుంటామా? స్త్రీకి ఎంత గౌరవం, ఎన్ని సమాన హక్కులు, మనతో రాజీపడి భర్త అనుగుణంగా నడుచుకోకపోతే కోర్టు వుంది. వుద్యోగం వూడపోతుంది. ఆస్తిలో వాటా వస్తుంది. మన అంతస్తుకి ఏ లోటూ వుండదు పోయేది మగవాడి పరువే? ఇందిరాగాంధీ చూడు దేశాన్ని ఎంత చక్కగా ఏలి జయిస్తున్నదో, స్త్రీ కట్టుబాట్లు, నాల్గు గోడలమధ్య మగ్గి కూపస్థ మండూకంగా మెదల నక్కర్లేదు. స్త్రీకి అన్ని రంగాలలోను ప్రథమ స్థానం అని మరువకు చెల్లీ'' అని హాస్యంగా వెలిబుచ్చింది శారద. ''కోర్కెలు తీరనినాడు మన జీవితాలు నిరర్థకమై, నిస్సారమై జీవితం వ్యర్థమనిపిస్తుంది. అంతకన్న మరణం నయం అనిపిస్తుంది కదక్కా,'' అంది లక్ష్మి. స్త్రీకి పిరికితనం వుండబట్టే ఆనాడు అబల అన్నారు. ఈనాడు స్త్రీ సబల అని నిరూపించుకుంటోంది. మరణించాలనుకొనేవారు ఆనాడు. ఎదిరించి, జయించాలనుకుంటున్నారు యీనాడు. అన్నది శారద. లక్ష్మికి కొండంత ధైర్యం వచ్చేసింది. అక్క అన్నమాట ప్రతిదీ అక్షర సత్యం అనుకునేది.

రాధకి వారి అభిప్రాయాలు తెలియక పోయినా కొన్ని కొన్ని మనస్సుకి హత్తుకుపోయి బాగా గుర్తు వుండేవి. అక్కలకి పొట్టిఅయి పనికిరాక పడవేసిన బట్టలు కట్టుకునేది. వారు తినగా మిగిలింది తల్లితోపాటు, తను, రవీ పంచుకుని తిని తృప్తిపడేవారు.


తల్లికి ఆనందంతో కళ్లు చెమ్మగిల్లేవి. చిన్నవారైనా భగవంతుడు మంచి మనస్సు, అర్థం చేసుకోగల బుద్ధి యిచ్చినందుకు. తృప్తిపడేది ఆమె. ఎప్పుడైనా పనిచేసుకోలేకపోతే ''నేను చేస్తాలేమ్మా, అని తన చిన్నారి చేతులతో సాయపడే, రాధ, రవి అంటే శాంతమ్మగారి దంపతులుకి అత్యంత ప్రేమాభిమానాలుండేవి.

రాధ అందానికి మారుపేరు. చక్కటి అంగ సౌష్టవం, బంగారు చాయ మేను, సంపెంగ మొగ్గలాంటి నాశిక, చిన్న లక్క పిడతలాంటి నోరు, చిన్న గడ్డం కొనతేలి అందంగా వుంటుంది. చంద్రబింబంలాంటి మోము, పాలవిగాగడలాంటి చెక్కిళ్లు నిడుపాటి విగ్రహం సోగ కన్నులు, బారైన జడ. యీఅందాల రాశికోసం ఆ మాధవుడు విందు దాగివున్నాడో – అని హాస్యం పట్టించేవారు తోటి స్నేహితురాళ్ళు.

''శాంతమ్మకు తగిన కూతురు అన్పించుకుంది. నడకలోవినయం,మాటల్లో మాధుర్యం, చేష్టలలో అందం. అందానికి నిర్వచనంరాధ. వెర్రిఫేషన్లు చేయకపోయిన అందాల రాణిలా మెరిసిపోతుంది. అనే పెద్దల వాక్కులు, (చుట్టుపట్ల వారు) రాధ చెవులకు సోకినా తనపని తనదే అన్నట్లు స్కూలు, యిల్లుతప్ప మరో ధ్యాసలేదు.

శారద, ప్రసాద్‌ను ప్రేమించింది. ఆతడు శారదకోర్కెలకు అనుగుణంగా తగిపోయాడు. ఆమె విధించిన ఆంక్షలకు కట్టుబడి, అందానికి దాసుడైనాడు. ప్రసాద్ తల్లి–దండ్రులు ప్రేమ–వివాహాలకు ప్రాముఖ్యత నివ్వరు. అలా అని వారికోర్కెలను నిరసించరు. తమ అంతస్థుకు లోపంరాకుండా కట్న కానుకలతో వివాహం జరగాలని ఆశించారు. పెళ్లిచూపులు తతంగం లాంఛనాలు – వగైరా యథావిధిగా జరిపించారు. పెళ్లి ఘనంగా జరగాలని ఏ లోపం రాకూడదని నిష్కర్షగా చెప్పారు. రామనాథంగారు మారు మాట్లాడకుండా అనుకున్న విధంగా వివాహం జరిపించారు. శారద అత్తవారింటికి వెళ్లిపోయింది.

అక్కకన్న నేను తీసిపోయానా అని లక్ష్మి



కలలుకన్న రాధ

రమేష్ అనే యువకుణ్ణి ప్రేమించింది. అతడు డబ్బు, పోదాగలవాడు. అతడి తల్లి-దండ్రులు, కట్నం వద్దుకాని, పెళ్లి ఘనంగా జరగాలి అన్నారు. వారికి అనుగుణంగా మసలుకుని, ఆ వివాహంకూడా అయిందన్పించారు. రామనాథంగారి దంపతులు.

చివరకు యిల్లు, పొలంపోయి, వారి వారి ఆడంబరాలకి చితికిపోయిన ఆ దంపతులు నోరులేని పసివారికి అన్యాయం జరుగుతుందని కుమిలిపోయారు. తమ యింట్లోనే అద్దె కట్టుకుంటూ చాలీచాలని సంపాదన, ఎదగవలసిన పిల్లలు, పీడించే అనారోగ్యంతో సతమతమైపోయారు. రామనాథంగారి దంపతులు.

పరిస్థితులను అర్థంచేసుకున్న రాధ, రవితో పాటు మరికొందరి పిల్లలను చేర్చి, తండ్రి చెప్పే ప్రైవేట్లు తాను చెప్తూ, తండ్రి, చెప్పే టైపు పాఠాలు తాను నేర్పుతూ, బట్టలుకుట్టి, తల్లికి చేదోడు, వాదోడుగ తల్లి–తండ్రులను ఆదుకుందుకుగాను ఇంటర్‌తో ఆపేసింది రాధ.

అర్థం చేసుకున్న రాధ గొప్పమనస్సుకు ఆనందించి దీవించారు ఆ దంపతులు.

కొడుకుని ఏకొట్లోనో గుమాస్తాగా చేర్పించాలని ఆశించారు. మగపిల్లవాడు. పెద్దతనంలో మిమ్మల్ని ఆదుకోవల్సినవాడు. తమ్ముడి చదువు ఆపవద్దని బ్రతిమిలాడి కాలేజీలో చేర్పించింది. రాధ తల్లి–దండ్రులు చిన్నవారి స్థితికి అనుక్షణం బాధపడని రోజు లేదు. వీరైనా మంచి మనస్సుతో లేకపోతే యిక తమగతి ఏమవునో? అని, బాధపడి, పరిస్థితులతో రాజీపడి, తృప్తిపడేది. తల్లి శాంతమ్మగారు.

రాధ అక్కలలాగా గొప్పకలలు కనలేదు. కాని కనీసపు కోర్కెలను కలలుగా కనేది రాధ తనను అర్థంచేసుకొనే భర్త, ముత్యాలవంటి, ఆరోగ్యమైన ముగ్గురు బిడ్డలు, అక్కలకు తీసిపోకుండా తల్లి–తండ్రులకు బాధ కల్గకుండా కలిగేస్థితి కోరేది. అక్కలకన్న తక్కువస్థితి ఏర్పడితే తనను కన్నెత్తి, చూడటానికి, పెదవి విప్పి పలకటానికి సాహసించరు. అందుకే అలా తను వుండాలని కోరుకుంది రాధ. కాదు కలలు కన్నది. ఎప్పుడైనా పుట్టింటికి వస్తే, శారద, లక్ష్మిలు "మా పిల్లలకు ఈ పాడు నులక మంచాలలో నిద్రపట్టదని, ఫాన్ లేకుండా పడుకోరని, పాడుకొంప అంటే అసహ్యమనీ, గాజుప్లేట్లకన్న వెండి పళ్లెలలో డైనింగ్ టేబుల్ పైనే వాళ్లకు అలవాటని, నిరసించేవారు. తల్లి పెట్టినచీరె కట్టుకుంటే తమ అంతస్తుకి లోపం అని పనివాళ్లకు పారవేసేవారు. యింటాబయటా ఖరీదుగల చీరెలలో గడిపే అక్కలంటేనేరాధకుఅసహ్యం. యిన్నాళ్లూ ఏ యింట్లో పెరిగారు ఏ పెట్టుతో పెరిగారు, ఎవరిప్రేమానురాగాలతో జీవించారు అన్నది గుర్తులేకుండావున్న అక్కల అహంకారానికి అసహ్యించుకునేది రాధ. "మంచి చీరె కట్టాలని, మంచి యింటిలో బ్రతకాలని భర్తతో కనీస సుఖాలు అనుభవించి పంచుకోవాలని, పిల్లలతో ఆ యిల్లు కళ కళలాడాలని, మెట్టినచోట, ఆదరణ పొందాలని కలలుకనేది రాధ. తను ఎవ్వర్నీ ప్రేమించదు. అసలు ప్రేమ అంటేనే తెలియదు. దానికి అర్థంలేదు. అనుకునేది రాధ. తల్లిదండ్రుల తృప్తి తనకు శ్రీరామరక్ష అనే భావించేది రాధ.

ఒకనాడు తండ్రి రామనాథంగారు రాధను పిల్చి ఇలా అన్నారు.

"అమ్మా రాధా, చిన్ననాటినుండి నీ మనస్సు అమృతం. నన్ను అపార్థం చేసుకోవనే భావిస్తాను. నా పరిస్థితులు నీకు తెలియనివి కావు. నాదంటూ యింక ఏమీ మిగల్లేదు. నేనా రిటైరైపోయాను. వచ్చే పింఛన్, మన యింటిఖర్చుకే సరిపోతోంది." అంటూ సాలోచనగా రాధ మొహంలోకి చూసారు. తండ్రి ఏమి చెప్తున్నదీ రాధకి బోధపడలేదు. కాని ఏదో జటిల సమస్య తండ్రిని బాధిస్తున్నదన్న సంగతి రాధకు తెల్సు. అందుకనే సంశయించకుండా "నాన్నగారూ మీ మాట నేనెప్పుడూ కాదన్ను. మీ యిష్టం. మీరు నిస్సందేహంగా మీ అభిప్రాయం చెప్పండి" అంది.

రామనాథంగారి మనస్సు ఆనందంతో పొంగిపోయింది. "నీ సంగతి నాకు తెల్సు తల్లీ. అందుకే యీ మాటను చెప్పటానికి నాకు నోరాడటంలేదు." అన్నారు కన్నీరు ఉత్తరీయంతో అద్దుకుంటూ.

రాధ తండ్రి వదనంలోకి ప్రశ్నార్థకంగా చూసింది. రామనాథంగారు. శాంతమ్మను పిల్చి విషయము విశదపర్చారు. రెండో పెళ్ళి. ఆయన బాగా ఆస్థిపర్లు. అయితే తొలిభార్య సంతానం వుంది, వారు పెద్దవారైనా,

సామాన్యుని సణుగుడు

"అన్ని గేదెల పాలు తెల్లన్న కాని వాటిలో కలిసే తీర్తాయి నీళ్లన్నా" అన్న పాట పాడుకుంటూ సైకిల్ పాల కుర్రాడు వెళ్లిపోతాడనుకుందాం ... పాలలో నీళ్లు కలుస్తాయన్న శుద్ధ నిజం అతగాడు వెల్లడి చేస్తున్నాడనీ ప్రశంసించుదాం ... అతనవి తీసుకుపోయి కాఫీ హోటళ్ల వారికి పోస్తాడనీ భావిద్దాం ... పాల కుర్రాడు పాలలో నీళ్లు కలపడం మీద యింత రాగాలు దీయడమెందుకూ అంటారా ? పాలకుర్రాళ్లు యిప్పుడు పాలు "యింటిగ్రేటెడ్ మిల్కు ప్రాజెక్టు వాళ్లకే పోస్తారు. గేదెలు, మేకలు, గొర్రెలు, ఆవులు (?) వీటి పాలన్నీ తెల్లగా వుంటాయి. వాటిని కలిపితే కలుస్తాయి. పాలలో పాలు కలిపి, వాటిని చల్లబరచి సీసాలకెక్కించే ముందు వెన్న తీసేసి ఆ సీసాలన్నింటినీ లారీల్లో కెక్కించి "మిల్క్ బూత్"లు (పాల కేంద్రాలా ? చౌకీలా ? ఏమో పాల కార్డు మీద యింగ్లీష్‌లోనే వుంటుంది ప్రభుత్వం వారి నిశానీ అంతా) అంతేనా అంటారు వాటిని... వాటికి తెచ్చేస్తారు ! తెల్లారగట్ల 4 గంటలకి పాలసీసాలు తీసుకుని ప్రాజెక్టు వారి వెన్నతీసిన పాలు "నీళ్లు"వేసి వస్తాయని అనుకుంటారు. మరి అక్కడ మనక చీకట్లో, బోలెడుమంది పాల అమ్మాయిలు [కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అలాగే అంటారు. వైజాగ్‌లో ఏమంటారో ?] వాటిని "కేసు"ల్తోటి తీసుకుంటారు.

ప్రాజెక్టు వారి 'సీలు' సీలులాగే వుంటుంది మరి... యిళ్లకి వచ్చేసరికి సీసాలు కొన్నింటికి "వెల్తి" వుంటుంది. కొన్ని సీసాల్లో నీర క్షీర న్యాయాన్ని రుజూచేస్తూ "నీరం" కూడా చేరివుంటుంది... ఏమని అడిగితే "మాకు తెలీదు 'మిల్క్ బూతా సామీ' [ఈ సమాసం తెనుగు నుడి కారానికే వ్యావహారిక సొంపు కదూ !] అట్లాగే యిచ్చాడంటుంది" "పాలమ్మి"–నీళ్లుండగానే నీళ్లు ఎలా కలుస్తాయి... ప్రాజెక్టు వాళ్లకే తెలియాలి ఆ సంగతి అంటాడు ... "మిల్క్ బూత్" ఆసామీ – యిందులో కొందరు ప్రవేటు "మిల్క్" ఆసాములు. మరికొందరు ప్రాజెక్టు వారి వుద్యోగులు. పాలు తెచ్చే 'క్షీరకాంత'లు మేం కలప లేదంటారు... క్షీర పంపిణీ కేంద్ర యజమానులు "అమ్మమ్మ ! మాకావైనం తెలియదంటారు. లారీలో వస్తున్నప్పుడు మనదేశపు రోడ్ల గతుకులు చూశారుగా వాటి మూలంగా కదిలి కదిలి పాలు తరిగాయో ? లేక ఒక్కోసారి పల్చనిపాలే యంత్రాలు సీసాల కెక్కించాయో అంటారు, క్షీరవాహకులు – ప్రాజెక్టు వారేమో – సామాన్యుల మొర లాలకించే స్థాయిలో వుండరు ... పెళ్లిళ్ల కాలంలో సీసాలు తొందరగ వెళ్తే కాని దొరకవు... శతదినోత్సవాల కాలంలో ... తిరణాల రోజుల్లో అన్నింటిని మించి వేసం కాలంలో పాలు దొరకవు... వున్నవన్నీ ప్రాజెక్టు వాళ్లే తీసుకుని సీసాల్లోపోసి ముందు డబ్బులు గుంజి ఆనక పోయటం మొదలెట్టారే, యింటికితెచ్చి ఏరువు పోయమంటే ఏ పాల వాళ్లు నీళ్లులేకుండా పోస్తారు ? పోయరు. మనం పోయి క్యూలో నుంచొని కార్డు చూపించి తెచ్చుకోవాలీ అంటే అందరూ "పాలమనుషులు" 'కేసు'లు 'కేసు'లు తీసేసు కుంటూ వుంటే మొదట ఆ 'ఖాతా'లేగాని మన మాట ఎవరు వింటారు ? పైగా "ఏందయ్యా? రూపాయి డబ్బులికి కక్కుర్తి ? మేవుః యింటికాడకి తెచ్చిస్తున్నావుఁగదా ! హాయిగా తీసుకోక ఎందుకీ ఏగబడ్డం" అని ఎవరైనా ఓ వయసులోవున్న పాలసీసాలు యింటింటికి తెచ్చియిచ్చే అమ్మడు అనేసిందో, చీకట్లో మనమొహం మరింత చీకటైపోయే ప్రమాదమూవుంది. అందుకే పాలల్లోకి సీలువేసిన సీసాల్లోకి నీళ్లు ఎలా వెళ్తాయి ? అన్న జిజ్ఞాస. నీళ్లు వేసిన సీసాలలోని పాలు బయటికి ఎలా వస్తాయి అన్న మీమాంస – కర్మ సిద్ధాంతానికి వదిలేసి భారతదేశం సత్యహరిశ్చంద్రుడు పుట్టిన దేశం. యిక్కడ ప్రజాస్వామ్యం గలదూ అనుకుంటూ వూరు కోవడంకన్నా ఏంచేస్తాం ... ? ఎప్పుడైన పేపర్లో పాలలో నీళ్లు కలిపిన నేరానికి గేదెల అప్పలరాజుకి వెయ్యిరూపాయాలు జుల్మానా విధింపు అని చదివి మనం అమ్మో అమ్మో అని గుండె బాదుకోవాలి ... తప్ప ప్రాజెక్టు పాలల్లో నీళ్ల మిస్టరీ ... మళ్లీ మొదటికే వచ్చానా ... సారీ...!

యిల్లాలులేని యిల్లు స్మశానంతోనే సమానం. దీపం పెట్టే యిల్లాలు కావాలని వారికోర్కె. నల్గురు సంతానం, అందరికీ వివాహాలు అయినయ్యి. ఇద్దరు ఆడపిల్లలు, యిద్దరు మగపిల్లలు వారికి సంతానం. అదమ్మా పరిస్థితి. నీవు అంగీకరిస్తే, వారు నిన్ను చేసుకుందుకు సిద్ధంగా వున్నారు అన్నారు రామనాధంగారు నీళ్ళు నములుతూ, నాన్న.

నాన్నగారూ ఆడపిల్ల ఎంత ఆదుకున్నా తల్లి–దండ్రులకి బరువే. రవి బి.ఎ. ఫైనల్ లోకి వచ్చాడు. యింక మీగూర్చి నాకు దిగులు లేదు. నాకా మీరు పెద్ద కట్నం యిచ్చి చేయలేరు. అలా అని మిమ్మల్ని కించ పర్చలేదు. మీరు ఏమి చేసినా నా మంచికే చేస్తారు. అందువల్ల మీ మాట నిలబెట్టు కోమని నేను కోరుతున్నాను, అంది. రాధ,

తండ్రి ఆనందంతో రాధని గుండెలకి హత్తుకుని యింత చిన్న వయస్సులో ఎంత జ్ఞానం వుంది తల్లీ. ఈ అసమర్థుడైన తండ్రిని మన్నించు తల్లీ, అన్నారు.

"అలా అనుకోకండి నాన్నగారూ" అంది రాధ.

'అక్కా ఈ మాట నిజమా? నీవు పరమేశ్వరంగార్ని చేసుకుందుకు ఒప్పుకున్నావా ?" అన్నాడు.

_ "అవునురా !" అంది రాధ నిర్లిప్తంగా బాధగా "అక్కా,అక్కా, అలా అనటానికి నీకు నోరు ఎలా వచ్చింది:.ఆశలు, ఆశయాలు తీరతయ్యనా, కొనుగోలు దాసి అవుతావా ? అక్కా" అన్నాడు.

"లేదురా మానవత్వంవున్న మనిషిగా నా కర్తవ్యం నెరవేర్చుకుంటున్నాను" రాధ.

"కాదక్కా డబ్బు కోసం, చేసుకుంటు న్నావు !" రవి.

"హుః తమ్ముడూ నీవు యిన్నాళ్లూ నన్ను అర్థంచేసుకున్నది యిదేనా, డబ్బు. మనిషిని సంపాదించదురా మనిషి డబ్బును సంపాదిస్తాడు అన్నది నగ్నసత్యం తమ్ముడూ, నీవు ఎప్పుడో సంపాదించి అటు తల్లిదండ్రు

లను పోషిస్తూ, యిటు నా పెళ్లికోసం; మిగిల్చి ఆదుకుంటావా? చివరకు అవి కలలు కేవలం పగటి కలలుగానే మిగిలిపోతయ్యిరా, ఈ పెద్ద వయస్సులో వార్ని తృప్తి పరచ టమే నా విధి అంది రాధ.

కలలుకన్న రాధ

"అక్కా చిన్నప్పుడు నీవన్న మాటలు గుర్తుకు వున్నయ్యా?" నన్ను అర్థం చేసు కొనే భర్త కనీసపు కోర్కెలు తీర్చగల్గితే చాలు, ముత్యాలవంటి బిడ్డలు ముగ్గురు చాలు. ముచ్చటైన సంసారం కావాలని కలలు కనలేదు. అక్కలు తీర్చుకున్నారు. మనం అర్థంచేసుకుని మెలిగేం కాబట్టే, మనకి భగవంతుడు యిలా అన్యాయం చేసాడు."

అన్నాడు రవి గాద్గదిక స్వరంతో పిడికిలి బిగించి.

'తప్పు మన విధి తమ్ముడూ' అంది రాధ.

* * *

రాధ వివాహం అయి అత్తవారింటికి వెళ్లింది. సవతి తల్లి అంటే నిరసన చూపే సంతానం "యింతవయస్సు వచ్చి యిప్పుడు పెళ్లాం కావల్సి వచ్చింది" అన్న పెద్దకూతురు నిరజమాటలు వంటరానిదానివి ఎందుకు వచ్చినట్లు యిక్కడ, తైతక్కలాడటానికా అనే కోడళ్లు.

పెత్తనం చెలాయించటానికి వచ్చింది. అందుకే మురిసిపోతో ముసరి మొగుణ్ణి కట్టుకుంది. సుఖంకాదు కావల్సింది. ఆస్థి పెత్తనం అన్నకొడుకుల మాటలు, రాధకి తలతిరిగి నట్లైపోయేది. అయినా అన్నీ భరించి సహనంతో, ఓరిమితో కాలం గడపసాగేది. ఎప్పుడైనా పుట్టింటికి వస్తే "అమ్మా వారా పెద్దవారు. నే లేకపోతే వేళకు అమరదు, పిల్లలా క్రూరతనం, నేను లేకపోతే క్షణం గడవదు, ఎప్పుడన్నా మీరే వచ్చి చూసి పొండమ్మా" అనేది రాధ.

రాధ ఆప్యాయత అనురాగం, సంసారం దిద్దుకునే తీరు తల్లి-దండ్రులకు తృప్తి నిచ్చేది. భర్తతో చెప్పి, తమ మిల్లులో నే మేనేజరుగా వుద్యోగం వేయించింది రాధ తమ్ముడు రవికి. భర్తకు అనుమానం రోగం వున్నా, భార్యను ఏమీ అనేవాడుకాదు. భర్త కోర్కెపై సవతినగలు, చీరెలు ధరిస్తే ఆరాలు తీసి ఆరడి చేసేవారు పిల్లలు. రాధ కలలు కల్లలైపోయినయ్యని ప్రత్యక్షంగానరకం అనుభవిస్తుందని రవి మనస్సు రంపపు కోత అనుభవించేది.

రాధ కలలు అలా కరిగిపోయినయ్యి అయినా కసాయివాళ్ల గుండెలు కరిగించి మార్చి మానవత్వం గల మనుష్యులుగా తన మంచితనంతోను, ఓర్మితోను మార్చి నెగ్గింది రాధ.

ఎక్కడో దూరాన్నుండి గాలిలో తేలిపోతూ విన్పించిందిపాట "కలలుకన్న రాధా" అంటూ రామనాథంగారు, శాంతమ్మగారు ఒకరి మొఖాలు ఒకరు చూసుకుని బరువుగా నిట్టూర్చారు.

రవి అక్కమంచి మనస్సుకు జోహార్లు అర్పించాడు.

రాధ తను అనారోగ్యురాలైనా, బాధపడ లేదు కానీ తననుంచి భర్త దాచిన రహస్యం ముల్లులా ఎదలో బాధ కల్గించింది. తనకు చాలా ఆలస్యంగా తెల్సింది అసలు విషయం. తన భర్త ఆపరేషన్ చేయించుకున్నాడని. తను యిక సంతానవతి కాలేదు. కాబోదు. మాతృత్వంకి తాను నోచుకోలేదు. అయినా రాధ కించపడలేదు. సవతి సంతానమే తన సంతానంగా భావించి మాతృత్వం పంచి యిచ్చిన రాధను యిన్నాళ్లకు అమ్మగా గుర్తించిన సంతానాన్ని చూసి సగర్వంగా నా బిడ్డలు అని చెప్పుకుంది రాధ. బిడ్డలు క్షమాపణ చెప్పుకుంటే ఆ తల్లి హృదయం ఎంత ఆనందం పొందుతుందో తన పిల్లలు "అమ్మా మమ్మల్ని క్షమించు" అనగానే అంత ఆనందం పొందింది రాధ.

గతం నెమరు వేసుకుంటున్న రాధకు భర్త పిలుపు ఈ లోకంలోకి తెచ్చిది. ఆనందంతో రాధ వదనం పున్నమి చంద్రునిలా వెల్గిపోతోంది. కలలుకన్న రాధకు ఈవిధంగా ఫలించాయి తన కలలు —

సరికొత్త పాతకథ

చందు సోంబాబు



రూపాదేవి నాకు మామయ్యకూతురు.

అంతకంటే ఓవిధంగా తనకి నేను బావనైనందుకు గర్వపడాలి.

రూప అందంగా వుంటుంది. నాకు సాధారణంగా సన్నగా వుండే అమ్మాయిలంటే ఇష్టం. రూప సన్నగా తీగలా వుంటుంది. అందుకే నా ప్రాణాలన్నీ రూపమీద పెట్టేసుకున్నాను.

రూపకి నాపైన ఎలాంటి అభిప్రాయం వుందో నాకు తెలీదు. కానీ నేనంటే చాలా ఇష్టం. అనిమాత్రం తన మాటలు ద్వారానే తెలుసుకొన్నాను.

నేను జూనియర్ లాయర్ని. ఈమధ్యనె కొత్తగా ప్రాక్టీసుపెట్టాను.

నల్లకోటు వేసుకొని, గౌను మోసుకొని పోతుంటే సుల్తాన్‌బజార్ దగ్గర కనబడింది రూప.

నన్ను చూస్తూనే విరగబడి నవ్వింది.

"హాయ్ షోకు బావా!" అంటూనూ.

"ఎందుకా నవ్వు?" అడిగేను.

"ఎందుకా? అచ్చు దొంగలా వున్నావు. కావాలంటే అద్దంలో ఓసారి చూసుకో" అంటూ తన బ్యాగ్‌లోవున్న మినీ మిర్రర్ని తీసి ఇవ్వబోయింది.

నడిరోడ్డయిపోయింది కానీ లేకపోతే రూప రెండు చెవులూ మెలిపెట్టేవాడిని.

"ఇంతకీ నీ ఊరేగింపెక్కడికి?" అడిగాను.

"కాలేజీకి" అంది.

"కాలేజీ నారాయణ గూడా అయితే సుల్తాన్ బజారెందుకొచ్చావ్? నాకు తెలుసు ఏ మార్నింగ్ షోకో చెక్కేస్తున్నావ్. అవునా?" అన్నాను.

"నువ్వొత్త కుళ్లుమోతబ్బాయ్‌వి బాబు! అయినా నేనెక్కడికెళితే నీకెందుకు?" కళ్లెగరేస్తూ అంది.

"చూడమ్మాయ్. ఈవూళ్లో నీకు వరసైనవాడ్ని నేనొక్కడ్నే వున్నాను. నువ్వు కాసేపు 'మిస్' అయితే నేనెక్కడికో తీసుకుపోయానని మామయ్య అంటాడు."

రూప గడుసుగా నవ్విందప్పుడు.

"కొండముచ్చుతో వాళ్లమ్మాయి ఎక్కడికీ వెళ్లదని నాన్నకి తెలుసులే" అంది.

"రోడ్డుమీదెంతసేపుగానీ పద తాజ్‌కెళ్లి కాఫీ తాగుదాం" అన్నాను.

రూప నా పక్కగా నడుస్తూ అంది.

"నీ వేషాలన్నీ నాకు తెలుసు"

ఏంతవరకు తెలుసేమిటి?"

"చేసుకున్న షోకు వుమెన్స్ కాలేజీ అమ్మాయిలకి చూపించడానికి, సుల్తాన్ బజార్లో షికార్లు కొడుతున్నావ్. అలా ఏ తెలిసిన అమ్మాయన్నా కనబడితే ఇలా కాఫీలకి పిలవడం. అంతేనా! నీ పని"

"నీవు తెలిసినమ్మాయివి కాదు. మామయ్య కూతురివి" అన్నాను.

రూప నవ్వింది.

రూప నవ్వితే రత్నాలు రాలతాయి. రూప గొంతులో అమృతం వుంది. తను మాట్లాడితే అమృత వర్షం కురుస్తుంది.

"నువ్వు పెద్ద వేటగాడివని కాలేజీలో పేరుండేదట. అది నాకీమధ్యనే తెలిసింది" అంది.

"అందుకే లాయర్ని అయ్యాను"

"రోడ్డుమీద తిరగడానికి" నవ్వింది.

"నన్నుచూస్తే నీకు ఎగతాళి. ఈరోజో బ్రహ్మాండమైన కేసుంది."

"నువ్వు డిఫెన్స్ లాయరివా?"

"ఔను"

"హతోస్మి!! పాపం ఆ అమాయకుడి

చరిత్ర ఈ వేళతో సరన్నమాట''

''మరీ బరితెగించి పోతున్నావ్. నీ బుగ్గలు సాగదీస్తాను''

''షోకుబావా !''

''ఊం...అడుగు''

''నువ్వు కోర్టు లోపలి కంతా వెళ్లేవా ఎప్పుడైనా ?''

''వెళ్లాను''

''కోర్టులో ఇంతవరకూ యువరానర్ ఐ ప్రేఫర్ క్లైం. అనన్నా అడిగేవా ? ...''

రూప నన్ను మరీ ఫుట్‌పాత్ సరుకుక్రింద జమకట్టేస్తోంది.

''డార్లింగ్ ! నీకు తెలీదేమో మా ఊరి ఛైర్మన్‌గారు కూడా లాయరే. ఆయనకి పదిహేనేళ్ల స్టాండింగ్ కూడా వుంది. ఆయనే ఈరోజు వరకూ కోర్టులో 'యువరానర్' అనెరగడు''

''అలాంటప్పుడు నేనెంత అనేగా నువ్వనేది?'' అంది రూప.

బేరర్ వచ్చేడు. రెండు దోశలు ఆర్డరిచ్చి పంపేశాను.

రూపకేసి చూసేను. మినీ మిర్రర్‌లో తనని తాను చూసుకొని మురిసి పోతుంది.

రూపని చూస్తే నాకు పిచ్చిపట్టినట్టుగా వుంటుంది. ఆ పిచ్చినుంచి తట్టుకోడానికి నాకు పదిరోజులు పడుతుంది. అందుకే అసలు వాళ్ళింటికి తరుచుగా పోను నేను.

రూపకేసి చూస్తూ కొన్ని గంటలూ, రోజులూ, వారాలూ, నెలలూ, సంవత్సరాలూ, గడిపేయగలను నేను,

''ఏమిటో కాకి చూపు ?''అంది.

''రెండు కళ్ళతోనూ చూస్తే దిష్టి తగుల్తుందని'' అన్నాను.

దోసెలు తినడం పూర్తయింది. కాఫీలు త్రాగేం. తర్వాత బయటికొచ్చేం. రూప నవ్వుతూ అంది.

''ఇంతకీ దొంగంటే పెద్ద బిగుసుకుపోయేవ్. నీకోటు జేబులో ఏముందో బయటికి తియ్''అంది.

''నా కోటు జేబుసంగతి తర్వాత, ముందు నీ బాగ్ తెరువు'' అన్నాను.

రూప బ్యాగ్ తెరిచి వులిక్కిపడింది తన బాగ్‌లో వున్న రెండు స్టీలు చెంచాలు నిగనిగలాడుతున్నాయి.

''అమ్మో ! గుండెలు తీసిన బంటువి,'' అంది.

నేను నవ్వేను.

''దొంగని ఒక్కడ్ని వేలెత్తి చూపితే, వేలెత్తి చూపిన ఆ మనిషినే దొంగగా నిరూపించగల దీ కోటు''అన్నాను.'

''ఛాల్లే, తెలివి''అంది

''ఇంతకీ నువ్వు మార్నింగ్ షోకేనా ?'' అడిగేను.

''లేదు. నువ్వు కోర్టుకెళ్లడం ఎగ్గొట్టి ఇక్కడ తిరుగుతున్నావని తెలిసి చూసి పోదామని వచ్చేను'' అంది.

అమ్మ నన్ను పోరుపెట్టేస్తోంది. త్వరగా పెళ్లిచేసుకోమని. నాకు రూపంటే ఇష్టం కానీ రూప నాకర్థంకాదు. సరదాగా అల్లరిగా వుంటుందేకానీ నిజంగా నేనంటే తను ఏం అనుకుంటుందో తెలీదు. మాకంటే మామయ్య అన్నివిధాలా ఉన్నవాడు. చూస్తూ చూస్తూ కొత్తగా బోర్డుకట్టిన ప్లీడర్‌కి తన కూతుర్నిస్తాడన్న గ్యారంటీ లేదు.

రూప మనసులో ఏముందో, నేనే తెలుసుకోవాలి. దానికి చిన్న నాటకం ఆడక తప్పదు.

అందుకే అన్నాను,

''దేవి. అని నా ఫ్రెండ్ వస్తానంది తన కోసం వెయిట్ చేస్తున్నాను'' అన్నాను.

రూప మొహంలో రంగులు మారాయి. మూతి విరిచింది.

''నాకు తెలుసు. నువ్వొట్టి రౌడీమేళానివని'' అని వెళ్లబోయింది.

''అదేం వెళ్లిపోతున్నావ్ ?''

''అదెవత్తో వస్తుందన్నావుగా. మీమధ్య దిష్టిబొమ్మలా నేనెందుకూ ?''

విస విస వెళ్లిపోయింది. నేను నవ్వుకున్నాను.

రూపలో జెలసీ కలిగించడమే నా ప్రధాన లక్ష్యం.

నాకుగా నేను బయటపడ్డంకంటే తనే బయటపడేలా చేయాలి.

రెండు రోజులు పూరుకుని, మూడో రోజున ఫోనుచేశాను.

''ఎంతవరకొచ్చింది నీ ఎఫ్ఫైర్?'' అడిగింది.

''ఇంకా పూర్తికాలేదు.''

''సరే. నువ్వోసారి ఇంటికిరా'' అని ఫోను పెట్టేసింది.

రూప చాలా హాట్‌గా వుందని మాత్రం గ్రహించాను. ఆ సాయంత్రం పనిగట్టుకుని మరీ వెళ్లాను.

రూప ఒంటరిగా వుంది. తనముందు కూర్చుంటూ, ''మామయ్య లేడా ?'' అని అడిగాను.

''ఏం మాట్లాడ్డానికి మామయ్యే కావాలా ? నేను పనికిరానా ? అంది విసురుగా.

''అఫ్‌కోర్స్......'' అన్నాను సిగిరెట్ వెలిగిస్తూ.


వెలిగించిన నా సిగిరెట్‌కేసి చూస్తూ అంది.

''ఈ షోకు కూడా మొదలుపెట్టేవన్న మాట''

''నువ్వు నన్ను షోకు బావా అన్నప్పట్నించీ అన్నీ షోగ్గా మొదలెట్టాను. అడపా దడపా మందు కూడా కొట్టేస్తున్నాను''

''మందా?''

''అవును. మందంటేవిస్కీ. దాని తర్వాత మరీ పిచ్చెక్కితే షోగ్గా ఓ పిల్లని వెంటే



సరికొత్త పాతకథ

సుకు తిరగడం'' అన్నాను ఆ మాటలని రూప కళ్లలోకి చూసేను. కసి కొట్టొచ్చి నట్టుగా కనబడింది. ఇంకా నేనలా మాట్లాడితే ఏడ్చేస్తుందనిపించింది. కానీ నాకు సరదాగా వుంది.

''నువ్విటు రావడం తగ్గించేసరికే అనుకొన్నాను. ఎక్కడో ఏదో భాగవతం మొదలెట్టావని'' అంది.

నేను నవ్వేను.

''కోతిలా నవ్వకు. వళ్ళు మండుతోంది'' అంది.

''బాగుంది వరస. పిలిచింది దెబ్బలాడ్డానికా ?'' అన్నాను.

''లేకపోతే వూళ్లో వుండి కూడా పరాయివాడిలా...చేస్తావ్. నాన్న నీ వళ్లు చీరేస్తానని చెప్పమన్నాడు.''

''ఏం పాపం! మీ నాన్నంత మంచి వాడయిపోయాడు.''

''నాకేంతెలుసు. నువ్వే అడుగు'' అంటూ లేచి లోపలకెళ్లింది. రెండు క్షణాల తర్వాత కప్పుతో కాఫీ తెచ్చింది.

''తాగు'' అంది. కాఫీ తాగుతూ వోరగా చూసేను. రూప నన్ను మింగేశీలా చూస్తోంది.

''ఎఫ్ఫైర్ ఎలావుంది?'' అడిగింది.

''ఓ భలే షోగ్గా వుంది. సిటీలో మేం తిరగని చోటంటూ లేదు. మొన్న 'జూ' కెళ్లాం. నిన్న ఇంగ్లీషు సినిమా చూసేం. ఇవాళ గండిపేట పోవాలనుకొన్నాం కానీ నువ్వు రమ్మన్నావని జాలివడి ఇటొచ్చేను. రేపు మాత్రం 'శాంతి' లో మాట్నీ కెళుతున్నాం'' చెప్పాను.

''ఛీ ఆడది. మరీ దానికి సిగ్గెలాలేదు. ఇలా మరీ బరితెగించిన ఆడదంటే నీకు మాత్రం అసహ్యంగాలేదూ ?''

''అసహ్యం దేనికి? సిటీలో అసలు గరల్ ఫ్రెండ్ దొరకటమే కష్టం. ఈమధ్యన ఆడవాళ్లకీ స్కేర్సిటీ వస్తోంది. కోటా తగ్గిపోడంతో బోయ్‌ఫ్రెండ్స్‌కి గర్ల్‌ఫ్రెండ్సు దొరకడంలేదు ' అన్నాను.

రూప అక్కసుగా చూసింది నన్ను.

అంతలో ఫోన్ రింగయింది. రూప రిసీవర్ అందుకొని, ''హలో'' అంది. అవతలి గొంతు వినబడగానే చాలా సంతోషంగా.

''హలో రాజ్!'' అంది.

నేనులిక్కిపడ్డాను. రూప చాలా ఉత్సాహంగా మాట్లాడ్తోంది.

''ష్యూర్! రేపు మ్యాట్నీకెళ్దాం. సరిగ్గా రెండుగంటలకి శాంతి థియేటర్‌కొచ్చేస్తాను'' అని పెట్టేసింది.

''రాజ్ ఎవరు ?'' అడిగేను.

''నా బాయ్‌ఫ్రెండు'' అంది రూప తడవుకోకుండాను.

నాక్కోపం మొచ్చింది.

''ఆడపిల్లవి. మగాళ్లతో తిరగడానికి సిగ్గులేదూ. పైగా సినిమాక్కూడా వెళతావా ?'' అన్నాను.

''నా ఇష్టం. నువ్వెవరు నాకు చెప్పడానికి ?'' అంది.

అంతే లేచి బయటకొచ్చేశాను.

ఆ రాజాగాడెవడో కనబడితే పీకపిసికి చంపేయాలనివుంది. డర్టీ ఫెలో. నా పాలిటి విలన్‌లా దాపురించాడనుకొన్నాను.

మర్నాడు శాంతి థియేటర్ దగ్గరకెళ్లాను. రూప అప్పటికే అక్కడుంది. నన్ను చూసి మూతి ముడుచుకొంది. టికెట్లయిపోయాయి. రూప చేతిలో మాత్రం రెండు టికెట్లు కనబడుతున్నాయి.

నాకు రోషంగా వుంది. రూప పక్కగా వెళ్లి అన్నాను.

''నువ్విలా రావడం ఏమీ బాగోలేదు ఇంటికెళ్లిపో.''

''ఏం నువ్వు రావొచ్చు. ఎవరో దారే పోయేది పిలిస్తే కోతిలా ఇకిలించుకుంటూ వచ్చావు.''

''కోతి కోతి కోసమే వస్తుంది. ఇంతకీ ఆ రాజ్‌గాడు రాలేదా?''అడిగేను.

''వచ్చేడు''అంది.

''ఏడి ?'' చుట్టూ చూస్తూ అడిగేను.

''తొందరెందుకూ? చూపిస్తాన్లె అతస్ది నీలాగే ఏడుపుగొట్టు మొహం'' అంది.

ఎవరికోసమొ ఎదురు చూస్తున్నట్టుగా నించున్నాను.

''అదొచ్చిందా?'' అడిగింది;

''ఏది?'' అడిగాను.

''ఆ దేవి!''

''వచ్చింది''

''ఎక్కడ''

''తొందరెందుకూ ? చూపిస్తాన్లె, దాన్ది నీలాగే మంచు మొహం''అన్నాను.

నా. సా. లేడీస్ క్లబ్

నాగార్జునసాగర్ లేడీస్ క్లబ్‌వారు ఏటా నిర్వహించే సాంస్కృతిక ఉత్సవాలలో భాగంగా యీ ఏడు కూడా అనేక నృత్య సంగీత గానాదులు గల కార్యక్రమాలను నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శినులు శ్రీమతులు శుభాబాల, లలితగార్లు ఎంతో కృషి చేస్తున్నారు. అఖిల భారత స్త్రీల సభలు గుంటూరులో జరిగినప్పుడు నలదమయంతి స్వయంవరం సంగీత రూపకంవేసి యీ క్లబ్‌వారు బహుమతిపొందారు.

ఫస్ట్ బెల్ మ్రోగింది. అంతా లోపలకెళ్లిపోతున్నారు.

"ఏడీ నీ రాజ్‌గాడు ?"

"ఏదీ ఆ దేవి ?"

ఇంకా ఆలస్యం మంచిదికాదనిపించింది.

"నా దేవి నాముందే వుంది. మిస్ రూపాదేవి!" అన్నాను.

రూప వులిక్కిపడింది. కళ్లు పెద్దవి చేసి నావంక చూసింది. ఆ కళ్లల్లో ఒక్కసారిగా దీపాలెలిగాయి. విజయం తనకే లభించినట్టు చూసింది.

"ఈ నాటకం నాకు ముందునుంచీ తెలుసు. అందుకే దెబ్బకిదెబ్బ తీశాను. నువ్వు దేనితో పడితే దానితో తిరుగుతుంటే చూసి వూరుకోడానికి నేను వాజమ్మని కాను. యూ ఆర్ ఓన్లీ మై కింగ్" అంది.

రూప ఇంత తెలివైందని నాకు తెలీదు. లాయర్ని నన్నే బోల్తా కొట్టించేసింది.

"చూడు రూపా! నువ్వు 'లా' చదువు. నా దగ్గర జూనియర్‌గా పెట్టుకుంటాను" అన్నాను.

రూపనవ్వింది. నాకు గాలిలో తేలిపోతున్నట్టుగా వుంది.

"షోకు బావా! నువ్వు నా మెళ్ళో తాళి గట్టాలనుకుంటున్నావేమో. నువ్వుకాదు తాళి గట్టేది నీ మెడలోంచి నీకు నేను కడతాను తాళి. బీకేర్‌ఫుల్" అంది రూప.

"థ్యాంక్స్" అన్నాను.

"ఇంకా సినిమా ఏం చూస్తావ్ గానీ ఇంటికిపద" అంది.

"టిక్కట్లు" అన్నాను.

"ఇంత మంది జనంలో నాకు సినిమా బాగోదు. ఎవరికన్నా ఇచ్చేసి ఇంటికి పోదాం ఇంట్లో నాన్నలేడు. అమ్మ వూళ్ళో ఎలాగూ లేదు" నావంక చిలిపిగా చూస్తూ అంది.

రూప అర్థోక్తిగా అన్న ఆ మాటలకి గర్వంగా చూస్తూ తనతోపాటుగాకదిలేను.

అవీ - ఇవీ - అన్నీ

ఇన్‌లాండ్ కవర్ కథలు






స్నేహదీపిక అనే యువకులు స్థాపించిన సంస్థవారు "ఇన్‌లాండ్ కవర్‌లపై" కథలను పోటీకి ఆహ్వానిస్తున్నారు. ప్రథమబహుమతి 116 రూపాయలు. వివరాలకు స్నేహదీపిక 12—11—32 రాజారంగయ్యప్పారావు వీధి విజయవాడ—1కి వ్రాయవచ్చును. ముగింపు తేదీ మార్చి 31.


శ్రీ చంద్రమౌళి తారావళి

శ్రీ కోళ్ళపూడి మల్లిఖార్జున కవి రచించిన "శ్రీ చంద్రమవుళి తారావళి మా కార్యాలయం చేరింది." 16 పేజీలు, వెల 30 పైసలు ప్రతులకు రచయిత నిడుబ్రోలు, బాపట్ల తాలూకా, గుంటూరు జిల్లా.

శ్రీ వెంకటేశప్రభు తారావళి

శ్రీ కోళ్ళపూడి మల్లిఖార్జునకవి రచన "శ్రీ వెంకటేశ ప్రభు తారావళి' మా కార్యాలయం చేరినది 14 పేజీలు, వెల 30 పైసలు. ప్రతులను రచయిత నిడుబ్రోలు. బాపట్ల తాలూకా, గుంటూరు జిల్లా.

రావు గారి యిల్లు పిల్లలతో కళకళలాడుతూ హడావిడిగా ఉంటుంది. వాళ్ళింట్లో పిల్లలు ఎన్ని సార్లు ఆపినా, తిప్పినా ఆ ర్యాలిఫాన్  మాత్రం అయిదేళ్ళ బట్టీ చెక్కు చెదరకుండా యివాళే కొన్నట్టుగా ఉంటుంది. సెట్టిగారి యింట్లోనే దుకాణం. వ్యాపారం లాగానే ఆయన ర్యాలిఫాన్‌కు  కూడా రాత్రీ పగలూ తీరిక ఉండదు. అయినా దానిమీద మచ్చుకైనా ఒక్క గీత పడలేదు. యిన్నేళ్ళ బట్టీ. రామనాథం గారిది బదిలీ అయ్యే ఉద్యోగం. ఎన్ని సార్లు యీవూరునుంచి ఆవూరు. ఆవూరునుంచి యీవూరు బదిలీ అయినా, ఆయన ర్యాలిఫాన్‌ని  మాత్రం బదిలీ చెయ్యలేదు. అలివేలు గొంతెత్తి పాడుతూవుంటే,  ర్యాలిఫాన్ పక్కనే నిశ్శబ్దంగా వింటూ తనుగూడా ఆనందంలో మునిగిపోయినట్లుంది. రహీమ్ సాయిబు ర్యాలిఫాన్‌ని  ముఖమెత్తి చూశాడో లేదో గాని అది మాత్రం విశేషంగా పనిచేస్తోంది. ఊళ్ళో రోజా తాదాటు తిరుస్తూ అలసటమయ్యే శాస్త్రిగారు ఏమాత్రం పేచీ లేకుండానే కళ్ళు మూసుకుని ర్యాలిఫాన్‌ను  తీసుకున్నారు.)




మీకు ఏమి కావాలో **ర్యాలిఫాన్**కు ఎంతో బాగా తెలుసు


U-RTF-20 TEL

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar. Vijayawada-3. Editor: S. Radhakrishna






మన రామూ పెళ్ళికి
ప్రెజంటేషన్ ఏమిమ్మంటావోయ్ ..!!
నేను రాసిన "విడాకులు" నవల
ఇవ్వక !!



పేర్లు చెబితేగానీ
కదలనివ్వం....
రాధ - సువర్చల - సుబ్బులు -
వరలక్ష్మి - రాణి - సునీత....
అబ్బు! మా పేర్లు
కాదయ్యా! మా
పేర్లు!


తమ్మారెడ్డి కృష్ణమూర్తి సమర్పించు
ధ్రువ చిత్ర వారి
చిన్ననాటి కలలు
దర్శకత్వం: టి. లెనిన్ బాబు B.Sc.,
నిర్మాతలు: టి. భరద్వాజ్ B.E.,
ఇ. యస్. రెడ్డి M.B.B.S.,
ఆంధ్ర-నైజాం: లక్ష్మీ ఫిలింస్